

# కలల కాపురం

శ్రీరామచంద్రుడనుకొన్న భర్తలోని ఒక్కొక్క వ్యసనమూ బయటపడి బంగారు కాపురాన్ని బజారుపాలు చేస్తుంటే... ఆ ఇల్లాలు విరక్తితో ఓడిపోయిందా? లేక ధైర్యంగా నిలబడి తిరిగి భర్తని దారిలోకి తెచ్చుకుందా?

మోర్తల ప్రభాకర్ రెడ్డి



కాంతారావుకి పెళ్ళయి ఇరవై రోజులైంది. 'తేనె చంద్రుడు'.. అదే హనీ మున్నించి తిరిగొచ్చి రెండుగంటలవుతోంది.

శాంతకి బడలికగా వుంది. అయినా ఎలాగో ఓపిగ్గా సామాన్లు సర్దే ప్రయత్నం చేస్తుంది.

'కాంతం! కాంతం!' అన్న పిలుపుకి ఆశ్చర్యపోతూ తలుపు తీసింది. ఎదురుగా—పార్వతీశం! తన భర్తకి ఉన్న చాలా కొద్ది మంది ఫ్రెండ్స్‌లో అతను మరీ ముఖ్యుడనే విషయం పెళ్ళి పందిట్లోనే గ్రహించింది శాంత.

'కాంతం ఉన్నాడాండీ?' పళ్ళికిలిస్తూ అడుగుతున్న పార్వతీశాన్ని చూస్తుంటే చిరాకేసినా, సభ్యత కోసం "ఉన్నారు...రండి....కూర్చోండి" అంటూ భర్తని పిలవడానికి లోపలికెళ్ళింది శాంత.

"మీ ఫ్రెండ్ పార్వతీశం వచ్చాడు" అని తన చిరాకునంతా ప్రదర్శించింది శాంత. అంతవరకూ బెడ్‌రూంలో ట్యూబ్ లైట్ ఎందుకు వెలగడం లేదో తెలుసుకోవాలని నానా తంటాలు పడుతున్న కాంతారావు మొహం ఒక్కసారి వెయ్యి ట్యూబ్ లైట్లంత వెలిగిపోయింది.

"పార్వతీశం వచ్చాడా! అన్నాడు ఆనందంగా. ఏమాత్రం ఆశ్చర్యం వ్యక్తం చేయకుండా.

భర్త మొహంలో కన్పించిన పారవశ్యం చూస్తుంటే శాంతకి ఆ క్షణంలో కోపంతోపాటు ఈర్ష్యలాంటిది కూడా కలిగింది. పెళ్ళయి ఇరవై రోజులే అయింది కాబట్టి. అప్పుడే తన ఏకపాత్రాభినయంతో భర్తని బెదరగొట్టడం ఇష్టం లేక ఆ ప్రోగ్రాం తాత్కాలికంగా వాయిదా వేసింది.

ఒక్క నిముషం తర్వాత— "కాంతం!" అన్న పొలికేక, 'పార్వతీశం!' అన్న గావుకేక, ఆ తర్వాత వారిద్దరూ రతీ మన్మదుల్లా కావలించుకోవడం, వినిపించి కనిపించడంతో ఆమె ఆశ్చర్యంతో మొదట ముక్కు, ఆ తర్వాత చెవుల మీద వేళ్ళు వేసుకుంది.

ఎంచేతనో శాంత ఎడమకన్ను అదరడం మొదలెట్టింది. ఐదు నిముషాల తర్వాత కాకా హోటల్‌లో సర్వర్ అరుపులా 'శాంతా! రెండు కాఫీ!' అన్నా ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

పది నిముషాల తర్వాత కాఫీ ఇవ్వడానికి వరండాలోకి అడుగెట్టబోయి తగ్గుస్వరంలో విన్పిస్తున్న, వాళ్ళ మాటలకి అప్రయత్నంగా ఆగిపోయింది.

"ఎలా గురూ? శాంత నొచ్చుకుంటుందేమో.... ఇంకా అంతా కొత్త కదా...." కాంతారావు సనుగుడు.

"భలే వాడివిరా..ఇంకా ఏం కొత్త...(ఏదో నాటు జోకు— దానికి కాంతారావ్ ఏబ్రాసిలా నవ్వాడు) మా ఆవిడ పుట్టింటికెళ్ళింది... మనగ్యాంగ్ అంతా వస్తామన్నారు. ఏదో ఒకటి

చెప్పి బైటపడు... మళ్ళీ సెవన్ కల్లా వచ్చేయొచ్చులే...'' పార్వతీశం హితబోధ...


వాళ్ళు పార్వతీశం ఇంట్లో ఎందుకు సమావేశం అవుతున్నదీ ఆమెకి బోధపడలేదు గాని తనను మధ్యపెట్టి ఎలాగో అలా రమ్మని చెబుతున్న పార్వతీశాన్నీ... అందుకు సంకోచిస్తున్న భర్త వాలకాన్ని చూస్తే- అదేదో దేశాన్ని ఉద్ధరించే పని మాత్రం కాదని ఇట్టే గ్రహించగలిగింది.

శాంత వస్తున్న అలికిడికి ఇద్దరు కుర్చీల్లో నిటారుగా అయిపోయి, టాపిక్ మార్చేసారు.

''హనీమూన్.. అదీ బాగా జరిగిందా... మా చెల్లాయ్. నీకు భార్యగా లభించడం నిజంగా నీ అదృష్టంరా... లబ్బా... ఎందుకు నీకే అనవసరపు శ్రమ...'' కాఫీ అందుకుంటూ పార్వతీశం... ఎంతబాగా నటిస్తున్నాడు! వేడి...వేడి కాఫీ పార్వతీశం నెత్తిన పోద్దామనిపించింది శాంతకి.

మరో ఐదు నిముషాల తర్వాత పార్వతీశం వెళ్ళిపోయాడు. శాంతకి ఇల్లు శుభ్రం చెయ్యాలనిపించలేదు....పరధ్యానంగా ఆలోచిస్తూ మంచంమీద వాలిపోయింది. జరిగింది చాలా చిన్న సంఘటనే... అందుకు తను అనవసరంగా ఓవర్ రియాక్ట్ అవుతున్నానేమో అని కూడా అనిపించింది. శాంత డిగ్రీ చదివింది. తెలివయింది. ఒక్కతే ఆడపిల్ల కావటం మూలాన చిన్నప్పట్నించి, పెళ్ళయ్యే వరకూ గారాబంగానే పెరిగింది. తను కోరుకున్నది ఏదైనా, ఎలాగైనా దక్కించుకనే పట్టుదల కించిత్తు పెంకితనం కూడా ఆమెలో పసితనం నుంచి చోటు చేసుకున్నాయి.

పెళ్ళి చూపుల్లో కాంతారావుని చూడగానే, శాంతకి అతనుమూర్తీభవించిన మంచితనంలా తోచాడు. అతను తన వివరాలు చెప్పి మీరు ''నాకు ఎంతగానో నచ్చారు... నేను మీకు నచ్చానా?'' అని అడిగి, కొద్దిగా సిగ్గు, ఆదుర్దా మిళితమైన చూపుల్తో, సమాధానం కోసం



తన కళ్ళలోకి చూసిన దృశ్యం ఆమె మనసులో హత్తుకు పోయింది. ఆ దృశ్యం గుర్తొచ్చి నప్పుడల్లా ఆమె చాలా థ్రిల్‌గా ఫీలవుతుంది. అప్రయత్నంగా పెదవుల మీద చిరునవ్వు మెదులుతుంది.

ఉద్యోగం మంచిదే కానీ.. తరుచూ బదీలులుంటాయి... పైగా తల్లీ తండ్రీ తిరుపతిలో ఎక్కడో ఉంటారట... పెద్ద దిక్కు అంటూ ఎవరూ ఉండరు... ఆస్తికూడా పెద్దగా లేదట... తమ బంధువులు తలా ఓ అభ్యంతరం చెప్పడం చూసి , తన తండ్రి తటపటాయిస్తోంటే, శాంతే పట్టుబట్టి అందరి నోళ్ళూ మూయించింది తన కోరిక నెరవేర్చుకుంది.

కాంతారావు చాలా మెతక, మొహమాటాస్తుడనే విషయం, శాంత తేలిగ్గానే గ్రహించింది— అలా అని కాంతారావు చవట సన్నాసి అని కూడా అనుకోకూడదు. అతని మంచితనం, అతి మొహమాటం తీసేసి అతన్ని బేరీజు వేస్తే నూటికి డెబ్బైమార్కులు తెచ్చుకుంటాడు.

పెళ్ళి పందిట్లో పురోహితుడ్ని డామినేట్ చేసేసి, ఆఖరికి తాళి కట్టే సమయంలో, మూడుముళ్ళలో రెండు తనేవేసినంత పన్జేసిన పార్వతీశాన్ని శాంత ఓ కంట కనిపెడుతూనే ఉంది. అతని ప్రభావం కాంతారావు మీద చాలానే ఉందనీ, కొన్ని మాటలూ—సందర్భాలని బట్టి అర్థం చేసుకొంది.

హనీమూన్‌కి ఎక్కడికి వెళ్ళాలి... అక్కడ ప్రోగ్రాం... కాంతారావుకి ఏ డ్రెస్ బావుంటుందీ...వగైరా..వగైరా..విషయాల్లో అతను జోక్యం చేసుకుంటుంటే వొళ్ళు మండింది. కానీ భర్త భాధపడతాడని ఎలాగో నిగ్రహించుకుంది.

ఆమె ఆలోచన్ని తుంచేస్తూ " శాంతా! ఏం అలా వున్నావ్? వంట్లో బాగోలేదా?'? అన్నాడు కాంతారావు అనునయంగా.

"బాగానే వున్నానే...." అంది శాంతి ఏమీ బాగోలేనట్టు.

"భలేగానివే... మొహం అలా వాడిపోయి ఉంటే బావున్నానంటావ్....'? అన్నాడు కాంతారావు మంచం మీద కూర్చుంటూ.

"వాడిపోయింది నామొహం కాదు... మనస్సు!" అని ఉద్వేగంగా అనాలనిపించింది కానీ మరీ సినిమ్యాటిక్‌గా అనిపించి" కొద్దిగా తలనొప్పిగా ఉంది అంతే" అంది శాంత.

"నేను చెప్పానుగా... ఉండు అమృతాంజనం రాస్తాను. అంటూ అల్మారా వైపు నడిచాడు కాంతారావు— శాంత వారిస్తున్నా వినకుండా.

భర్త చూపిస్తున్న ఆదరణకి శాంత మనస్సు ఆర్ద్రమైంది— కానీ అంతలోనే పావుగంట క్రితం పార్వతీశంతో అతని సంభాషణ గుర్తొచ్చి, గుండె ఇనుపగుండు చేసుకుంది.

మళ్ళీ శాంత వద్దని మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా కాంతారావు, శాంతికి లేని

తలనొప్పి పోగొట్టేందుకు అరసీసా అమృతాంజనం పట్టిచ్చి నిజంగానే తలనొప్పి తెప్పించడంలో చాలా వరకూ విజయం సాధించాడు.

''అబ్బ! ఇక చాల్లెండీ...'' అని శాంత చిరాగ్గా అరవడంతో, అంతవరకూ తన సేవా నిరతికి తనేమురిసిపోతున్న కాంతారావు వులిక్కిపడి, శాంతవైపు బిత్తరచూపులు చూడసాగాడు.

శాంత మరోసారి చూపు ఇంజక్షన్ చేయడంతో 'సారీ' అని గొణిగి పిల్లిలా అక్కడ్నుంచి జారుకున్నాడు.

మరో పది నిమిషాల తర్వాత ట్రిమ్‌గా డ్రెస్ అయి, శాంత దగ్గరకు వచ్చాడు. శాంత ఓరకంట అంతా గమనిస్తూనే వుంది. రెండుమూడుసార్లు ఆమె మంచం ముందు పచార్లు చేసి, నాలుగైదు సార్లు ఆమె మొహంలోకి చూసి, ఒకటి రెండుసార్లు ఏదో చెప్పాలని ప్రయత్నించడం... అంతా శాంత గమనించింది.

స్టీమ్ ఇంజన్లా ఓ మారు నిట్టూర్చి ''శాంతా! శాంతా! అని మృదువుగా పిలిచాడు.

''ఆ... ఏమిటి?'' విసుగ్గా అంది శాంత.

''మరే... ఇందాక పార్వతీశం చెప్పాడు — పాంచజన్యం అని మా ఫ్రెండ్ ఒకడున్నాడులే... వాడికి నాలుగు రోజుల క్రితం స్కూటర్ యాక్సిడెంట్ అయ్యి... కాలు విరిగిందట. హాస్పిటల్‌లో వున్నాడట. పాపం నే వెళ్ళి చూసొస్తాను... ఫైవ్‌కల్లా వచ్చేస్తాను... వెళ్ళిరానా?'' అన్నాడు కాంతారావు శాంతతలపైన నాలుగడుగుల ఎత్తులో ఏదో తమాషా జరుగుతున్నట్టు చూస్తూ.

శాంత ఛివాల్న మంచంమీద లేచి కూర్చుంటూ ''పాపం! వాళ్ళావిడ్నికూడా ఓదార్చినట్టుంటుంది... నన్నుకూడా రమ్మంటారా?'' అంది అమాయకంగా — అసాధ్యాన్ని దాచేస్తూ.



## ప్రేమ

''నిన్ను ప్రేమించాలంటే నేనేం చెయ్యాలి రాధా!'' అడిగాడు అప్పారావు.

''ఆ శేఖర్‌లా మోసం చెయ్యకుండా ఉంటే చాలు!'' చెప్పింది రాధ.

—బొండా శ్రీనివాసరావు (అద్దంపల్లి)

కాంతారావు ఓ క్షణం నోరెళ్ళబెట్టి ఇబ్బందిగా గుటకలు మింగి "మరే... అలా చేస్తే బాగానే వుంటుంది. కానీ... నేను వేరే ఫ్రెండ్స్‌తో కలసి వెళ్తున్నాను. నువ్వు వస్తే..." అంటూ నాన్చాడు— ఈసారి తన కాళ్ళ దగ్గరే ఏదో వింతని చూస్తున్నట్టుగా తలొంచుకుని.

శాంతకి వళ్ళు మండింది. మీరు ఎక్కడికి వెళ్తున్నారో నాకు తెలుసు. ఏం చేస్తారో తెలుసు. మీరు ఇలాంటివారు. అలాంటివారు అంటూ పోట్లాడాలని ఎంతగానో అన్పించింది. కానీ అది సమయంకాదని తమాయించుకుంది.

"సాయంత్రం త్వరగా వచ్చేస్తాను... అలా ట్యాంక్‌బండ్‌కి వెళ్దాం... సరేనా?" అంటూ నంగిగా నవ్వుతూ వెళ్ళిపోతున్న భర్తవైపు చూసి బరువుగా నిట్టూర్చింది శాంత.

"ఏం, గురూ... ఇంత ఆలస్యంగానా రావడం?" నిష్ఠూరంగా అన్నాడు పార్వతీశం. అప్పటికే రాంప్రసాద్, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, పాంచజన్యం, పాండురంగం ఇత్యాది మేధాగేస్వరులందరూ కొలువు తీరి వున్నారు.

"ఎంతైనా కొత్త పెళ్ళికొడుకుగా. టైం తెలీడం కష్టం బ్రదర్" సత్యనారాయణ కన్నుగీటుతూ అన్న మాటలకే అంతా మొహం వాచివున్నట్టు నవ్వారు వెకిలిగా.

కాంతారావు మొహమాటానికి కాస్త సిగ్గుపడ్డాడు.

ఆ తర్వాత ఏడెనిమిది గంటలు, అందరూ 'యజ్ఞం' చేస్తూ, చుట్టూ ఉన్న ప్రపంచంతో అన్ని బంధాలూ తెంచుకున్నారు. తొమ్మిది అవుతూండగా అకస్మాత్తుగా కాంతారావుకి జ్ఞానోదయం అయి, డీలాపడిపోయాడు. ఛ ఎంతపని జరిగింది! పాపం తనకోసం శాంత ఎదురుచూస్తూ వుంటుంది. 'ప్యాక్' అని విసురుగా పేకముక్కలు కిందపడేసి, తన దగ్గరున్న టోకెన్స్ అన్నీ లెక్కగట్టి పార్వతీశంకిచ్చాడు. డబ్బు తర్వాత తీసుకుంటానని సగం లేచిన కాంతారావుని కొత్త స్టయిల్‌లో మళ్ళీ కూలేసి మరీ పది మినిట్స్ ఆగు గురూ... నేను ఆ రూటే... డ్రాప్‌చేసి పుణ్యంకట్టుకో.. వచ్చే జన్మలో నీకు ప్రతి ఆటలో జోకర్‌గాపడి, రుణం తీర్చుకుంటాను" అన్నాడు పాంచజన్యం తన సహజధోరణిలో వెకిలిగా నవ్వుతూ.

"లేదు బాస్... శాంత వెయిట్ చేస్తుంటుంది. ఇప్పటికే లేట్ అయింది" మళ్ళీ లేవబోయాడు కాంతారావ్.

"మాకూ ఎందుకో అందుకే పెళ్ళిళ్ళయ్యాయి. మాకు భార్యలున్నారు. వాళ్ళు ఎదురుచూస్తుంటారు. అయినా ఏమంతా అడ్డంలేదు..." రాంప్రసాద్ చిరుకోపంగా అన్నాడు.

కాంతారావు ఏదో చెప్పబోయేంతలో అంతా ఒకేసారి తగులుకున్నారు. దాంతో కాంతారావు అయిష్టంగానే వుండిపోయాడు. పది నిమిషాలు పోయి అరగంట అయింది.

రాత్రి పది కావస్తోంది. కాంతారావ్‌కి ఖంగారుగా... కాస్త గిల్టీగాకూడా వుంది. మధ్య దారిలో "కాంతం... నన్ను మీ ఇంటి దగ్గరే డ్రాప్‌చెయ్యి... నా మిసెస్ వాళ్ళ బాబాయివాళ్ళ ఇంట్లో వుంది. ఈ పూట నేనుకూడా అక్కడే మీటింగ్ అన్నాడు పాంచజన్యం. 'అలాగే' అన్నాడు కాంతారావ్ పరధ్యానంగా.

"గుడ్‌నైట్" అని ఆవీధంతా అదిరిపోయేట్టు అరిచి, ఓ సందులోకి దూరి మాయమయ్యాడు పాంచజన్యం.

స్కూటర్ లాక్ చేస్తోంటే శాంత తలుపు తీయడం గమనించి గతుక్కుమన్నాడు. కాంతారావు ముందే రిహార్సల్స్ చేసుకున్న దాని ప్రకారం "సారీ శాంతా... అని మరేదో చెప్పబోయి నవ్వుతూ ఎదురువచ్చిన శాంతవిచూసి తికమకపడ్డాడు.

"అబ్బ! అంత పెద్దగా గుడ్‌నైట్ చెప్పిన ఆ పెద్దమనిషెవరండీ" అంది శాంత. వెంటనే కాంతరావు పరధ్యానంగా "వాడా... పాంచజన్యం! వాడెప్పుడూ అంతే! ప్రతీదీ లౌడ్‌గా వుంటుంది" అని మరేదో అనబోయి, అంతలోనే శాంత మొహంలో నవ్వు మాయమవ్వడం తను చేసిన ఘోర తప్పిదం రెండూ ఒకేసారి గ్రహించాడు.

శాంత మొహంలోకి చూడలేక గబగబా లోపలికి వెళ్ళిపోయాడు. శాంత ఇక వేయబోయే ప్రశ్నలకి ఏం జవాబులివ్వాలో అని కరెంట్‌లా ఆలోచిస్తుండగా...

"మనదేశంలో సైన్స్ ఇంత అభివృద్ధి చెందిందనే విషయం నాకింతవరకూ తెలీదే? నాలుగురోజుల క్రితం కాలు విరిగిన వ్యక్తి, అప్పుడే మామూలుగా అయిపోయాడంటే.... అమ్మో" అంటున్న శాంతకి అడ్డువచ్చి—

"అబ్బే... అదికాదు శాంతా... అసలేం జరిగిందంటే... కాలు విరిగింది పాంచజన్యానికి కాదు... నేను పొరపాటు పడ్డాను. పాండురంగం అని మరో ఫ్రెండ్ ఉన్నాడు పాపం! వాడికి

## పారం



షూటింగ్‌కి యధాతధంగా లేట్‌గా వచ్చిన గోవిందని నిర్మాత చిరునవ్వుతో ఆహ్వానించి మేకప్‌రూంలో కూర్చోబెట్టి "షాట్‌కి పిలుస్తా. ఇక్కడే వుండండి" అని ఎంతో మర్యాదగా చెప్పాడు.

సాయంత్రమైనా పిలుపు రాకపోవడంతో గోవిందా బైటకొచ్చి చూసేసరికి మిగతా ఆర్టిస్టుల్తో షూటింగ్ పూర్తవడం, పేకప్ అయిపోవడం అంతా జరిగిపోయింది.

అతనా షాక్ నుంచి తేరుకోకముందే "ఇవాల్టికిక ఇంటికి వెళ్ళండి" అంటూ నవ్వి చెప్పాడు నిర్మాత.

బుద్ధి చెప్పడం అంటే ఇదే!

—స్టాక్

విరిగింది. వీడికేం రాస్కెల్! గుండ్రాయిలా వున్నాడు. హిహీహీ...'' అంటూ ఏడ్రాసిలా నవ్వాడు కాంతారావ్.

ఓహో అలాగా... పండురంగమో... రోగమో... ఎవరికి ఏం విరిగితే నాకేమిటిలెండి... రండి భోంచేద్దురుగానీ... అంటూ వంటింట్లోకి దారితీసింది శాంత.

తన తెలివికి తనే మురిసిపోతూ డైనింగ్ టేబుల్ముందు కూర్చున్నాడు కాంతారావ్.

శాంతని మచ్చిక చేసుకోడాన్కి ''నువ్వుకూడా భోంచెయ్ శాంతా'' అన్నాడు ఆదరంగా.

''నాకు ఆకలిగా లేదు. మీరు కానివ్వండి'' చిరుకోపంగా అంది శాంత.

''అదుగో నీకింకా కోపం తగ్గలేదు... అయితే నేనుకూడా తినను'' అన్నాడు ఆదరంగా.

''మీ ఇష్టం— గిన్నెలు అవీ సర్దాలి'' అంది నిర్దయగా. కాంతారావ్కి చచ్చేంత ఆకలేస్తోంది. తను బెట్టుచేస్తే ఆమె దారికొస్తుందనుకున్నాడుగానీ మొదటికే మోసం వస్తుందనుకోలేదు. తన చావు తెలివికి తగిన శాస్తి జరిగిందని లోలోపలే ఏడ్చి పైకిమాత్రం కనీసం వ్రతంచెడ్డా ఫలితం దక్కించుకుందామనుకుని రాజీ ధోరణిలో ''పోనీ నేను కలిపి పెడతాను. తింటావా?'' అని ఊపిరి బిగబట్టాడు. భర్త ఉద్దేశ్యం గ్రహించింది శాంత. ఓ క్షణం పట్టు సడలింది. అంతలోనే భర్తకి ఆమాత్రం శాస్తి జరగాలని ''నాకు వద్దు... నేను తినను... అంతే'' అంది కసాయిలా. పైపెచ్చు ''ఈరోజు మీకిష్టమని బంగాళాదుంపల వేపుడు... ఎగ్ కర్రీ వగైరా చేశాను. అయినా ఏం చేస్తాం... దేనికైనా ప్రాప్తం వుండాలి'' అని నిట్టూర్చి పాత్రలు ఫ్రిజ్లో సర్దసాగింది.

కాంతారావుకి ఏడుపొచ్చింది. తన స్థితి తలచుకుంటే. ఓ క్షణం వేతులెత్తేద్దామా అనుకున్నాడుగానీ అహం అడ్డొచ్చింది. శాంతకేనా అంత పట్టుదల? ఒక్క పూట తినకపోతే చస్తానా? నీరసంగా మంచంమీద కూలబడ్డాడు. కాసేపు శాంతకోసం ఎదురుచూసి, అలాగే మగత నిద్రలోకి జారిపోయాడు.

ఉన్నట్టుండి కాంతారావ్కి మెలకువ వచ్చింది. అప్రయత్నంగా టేబుల్ క్లాక్వైపు చూశాడు. రెండు కావస్తోంది. శాంత ఏడుస్తోంది. శబ్దం వినిపించకుండా పవిటచెంగు నోట్లో కుక్కుకుని ఆమె మౌనంగా రోదిస్తోంది.

ఓ క్షణం కాంతారావు మెదడు మొద్దుబారినట్లయింది... వెంటనే తేరుకుని ''శాంతా!... శాంతా!..'' అని ఆదుర్దాగా తనవైపు తిప్పుకున్నాడు... ఆమె తన చేతుల్ని విదిలించేస్తున్నా బలవంతంగా ఆమెని పొదివి పట్టుకుని ఆమె మొహంలోకి చూస్తూ.... ఏమిటి శాంత? ఏం జరిగింది?'' అన్నాడు పీల స్వరంతో...

భర్తవైపు ఓసారి దీనంగా చూసి అంతలోనే తీక్షణంగా ఏమైందట? ఏమీ తెలీనట్టు? అంది వెక్కుతూ..

పది నిమిషాలు తంటాలుపడి కాంతారావు ఆమెని మామూలు స్థితికి తెచ్చాడు.


''మధ్యాహ్నం మీరు ఎక్కడికి వెళ్ళారు? ఎవడికో కాలు విరిగింది అని నాతో అబద్ధం ఎందుకు చెప్పాల్సి వచ్చింది... నిజం చెప్పండి?'' శాంతకి ఇంకా కోపం తగ్గమేదు.

కాంతారావుకి ఒక్క క్షణం నిజం చెప్పేద్దాం అనిపించింది... అంతలోనే రాంప్రసాద్ ఇలాంటి స్థితిలోనే నిజం చెప్పినందుకు ఆ తర్వాత వాళ్ళావిడ ఏం చేసిందో గుర్తొచ్చింది.

రాంప్రసాద్ తన పెళ్ళయిన కొత్తలో ప్రతి ఆదివారం, మిగతా రోజుల్లో, ఆఫీస్ అయిపోయాక కూడా దాదాపు ఇంట్లో ఉండకపోవడం, చూసి చూసి విసిగి ఓ రోజు రాంప్రసాద్‌ని నిలదీస్తే... వాడు హరిశ్చంద్రుడిలా ఫీలైపోయి మరేం లేదు. నువ్వు అర్థం చేసుకుంటావనే ధైర్యంతోనే చెబుతున్నాను... నాకు కాలేజీ డేస్ నుండి కార్డ్స్ అంటే పిచ్చి... ఏదో ఫ్రెండ్సుతో అప్పుడప్పుడు ఇలా... '' అని ఏదో చెప్పబోయేంతలో వాళ్ళావిడ ఓ నిమిషం వంటింట్లోకి వెళ్ళి వచ్చి... ఆ తర్వాత మీ దగ్గర అగ్గిపెట్టె వుందా...?'' అని గంభీరంగా అడిగిందట...

''ఏం? ఈ మధ్య నువ్వు కూడా సిగరెట్స్ అలవాటు చేసుకున్నావా?'' అని తన సహజ ధోరణిలో ముతక జోక్ ఒకటి వేసి వేయకముందే ఆమె వొంగి రాంప్రసాద్ గాడి కాళ్ళకి దండం పెట్టి ''నేను వెళ్ళిపోతున్నాను'' అందట.

ఎక్కడికి అని అడుగాలని నోరు తెరవబోయి, బదులుగా ముక్కు మూసుకున్నాడట, కిరసనాయిల్ వాసన గుప్ మని కొట్టడంతో వెంటనే రాంప్రసాద్‌కి తన భార్య ప్రోగ్రాం అర్థమయిపోయి... అమాంతం ఆమె కాళ్ళమీద పడ్డంత పని చేసాడు.. ఆ రాత్రంతా ఆమెని బ్రతిమాలి, ఎన్నో వాగ్దానాలూ, శపథాలు, ఒట్లు వేసుకున్నాక ఆమెలో కొంత మార్పువచ్చిందట... ఆ తర్వాత కూడా ఇంట్లో ఎప్పుడూ నలభై లీటర్ల కిరసనాయిలూ పది



దజన్ల అగ్గిపెట్టెలు స్టాక్ వుంచేట్టు ఏర్పాటు చేసిందట. ఆ దెబ్బలో రాంప్రసాద్ తాత్కాలికంగా పేక సన్యాసం చేయాల్సి వచ్చింది...

ఆ తర్వాత అతను ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టు, నిరుత్సాహంగా, నిర్లిప్తంగా వుండటం.. నిదరలో జోకర్ జాక్‌పాట్ అంటూ కలవరించడం వగైరా చేసినా అతని భార్య తన పట్టు విడువలేదట... మూడేళ్ళ తర్వాత వాళ్ళ బుజ్జిగాడు పది తర్వాత ఏం వస్తుంది డాడీ అన్నప్పుడు రాంప్రసాద్... "జాకీ, రాణీ కింగ్" అని విషాదంగా చెప్పినప్పుడు మాత్రం చలించిపోయి..... నెలలో రెండు ఆదివారాలు మాత్రం అతను పేకాడ ఆడుకోడానికి అది కూడా పన్నెండు నుండి ఏడు గంటలవరకూ మాత్రం పర్మిషన్ ఇచ్చిందని రాంప్రసాద్ ఏడుస్తూ చెప్పిన విషాద గాథ కాంతారావు మనసుమీద చెరగని ముద్ర వేసింది.

ప్రస్తుతం తన స్థితి కూడా అలా మారకుండా వుండాలంటే ఓ నిజం లాంటి అబద్ధం తను చెప్పాలి! కానీ ఏం చెప్పాలి?

ఆంజనేయస్వామి గుడికెళ్ళి అర్చన చేయించానని, ఆండాళ్ళమ్మగారింటి కెళ్ళి అప్పడాలు వత్తడంలో సాయం చేశానని చెబితే శాంత నమ్ముతుందా? నో నెవ్వర్! మరి ఏం చెప్పాలి? తను ఈ పరిస్థితి గురించి ముందే జాగ్రత్త పడనందుకు తనను తానే బండ బూతులు తిట్టుకున్నాడు...

"చెప్పండి... ఎందుకు అలా చెప్పారు?" శాంత రెట్టించింది.

భారంగా నిట్టూర్చి "చెబుతాను శాంత... చెబుతాను... మన పెళ్ళి అయిన రోజునుంచీ మా ఫ్రెండ్సు అంతా పార్టీ ఇవ్వు..." అని గోల పెడుతున్నారు... పెళ్ళి హడావిడీ... ఆ వెంటనే మన హనీమూన్ ప్రయాణం వగైరాల వల్ల ఇంత వరకూ వీలు పడలేదు... హోటల్‌లో అంటే బోలెడు ఖర్చవుతుంది, పైగా వెలాఫరు కదా అని నేను సందేహిస్తుంటే... దేవుడిలా పార్వతీశం, వాళ్ళ ఇంట్లో అరేంజ్ చేస్తానన్నాడు... ఎప్పుడో అప్పుడు ఇవ్వాల్సిందేకదా.... సరే అని వెళ్ళాను... కాకపోతే పార్టీ అంటే... గందరగోళంగా వుంటుందని నిన్ను తీసుకెళ్ళలేదు...

"అంటే మీరు తాగుతారా... ?" అంది శాంత మరో దండయాత్రకు సిద్ధమౌతూ...

కాంతరావు అదోరకంగా నవ్వి " భలేదానివి.... నీకు నేను తాగుబోతులా కనిపిస్తున్నానా? అని ఆమె అవును అంటుందేమోనని భయంవేసి ఆమెకి ఆ అవకాశం ఇవ్వకుండా.... "కావాలంటే నవ్వే చూసుకో నా దగ్గరేమైనా అలాంటి వెధవ వాసనలు వస్తున్నాయేమో? అని శాంతకి చాలా దూరంగా జరిగి "ఇంత వరకూ నాకు అలాంటి అలవాట్లు లేవు, కాకపోతే మా వాళ్ళు కాస్త పుచ్చుకుంటారు... వాళ్ళకి ఇష్టమైనది ఇప్పించాలిగా.." అని నాన్చాడు.



"ఆ మాటేదో నాతో చెప్పి వెళ్ళవచ్చుకదా...?" అంది శాంత నిష్ఠూరంగా... కాంతారావుకి చికాకు వేసింది... అయినా అది కనబడనీయకుండా... " సామాన్యంగా మందుపార్టీ అంటే ఏ భార్య మాత్రం గొడవ చేయకుండా వుంటుంది చెప్పు...? నువ్వు ఏదేదో ఊహించుకుని బాధపడతావని.. అలా చెప్పాను... కానీ ఇలా అవుతుందని నువ్వింత

హర్ట్ అవుతావని ఊహించి వుంటే... నిజం చెప్పి ఉండే వాడ్ని... ఐ యామ్ సారీ శాంతా'' అన్నాడు పశ్చాత్తాపం ధ్వనిస్తున్న స్వరంతో...

పాపం శాంత కాంతారావుని క్షమించి పోనీండి మీరు అంతా చెప్పారుగా... ఇప్పుడు నా మనసు తేలిగ్గా వుంది.... రండి భోంచేద్దురుగానీ'' అని లేచింది.

''టైం రెండు కావస్తోంది... ఇప్పుడేం భోజనం? పడుకుందాం.. అని శాంతని దగ్గరికి లాక్కున్నాడు.

ఆ తర్వాత రెండు ఆదివారాలు వచ్చినా ముందు జాగ్రత్త కోసం కాంతారావు ఇంటిపట్టునే వున్నాడు. శాంతని సంతోషపరచడానికి టూరిస్టు గైడ్‌లా ఆమెకి చార్మినార్, జూపార్కు, గండిపేట, గోల్కొండ, మ్యూజియం, వగైరా... అన్నీ చూపించాడు. అంతేకాక శాంత వద్దు మొర్రో అని గోలపెడుతున్నా షాపింగ్‌కి తీసుకెళ్ళి నానా చెత్త కొని ఆమెని మచ్చిక చేసుకునే ప్రయత్నం కూడా చేసాడు.

ప్రతిరోజూ సాయంత్రం పార్వతీశాన్ని కలవడం మాత్రం మానలేదు. ఆరు అయ్యేసరికి పార్వతీశం కాంతారావు గుమ్మం ముందు ప్రత్యక్షం! ఒక్కోసారి డాబా మీద తొమ్మిది పదింటి వరకూ కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. ఎక్కువగా అలా వెళ్ళివస్తాం అంటూ వీధినపడేవారు.

అలాంటప్పుడే శాంతకి ఒంటరితనం మరీ దుర్భరంగా అనిపించేది. తన సమక్షంలో లేకపోయినా డాబామీద వాళ్ళు కబుర్లు చెప్పుకుంటున్నందుకు, కొంతలో కొంత తృప్తిగా ఫీలయ్యేది. ఏదో మిషతో, కాంతారావుని పిలిచి ఐదు, పది నిమిషాలు అతనితో గడిపేది.

ఆఖరికి, ఉండబట్టలేక ఓ రోజు— ''పార్వతీశం భార్య ఊళ్ళో లేదా?'' అంది ప్రారంభంగా.

కాంతారావు కొద్దిగా ఆశ్చర్యపడి ఎందుకలా అడిగావ్?... ఉందే!'' అన్నాడు కాఫీ సిప్‌చేస్తూ.

''మరేం లేదు... అతనలా ఎప్పుడు మనింటి చుట్టే తిరుగుతోంటేను... ఓ అదా! వాళ్ళావిడ ఉన్నా లేకపోయినా వాడంతే! నన్ను రోజూ కలవనిదే ఉండలేడు'' అన్నాడు కాంతారావు అదేదో గొప్ప విషయమైనట్టు.

''అలాగా'' ఆవిడ ఏమీ అనదా... ఇతనిలా ఎప్పుడు బైట తిరుగుతోంటే...?

''ఏమంటుంది? ఆవిడ పేరు భూదేవిలే! మా వాడు, ఇప్పుడింకా నయం పెళ్ళయిన కొత్తలో మరీ ఘోరం! ఒక్కోసారి ఏ రెండు మూడు రోజులకో ఇంటికొచ్చేవాడు'' పరధ్యానంగా అని నాలుక చాలావరకు కొరికేసుకున్నాడు కాంతారావు.

''నిజమా! మీ ఫ్రెండ్ ఏదో ఆపోజిట్‌లా వున్నాడే..? పెళ్ళయిన కొత్తలో అందరూ ఎక్కువగా ఇంటి పట్టునే వుంటారే...'' ఆరాతీసే డిటెక్టివ్‌లా అంది శాంత.

''అది కాదు.. అప్పట్లో వాడికి పేకాట...'' అని నోటిదాకా వచ్చింది కాని ఎలాగో కంట్రోల్ చేసుకుని నాటకాల పిచ్చి వుండేది. మేం అంతా ఎంతో చెప్పిన మీదట వాడు కాస్త దారిలో వచ్చాడు'' అనర్గళంగా అబద్ధాలు చెప్పగలుగుతున్నందుకు తనను తానే అభినందించుకున్నాడు కాంతారావు. శాంత చురుగ్గా చూసి మరేదో అనబోతుంటే ''చూడు శాంతా లోకంలో ఒక్కొరిది ఒక్కో తీరు... ఎవరి పిచ్చి వారికానందం. బేసిక్‌గా పార్వతీశం చాలా మంచివాడు. నేనంటే ప్రాణం. వాడిలో ఏవో లోపాలుండొచ్చు. ఆ మాటకొస్తే లోపాలు లేని దెవర్లో! అని ఓ కాండక్టు సర్టిఫికెట్ లాటిదిచ్చాడు.

శాంతకి వొళ్ళు మండింది. పార్వతీశం వ్యక్తిగత విషయాల్ల పట్ల నాకెలాంటి ఆసక్తి లేదు. కాకపోతే రోజూ మన ఇంటికి రావడం, మిమ్మల్ని వెంటేసుకుని బజారులన్నీ చెడదిరగడం— మీరు ఏ అర్ధరాత్రో ఇంటికి చేరడం... ఇవి ఇవన్నీ నాకు నచ్చడంలేదంతే!

శాంతలో వచ్చిన మార్పుకి కాంతారావు ఓ క్షణం నివ్వెరపోయాడు. అంతలోనే నచ్చచెబుతున్నట్టు నేను ప్రొద్దుననగా ఆఫీసుకెళతాను. ఉసూరుమంటూ సాయంత్రం వస్తాను. ఫ్రెండ్సుతో కలిసి వాళ్ళతో కాసేపు సరదగా గడిపితే రిలీఫ్‌గా వుంటుందని...

''మీరొక్కరికేనా అలాంటి కోరికలు... నాకు మాత్రం రిలీఫ్ అవసరంలేదా? నేనూ ప్రొద్దుట్నుంచీ... రాత్రి వరకూ ఏదో ఒక పని చేస్తూనే వుంటాను. సాయంత్రం ఆరు ఎప్పుడవుతుందా? ఎప్పుడెప్పుడు మీరు వస్తారా... మీతో మాట్లాడాలనీ, మీ సాన్నిహిత్యంలో సేద తీరాలని నేనంత ఆరాటపడుతుంటానో మీరెప్పుడైనా ఆలోచించారా? నేను కోరేది ఏమైనా అన్యాయమా? నా ఆశ ఏమైనా దురాశా? గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతున్న శాంతని గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు కాంతారావు.

''అది కాదు శాంత, నువ్వు చెప్పేది కూడా నిజమే. కానీ అన్ని విషయాల్లూ నీతో

## జబ్బు



''నిన్ను చూడగానే నా హృదయం జల్లుమంటుంది రాణీ'' పరవశంగా అన్నాడు రాజు.

''అదేమైనా జబ్బేమో రాజు, డాక్టర్‌కు చూపించుకోకూడదూ!'' అంది రాణి.

—జి.లలిత
(ఒంగోలు)

మాట్లాడలేను కదా... కొన్ని చెప్పినా నీకు అర్థం కావు. నాకున్న చాలా కొద్దిమంది ఫ్రెండ్స్‌లో పార్వతీశం ముఖ్యుడు. ఆరో క్లాస్ నుంచి ఫ్రెండ్స్‌మి. రోజూ వాడితో కాసేపైనా గడపకపోతే నాకు ఏదో వెలితిగా వుంటుంది. మొదట్నుంచీ అంతే!'' అంటూ తన ప్రవర్తనని సమర్థించుకోజూస్తున్న భర్తని చూస్తుంటే శాంతకి భర్త మాటలకన్నా అతని మనసులో తనతో సమానమో, ఒక విధంగా మరింత ఉన్నతమైన స్థానం ఆక్రమించిన పార్వతీశం పట్ల ఈర్ష్యాద్వేషాలు రగులుకుని, ఆ కోపం భర్తమీద చూపెట్టా చేసింది.

''ఎంత ఆదర్శ స్నేహం! కట్టుకున్న భార్య కన్నా మీ స్నేహితులే ముఖ్యమా... అలాంటప్పుడు పెళ్లెందుకు చేసుకున్నారు..?'' శాంతకి ఓ క్షణం తను మరీ హద్దుమీరి మొండిగా వాదిస్తున్నానేమోననే భావం కలిగింది. అయినా ఆమె వెనక్కి తగ్గదల్చుకోలేదు.

తను అన్న ఆఖరి మాటకి భర్త హర్ట్ అయినట్టు ఆమె గ్రహించింది. కాంతారావుకి నిజంగానే బాధనిపించింది. తను ఏమన్నాడని... భార్య చిన్న విషయానికి అంత రాద్ధాంతం చేసి నిష్ఠూరంగా మాట్లాడడం కోపం తెప్పించింది.

అతని మొహం ఎరుపెక్కడం, దవడ ఎముక బిగుసుకోవడం చూసిన శాంత తడబడింది. ఎప్పుడు సౌమ్యంగా మూర్తీభవించిన మంచితనంలా వుండే భర్త మొహంలో కోపపు ఛాయలు చూడ్డం ఆమెకి అదే మొదటిసారి. ఆమెకి ఓ కొత్త మనిషిని చూసినట్టుగా వుంది. ఆమె క్షమాపణ ధోరణిలో ఏదో అనబోయేంతలో కాంతారావు విసురుగా ఆమె వైపు తిరిగి నీ కన్నా నా ఫ్రెండ్స్ ముఖ్యం అని నేనెంత వరకూ అనుకోలేదు– అనుకునేట్టు చేస్తే అది నా తప్పు కాదు— నీదే అవుతుంది. ఇక పెళ్లెందుకు చేసుకున్నానంటే.. ముందైతే వేరే కారణాలవల్ల... కాని ఇప్పుడైతే అనిపిస్తోంది బుద్ధిలేక అని పళ్ళబిగువున అతను అన్న మాటలు శాంత మనసుని కఠెల్లా తాకాయి. అంతవరకూ ధీమాగా కోపంగా మాట్లాడిన ఆమె ఒక్కసారి అచేతనురాలైంది. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అది గమనించని కాంతారావు విసురుగా బైటికెళ్ళిపోయాడు.

కాంతారావు వెళ్ళిపోయాక శాంత చాలా సేపటివరకూ ఏడుస్తూనే వుంది. ఆమె ఒక్కసారి జరిగింది గుర్తుకు తెచ్చుకుంది. తన అభిప్రాయంలో లోపం ఏమీ లేదనిపించింది. కాకపోతే భర్తకి నచ్చచెప్పబోయి ఘర్షణపడ్డ విధానం తప్పనిపించింది. అంచెలంచెలుగా భర్తని తన దారిలోకి మళ్ళించే ప్రయత్నం చేసి వుంటే బావుండేదనిపించింది.

శాంతతో ఘర్షణ పడివెళ్ళిన కాంతారావుకి కూడా గిల్టీగా అనిపించసాగింది. పార్వతీశాన్ని కూడా కలువలేదు.

హుటాహుటిన రాంప్రసాద్ ఇంటికెళ్ళాడు. రాంప్రసాద్ ఇంట్లోలేడు. తిరిగి వచ్చేస్తుంటే పాన్‌షాప్ దగ్గర కనిపించాడు. కాంతారావు మొహం చూడగానే ఏదో విశేషం జరిగిందని గ్రహించాడు ప్రసాద్. అయిష్టంగానే హోటల్‌లో కాఫీ తాగి ఎదురుగా కన్పిస్తున్న

ఓ మున్సిపల్ పార్కులోకి దారితీశాడు కాంతారావు.

రాంప్రసాద్ రెండు మూడుసార్లు అడిగాక తడబడుతూ ఏటో చూస్తూ పార్కులో గడ్డి సగంపైగానే పీకేస్తూ జరిగింది చెప్పాడు కాంతారావు.

"ఇందులో నా తప్పేమైనా వుందా? చెప్పు ప్రసాద్...." అన్నాడు సపోర్టు ఏమైనా దొరుకుతుందేమోనని చెవులు సాగతీసుకుని.

"ఇచ్చితంగా వుంది" అని నవ్వుతూ చెప్పాడు రాంప్రసాద్.

విస్మెరపోయి చూసాడు కాంతారావు. అతనికి కాస్త కోపం కూడా వచ్చింది. అవును బ్రదర్... ఇందులో తప్పు ఎక్కువగా నీదే అని చెప్పడానికి బాధగా వుంది" అని మరోసారి శాడిస్ట్‌లా నవ్వాడు ప్రసాద్.

రోడ్డుసైడు జోతిష్యుడిలా 'నీకు పెళ్ళయి రెండు నెలలైంది... అవునా?" అన్నాడు. ప్రసాద్ ఉపోద్ఘాతంగా. గొర్రెలా తలాడించాడు కాంతారావు.


"అలాంటప్పుడు నీ ప్రవర్తన ఎలా వుండాలి?" అని ప్రశ్నవేసి కాంతారావు ఏదో చెబుతున్నా వినిపించుకోకుండా "ఎలా వుండాలో నాకూ తెలీదు. కానీ నీలా మాత్రం ఉండకూడదని మాత్రం ఇచ్చితంగా చెప్పగలను" అన్నాడు అనుమానంగా.

రాంప్రసాద్ ధోరణి కాంతారావుకి అయోమయంగా వుంది.

"అంటే ఫ్రెండ్స్‌ని కలవనే కూడదా ఎంత కొత్తగా పెళ్ళయితే మాత్రం! పోనీ పెళ్ళయి చాలా కాలం అయితే రోజూ కలవచ్చా?" వెటకారంగా అన్నాడు కాంతారావు.

"అది కాదు కాంతం!... మొదటిసారి ... ఐ మీన్ కొత్తగా పెళ్ళయిన అమ్మాయి పరిస్థితి ఒక్కసారి ఆలోచించు... అని కాంతారావుకి అందుకు కాస్త టైం ఇచ్చాడు. కాంతారావు మరుగ్గా మాడ్డంతో మళ్ళీ అందుకుని "ఆమె ఎన్ని ఆశలతో కోరికలతో నీతో

# ప్రజల మనిషి



మన దేశ రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ ఆడంబరాలకు చాలా దూరంగా వుంటారు. రాష్ట్రపతి పదవికి నామినేషన్ వేసిన తరువాత ఆయన రాజకీయాలకుగానీ, రాజీయ నాయకులలోగానీ సంబంధం ఉన్న ఏ సభలకూ హాజరుకాలేదు. ఉపరాష్ట్రపతిగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలలో ప్రయాణం చేసి కాన్వాస్ చేయగల సదుపాయం ఆయనకు ఉన్నా ఉపయోగించుకోలేదు. రాష్ట్రపతిగా ఎన్నిక అయిన వెంటనే ఆయన "ఇప్పుడు నా బాధ్యత చాలా పరిమితమైన పరిధిలోనే వుంటుంది. మీరుచేసే పనులు చూస్తూ ఉండడమే నా పని" అన్నారట పార్లమెంటు సభ్యులతో. ఏది ఏమైనా భరాత రాజ్యాంగాన్ని, న్యాయశాస్త్రాన్ని, రాజకీయాల్ని కాచివడబోసిన శర్మగారు రాష్ట్రపతి కావడం మన దేశ అదృష్టం.

—జూపిటర్

జీతం... సారీ జీవితం పంచుకునేందుకు ఉవ్విళ్ళూరుతుంటుంది'' అలా అంటున్నప్పుడు తన పెళ్ళయిన కొత్తలో తనెంత గొప్పగా ప్రవర్తించిందీ ప్రస్తుతం కూడా తనెంత ఆదర్శంగా ప్రవర్తిస్తున్నదీ గుర్తొచ్చి క్షణకాలం గిల్టీగా ఫీలయ్యాడు. అయినా గొప్పగా ప్రవర్తించనంత మాత్రాన ఇతరులకి గొప్ప సలహాలు ఇవ్వకూడదనే రూలేది లేదుగా... అని సరిపెట్టుకుని మళ్ళీ మొదలెట్టాడు ప్రసాద్. ''అలా నీ జీవితంలో ప్రవేశించిన అమ్మాయి, నీ నుంచి ఏం కోరుకుంటుంది? ఫీల్ అప్ ది బ్లాంక్స్‌లా నీ సాన్నిహిత్యం అని తనే చెప్పి భార్య తన కోసం గుమ్మంలో ఎదురుచూస్తూ వుంటుందని గుర్తొచ్చి ఓ క్షణం మొహం మాడి పోయింది. అంతలోనే లోక కళ్యాణం కోసం తన భార్య తన కోసం, మరి కాసేపు వేచి చూడక తప్పదని నిర్ధారించి ''మగాడికి ప్రేమ ఎక్కువ. అదే స్త్రీల విషయంలో ఎంత సేపు భర్త ఇల్లు పిల్లలూ... మహా అయితే ఇరుగుపొరుగు వాళ్ళు... ఇంతేగా... నీ విషయంలో ఇంకా అంతా కొత్తేగా ... (నవ్వు) చెల్లాయ్ కి ఇంకా ఎవరితో పెద్దగా పరిచయం కూడా ఏర్పడి వుండదు... అలాంటప్పుడు ఆమె నిన్నే సర్వస్వంగా భావించడంలో వింతేముంది? అయినా మన పార్వతీశానికి కూడా బుర్ర లేదు. ఏదో బైట కలుసుకోవడం... అడపా దడపా పేకాట... మందు కొట్టడం వరకూ ఓకే... కాని ఇలా ఉచనుగా రోజూ ఆరింటికల్లా మీ ఇంట్లో జొరబడి నవ్వేదో వాడి సెకెండ్ వైఫ్ అయినట్టు అన్నేసి గంటలు నీతో కాపురం చేసేస్తోంటే ఎవరు మాత్రం సహిస్తారు...? ఇందులో సిస్టర్ తప్పేంలేదు. నువ్వే నీ పద్ధతి మార్చుకోవాలి... కావాలంటే పార్వతీశానికి నేను చెబుతాన్లే.. వెళ్దాం పద.. ఇప్పటికే ఆలశ్యం అయింది'' అంటూ తన ఏకపాత్రాభినయం ముగించి లేచాడు రాంప్రసాద్

ప్రసాద్ చెప్పింది కొంత వరకూ కాంతారావు తలకెక్కింది. కానీ పార్వతీశం మీదున్న అభిమానం, తను అకారణంగా తప్పు చేయడనే అహం తోడై ఇంకా పూర్తిగా జ్ఞానోదయం కలగలేదు.

ఎక్కడో, అక్కడ తిరిగి, ఇంటికి పదింటికి చేరాడు. శాంత ఇంకా కోపంగానే ఏడుస్తూనే వుంటుందని భావించిన కాంతారావు ట్రిమ్‌గా ముస్తాబయి తల్లో మల్లెపూలతో తన రాకోసం వరండాలో పచార్లు చేస్తూ కనిపించిన శాంతని చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమె ఏం జరగనట్టే ప్రవర్తిస్తుంటే అతనికి కాస్త నిరుత్సాహం లాటిది కలిగింది. కానీ తనను చూసి గుమ్మంలోనే కావలించుకున్నంత పన్జేసేసరికి మనసులో ఏ మూలో వున్న చికాకు మాయమై ఆమెని దగ్గరికి తీసుకున్నాడు. ఇద్దరూ తాము తొందరపడ్డాం... అంటే తాము తొందరపడ్డాం అని క్షమాపణల సీనులో రక్తి కట్టించారు.

ఆ తర్వాత శరీరాలు చేరువయ్యే ఘట్టంలో మనసులు కూడా దగ్గరయ్యాయి.

***

రెండు రోజుల తర్వాత ఓ రోజు కాంతారావు పార్వతీశాన్ని కలిసి జరిగింది చెప్పాడు. అయితే అతను పార్వతీశాన్ని శాంత ప్రత్యేకంగా తప్పు పట్టిందని చెప్పకుండా జనరలైజ్ చేసి

అసలు ఫ్రెండ్స్‌తో తిరగడం శాంతకి ఇష్టంలేదని కష్టంగా వుందని చెప్పాడు.

కాంతారావు ఎంత డొంక తిరుగుడుగా చెప్పినా పార్వతీశం అసలు విషయం తేలిగ్గానే గ్రహించాడు.


ఇక్కడ పార్వతీశం గురించి కాస్త చెప్పుకోవాలి... ముగ్గురాడపిల్లల తరువాత పుట్టిన ఒక్కగానొక్క మగ నలుసని మొదట్నుంచీ తల్లిదండ్రులు గారంగా పెంచారు... పసితనం నించే అతనో ప్రత్యేక గుర్తింపుకి, ఆదరణకి అలవాటుపడ్డాడు. తండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. అక్రమంగానో, సక్రమంగానో బాగానే సంపాదించాడు.

పార్వతీశం ఎనిమిదో క్లాస్ చదువుతూండగా ఆయన అకస్మాత్తుగా కన్నుమూశాడు. అది పార్వతీశాన్ని చాలా దెబ్బతీసింది. అతని జీవితంపై చాలా ప్రభావం చూపింది.

అతను ఇంటర్‌మీడియెట్ కొచ్చేసరికి ఆస్తి మొత్తం హరించుకుపోయింది. తండ్రిలా ఇంజనీర్ కావాలనే ఆశ అడియాసే అయింది. ఉన్న రెండెకరాల భూమి, దానిమీద ఆదాయం తల్లి మనుగడకే సరిపోని స్థితి— ఆమె పట్టుదలవల్లా బావల కంటితుడుపు సహకారంవల్ల ఎలాగో డిగ్రీ అయిందనిపించాడు.

అతనిది చిన్నప్పట్నుంచీ డామినేటింగ్ నేచర్. తను కోరుకున్నదేది జరగలేదనే దుగ్ధ పార్వతీశానికి చాలా ఉండేది. తనెంతో తెలివైనవాడినని, తన అర్హతకి తగిన ఉద్యోగం, భార్య, సమాజంలో హోదా ఏవీ లేవనే ఆలోచన అతన్ని కాన్సర్‌లా తొలిచేసి సినిక్‌గా మార్చేసింది.

తనకు లొంగనిది, తనకన్నా అన్ని విషయాల్లో వున్నతంగా తన జీవితం కన్నా హాయిగా వుందని భావించిన ప్రతి మనిషి పట్ల అతను అసూయాద్వేషాలు పెంచుకుంటాడు. వాళ్ళని ఎలాగైనా ఇబ్బంది పెట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాడు.



చిన్నతనంలో మనసు పరిపక్వత చెందని దశలో, ఒడుదుడుకులు ఆటుపోట్లతో ప్రమేయం లేకుండా సాగే బాల్యదశ ఎంతో మధురం మరువలేనిది. ఆ దశలో ఏర్పడ్డ తమ స్నేహబంధం ఇంకా అంతే స్వచ్ఛంగా, నిర్మలంగా వుందని నమ్మాడు కాంతారావు. తన మెతకతనాన్ని మొహమాటాన్ని పార్వతీశం తెలివిగా తన అవసరాలకు వాడుకుంటున్నాడనే సంగతి కాంతారావు గ్రహించలేకపోయాడు. తరచు వందా రెండొందలు అప్పుగా తీసుకొని అవి పేకాటలో తీర్చేసేవాడు. ఏదో ఒక మిషతో వేలకు వేలు తీసుకుని కొంత తీర్చి మిగతాదానికి ఏవో ట్రాజెడీ కథలు చెప్పి వాయిదా వేసేవాడు.

బాల్యస్నేహితుడనీ గతంలో తనకు చేసిన చిన్న చితకా సహాయాన్ని కూడా ఎప్పుడూ నెమరేసుకుంటూ కాంతారావు పార్వతీశాన్ని గుడ్డిగా నమ్మాడు. తన స్నేహితుల్లో, శ్రేయోభిలాషుల్లో అతనికి ప్రథమ స్థానం ఇచ్చాడు. పార్వతీశం పట్ల అంత గురుభక్తి కాంతారావుకి.

పార్వతీశం చిన్నగా నిట్టూర్చి మరేం చేద్దామనుకుంటున్నావ్? అన్నాడు. "నాకేం అర్థం కావడంలేదు గురూ..." జాలిగా అన్నాడు పార్వతీశం.

"పోనీ మీ శ్రీమతి కోరిక ప్రకారం మమ్మల్ని కలవడం మానేయ్" సీరియస్‌గా అన్నాడు పార్వతీశం. అతనికి శాంత మీద చాలా కోపంగా వుంది. తన నోటి దగ్గరగా వచ్చిన తాయిలాన్ని ఎవరో దూరం చేస్తున్న ఫీలింగ్...

"భలేవాడివే... నిన్ను కలవకపోతే నాకేం తోచి చావదు. నీకూ ఆ విషయం తెలుసుగా... నీతో వున్నంత సేపు సరదాగా వుంటుంది. ఆ కాసేపు ఆఫీసు టెన్షన్స్ మర్చిపోతాను... పిటీ! శాంతకి ఇలాంటి విషయాలు అర్థంకావు" విసుగ్గా అన్నాడు కాంతారావు.

"అవును కాంతం. మా ఆవిడా అంతే. ఈ ఆడాళ్ళంతా హైలీ పొసెసీవ్... నేరో మైండెడ్... ఛ!" శాంత మీద కోపం అలా తీర్చుకున్నాడు పార్వతీశం.

ఆ తర్వాత ఇద్దరూ అదీ ఇదీ మాట్లాడి, చివరికి పార్వతీశం కాంతారావు ఇంటికి రాకుండా వుండేట్టు బైటే కలుసుకోవడం... పేకాట సెషన్స్‌కి ఎక్కడ, ఎప్పుడు కలుసుకునేది వగైరా గురించి మాట్లాడుకున్నారు.

కాంతారావుకి గుండెల మీంచి పెద్ద బరువు తీసేసినట్టుంది. ఎంతో ఉత్సాహంగా ఇంటికి బైలుదేరాడు. సంతోషం ఎక్కువై దార్లో ఓ బుట్టెడు మల్లెపూలు కొన్నాడు. కొంచెం దూరం నడిచాక చెయ్యి నెప్పెట్టింది. అదీ కాక ఒకరిద్దరు "మూర ఎంత బాబు?" అని అడగడం గమనించి రిక్షా మాట్లాడుకున్నాడు. రాత్రి ఎనిమిదవుతోన్నా రిక్షా టాప్ వేసుకున్నాడు.

"ఏమిటండీ... ఆ బుట్ట?" ఆశ్చర్యంగా అంది శాంత, రిక్షావాడి సాయంతో వగరుస్తూ లోపలికివస్తున్న కాంతారావును చూసి.

"పూలు!" అని చెప్పుతూనే జవాబు చెప్పి రిక్షావాడికో అర్థరూపాయి ఎక్కువిచ్చి

పంపించేశాడు.

"మీకేమైనా పిచ్చా!? ఇన్ని పూలెందుకు...?" అంది శాంత మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

"ఇవాల్టికి మన పెళ్ళయి ఎనభై ఆరు రోజులైంది అందుకు..." అన్నాడు కాంతారావు అతి కష్టంమీద పూలబుట్ట బెడ్‌రూంలోకి ఈడుస్తూ.

"ఎనభై ఆరు రోజులయితే ఏమైంది? అయినా అదేం లెక్క?... ఎవరైనా బర్త్‌డే అనో, మ్యారేజ్‌డే అనో సంవత్సరానికి ఓసారి చేసుకుంటారుగానీ..."

"మనం ఏదో ప్రత్యేకత చూపించాలిగా... అయినా పూలు కొనడానికి ఏదో ఓ సందర్భం అవసరమా? అయితే ఈ రోజు కూడా మన బ్రతికే ఉన్నాం... అది విశేషమేగా... అందుకు సెలెబ్రేట్ చేసుకుందాం. త్వరగా మిగతా కార్యక్రమాలు ముగిద్దాం పద తొందర చేసాడు కాంతారావు.

పక్కమీద చల్లిన మల్లెలన్నీ నలిగిపోయిన తర్వాత...

కాంతారావు ఛాతి మీద తలవాల్చి అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "నేనో మాటడుగుతాను... కోపం తెచ్చుకోరుగా..." అంది గోముగా.

మగత నిద్రలో కాంతారావు 'అడుక్కో' అన్నాడు అంతకంటే తన్మయంగా 'మరే... మరే.. నా మీద మీ అభిప్రాయం ఏవిటి?" అంది శాంత ఛాతిమీద వెంట్రుకల్ని నిమురుతూ.

కాంతారావుకి ఎక్కడో ఏదో ఎర్ర బల్బ్ వెలిగినట్టయింది. అయినా అతను పూర్తి స్పృహలో లేదు. అందుకే అమాయకంగా ఓ వెర్రి నవ్వు నవ్వి "అదేం ప్రశ్న... నువ్వు నా దేవతవి" అన్నాడు రొమాంటిక్‌గా.

## దేవతలు



"మన పెళ్ళికి అంగీకరించని ఈ పెద్దల్ని ఎవరితో పోల్చాలంటావ్'

' అడిగింది అపర్ణ.

"నిజంగా దేవతలతో పోల్చాలి" చెప్పాడు కిరణ్.

—యం.వి.కిరణ్‌కుమార్

(విజయవాడ)

ఇంకా నయం.. పోలేరమ్మా.. నూకాలమ్మో మంకాలమ్మో నని పేరు చెప్పలేదు... నయం అనుకుని 'అబ్బ! అది కాదు...'' అని శాంత అనగానే దేవతవి కాక దెయ్యానివా.. కొంపదీసి వేళాకోళంగా అన్నాడు కాంతారావు.

కాంతారావు జబ్బమీద శాంత అనుకోకుండా కాస్త గట్టిగా గిల్లడంతో అతనికి మత్తు వదిలిపోయింది. స్ప్రింగ్‌లా ఎగిరి కూర్చుని గిల్లిన చోట నిమురుకుంటూ ఇదేం సరసం... అయినా ఏమిటిదంతా. కప్ టుది పాయింట్ కాస్త చిరాగ్గా అన్నాడు.

''మరేం లేదండి... '' అని ఇంకేదో ఉన్నట్టు ఆగింది. కాంతారావు కోపంగా చూడ్డంతో ''నేనంటే మీకు చాలా ఇష్టం కదా... నేనూ డిగ్రీ చదివాను... కాస్తో కూస్తో లోకజ్ఞానం, తెలివితేటలున్నాయనే విషయం అంగీకరిస్తారా...?'' అని కాంతారావు ఏదో అనేంతలో ''మీ ఫ్రెండ్ పార్వతీశం పాటి చెయ్యనా..? అంది నిష్ఠూరంగా.

ఎర్రబల్బ్‌తోపాటు స్టీరియోఫోనిక్ సౌండ్‌లో వార్నింగ్ బెల్ కూడా మోగసాగింది. అర్థరాత్రి అంకమ్మ శివాలన్నట్టు... శాంతకి ఏది ఎప్పుడు మాట్లాడాలో తెలీదు... అయినా తను తొందరపడకూడదని చాలా మృదువుగా నువ్వు పార్వతీశం కంటే ఎక్కువ కాబట్టే ఇపుడు ఇలా నా ప్రక్కన నువున్నావ్.. లేకపోతే మావాడుండేవాడు'' అన్నాడు.

అతని వ్యంగ్యం బోధపడినా శాంత కూడా శాంతంగా ''థాంక్స్! నేను నేను కూడా! మీరు అందరికన్నా నాకే ఎక్కువ ప్రాధాన్యం, విలువా ఇవ్వాలనుకోవడం పేరాశ కాదనుకుంటాను..?'' అంది.

''అలాగే... అనుకో...'' అన్నాడు కాంతారావు ఆవలిస్తూ.

''రోజూ అలా మీ ఫ్రెండ్సుతో అంత రాత్రివరకూ తిరిగే బదులు ఇంటి పట్టునే ఉంటే నేనే మీకు కంపెనీ ఇస్తానుగా... మీ కోసం ఎదురు చూడ్డం... ఒంటరితనం.. ఎడబాటు.. అన్నీ తీరిపోతాయి కదా... ఓ క్షణం కాంతారావు మొహంలో భావాలు పసికట్టాలని ప్రయత్నించింది శాంత.

కాంతారావు ఆ క్షణంలో బుద్ధిడి బాబులా వున్నాడు.

శాంత మళ్ళీ ఏరియల్ తీసింది. ఏవండీ మీరెప్పుడైనా మీ ఫ్రెండ్స్ భార్య పరిస్థితి ఆలోచించారా? నాలాగే ఆమె కూడా ఎంతగా బాధపడుతుందో. మిమ్మల్ని ఎంత ద్వేషిస్తుంటుందో... ఎన్ని శాపనార్థాలు పెడుతుందో...! నా భర్త మరొకరి కష్టానికి కారణం కావడం... మరొకరి దృష్టిలో దోషిగా నిలబడ్డం నాకు గిట్టదు. అది నేను భరించలేను ఉద్వేగంతో ఆమె గొంతు జీరపోయింది.

'ఓహో అట్నుంచి నరుక్కొస్తుందన్నమాట!' ఊరుకో శాంతా.. నువ్వు కోరినట్టుగానే జరుగుతుంది. పార్వతీశాన్ని మనింటికి రావద్దని చెబుతానులే అన్నాడు వరాలిచ్చే వేల్పులా.

శాంత అందంగా భర్త వైపు చూసి అంతలోనే అనుమానంగా దానికి బదులు మీరే వాళ్ళింటికి వెళతారా? అంది.

కాంతారావు రెండుసార్లు గుటకలు మింగి ఇబ్బందిగా కదిలాడు. ఛ! అలాంటిదేమీ



లేదు... ఇక పదుకో... నిద్రొస్తుంది నాకు... అంటూ ఎఫెక్ట్‌కోసం రెండుసార్లు ఆవులించాడు.

***

కాలం గడిచిపోతోంది. శాంతికి తెలీకుండా కాంతారావు పార్వతీశాన్ని కలుస్తూనే

వున్నాడు. మరీ రాత్రి పదకొండు కాకుండా అంతకులోపే ఇంటికి వచ్చేస్తున్నాడు.

ఆఫీసు అయిపోగానే భర్త ఇంటికి రాకపోవడం శాంతకి అంతుబట్టలేదు. చూసి చూసి ఓ రోజు అడిగింది. మీ ఆఫీసు ఎన్ని గంటలకి అయిపోతుందండీ? కాంతారావు గతుక్కుమన్నాడు. అయినా ఏదో ఓ రోజు ఆ పరిస్థితి వస్తుందని తెలుసుకాబట్టి. ఐదు గంటలకి... ఏం?'' అన్నాడు షూస్ విప్పుకుంటూ.

''నిజమా? ఎనిమిదింటికని నేమా... లేదు ఏడింటికని మన ప్రక్కవాటా పద్మావతి, వాదించుకుంటున్నాంలెండి... అందుకని...'' అంది శాంత.

''అదేంటి... ఇంత చదువుకున్నారు... ఆఫీసు ఎన్ని గంటలకి అయిపోతుందనే అతి చిన్న విషయం కూడా మీకు తెలీదా... ఛీటీ..'' అని బాత్‌రూంలోకి వెళ్ళాడు కాంతారావు.

''అది కాదు... వాళ్ళాయన రోజూ ఎనిమిదింటికొస్తాడట... మీరు తొమ్మిదికి గదా వచ్చేది... రావడానికి ఓ గంట టైం పడుతుందనుకుంటే ఆఫీసు ఏడు గంటలకో ఎనిమిదింటి వరకో ఉండాలి కదా... అదీ కాక మీరు మీ ఫ్రెండ్సుని కూడా కలవడం మానేసారుగా.. అంది శాంత అమాయకంగా మొహం పెట్టి.

''అవుననుకో... అయితే ఒక్కోసారి ఆఫీసులో పని ఎక్కువగా వుండి ఆలస్యం అవుతుంది. అప్పుడప్పుడు ట్రాఫిక్ జామ్‌లు... స్ట్రయిక్‌లు... స్కూటర్ ట్రబుల్... అంటూ ఓ దండకం చదవసాగాడు కాంతారావు తన వాగ్ధాటికి తానే మురిసిపోతూ.

అబ్బ... ఇక ఆపండి. మీకు మాత్రమే ఈ ప్రాబ్లమ్స్ వున్నాయా? రాజేశ్వరి వాళ్ళ ఆయన ఐదు అయ్యేసరికి ఇంట్లో ఉంటాడు. రాధాబాయి వాళ్ళాయ ఎక్కడో పాతిక కిలోమీటర్ల దూరంలో వున్న ఆఫీసు నుండి సైతం ఆరయ్యేసరికి తిరిగొస్తాడు. అంటూ బదులుగా శాంత కూడా ఓ లిస్టు మొదలెట్టింది.

''ఓహో! అయితే చుట్టు ప్రక్కల ఎంక్వయిరీలు మొదలెట్టావన్నమాట''... కోపంగా అన్నాడు కాంతారావు.

'ఇందులో ఎంక్వయిరీ ఏముంది. మధ్యాహ్నం పూట సరదాగా అందరం కలుస్తాం. వాళ్ళే చెప్పారా విషయం. రోజూ మీరు ఎప్పుడు వస్తున్నదీ అందరికీ తెలుసు. వాళ్ళు ఇంకా ఏవేవో అన్నారు. నా పట్ల జాలి చూపించారు. అవన్నీ నేను భరించలేను... ఉక్రోషంగా అంది శాంత.

సరే... మళ్ళీ మొదలెట్టకు.. రేపట్నుంచి త్వరగా వచ్చేయడానికి ప్రయత్నిస్తా ఎటో చూస్తూ అన్నాడు కాంతారావు. అతనికి లోలోపల గిల్టీగా ఇరుగు పొరుగు మీద కోపంగా వుంది. అందరి మొగుళ్ళ సంగతీ... వాళ్ళ టైమింగులు వగైరా వీళ్ళకెందుకనీ...

ఆ రోజు..


రాజేశ్వరి, బలవంతం చేస్తే షాపింగ్‌కని వెళ్ళింది శాంత. తాళం చెవి రాజేశ్వరి తల్లికి

ఇచ్చి.

మ్యాచింగ్ బ్లవుస్ పీస్ కోసం ఆరు షాపులు తిరిగారు. షాపువాడు చూపించే షేడ్స్ ఏవీ రాజేశ్వరికి నచ్చడంలేదు. టైం సాయంత్రం ఏడు కావస్తోంది. శాంతకి విసుగ్గా వుంది. భర్త వచ్చే టైంకి ఇంట్లో లేకపోవడం గిల్టీగా కూడా వుంది. షాప్‌వాడికి రాజేశ్వరికీ యుద్ధం ఇంకా జరుగుతూనే వుంది. అపహాసంగా శాంత షాప్ బైటకి వచ్చి ట్రాఫిక్‌ని చూస్తూ నిలబడింది. ఉలిక్కిపడింది. మళ్ళీ చూసింది. దూరంగా కాంతారావు మరో వ్యక్తితో ఏదో మాట్లాడుతూ వెళుతున్నాడు. అతని చేతిలో ఏవో ప్యాకెట్స్ ఉన్నాయి. శాంత ఏమండీ! అని అప్రయత్నంగా పిలిచింది. ట్రాఫిక్ రణగొణ ధ్వనిలో అది కాంతారావుకి వినిపించలేదు. రోడ్డుకి అవతలవైపున వాళ్ళున్నారు. శాంత గబగబా రోడ్డు క్రాస్ చేసింది. రాజేశ్వరి షాప్‌వాడితో ఇంకా ఏదో వాదిస్తూనే వుంది. ఆమెకి చెప్పే వ్యవధి లేదు. అటూ ఇటూ చూసింది. భర్త జాడే లేదు. ఇంగారుగా పదిగజాలు ముందుకు నడిచింది. ఓ సందు మొదట్లో వున్న ఓ చిన్న పెంకుటింట్లోకి వెళుతూ కనిపించాడు. శాంతకి ఆశ్చర్యంగా వుంది. మొదట తిరిగెళ్ళిపోదామనిపించినా కుతూహలం ముందుకు తోసింది.

అదో పాడుబడ్డ కొంప! రెండు వాటాలు.. ఓ వాటా ముందు పాత నవారు మంచం... దాని మీద ఐదారేళ్ళపాప బొమ్మలతో ఆడుకుంటోంది. ఆ అమ్మాయి స్థితి ఇంటి వాలకం చూస్తే ఎవరో పేదవాళ్ళలా వున్నారు.

మరో వాటా ముందు నాలుగైదు జతల చెప్పులు.. షూస్ కనిపించాయి. భర్త షూస్ గుర్తుపట్టింది. తలుపు మూసుంది. ఓ కిటికి సగం తీసుంది. అందులోంచి పొగ, ఎవరో ఐదారుగురు ఓకేసారి మాట్లాడుతున్న ధ్వని... ఆ వాతావరణం శాంతకి చాలా ఇబ్బందిగా కించిత్తు భయంగా కూడా అనిపించసాగింది. వేగంగా కొట్టుకునే గుండెని చిక్కబట్టుకుని తలుపు తట్టబోయి మనసు మార్చుకుని కిటకిలోంచి ఓరగా చూసింది. ఆమె మొహంమీద



## సద్దాం సంతోషం

అందరూ అనుకున్నట్లుగానే క్లింటన్ అమెరికా అధ్యక్షుడయ్యాడు. అయితే అందరికంటే ఎక్కువగా ఈ విషయం విన్న తరువాత సంతోషించిన వ్యక్తి మాత్రం ఖచ్చితంగా ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అయి వుండవచ్చు. బుష్ ఓడిపోయాడని తెలియగానే తన నివాసం బయటకొచ్చి బాల్కనీలో నిలబడి ప్రజలు అమెరికా వ్యతిరేక నినాదాలు చేస్తూ వుండగా సద్దాం హుస్సేన్ తన చేతిలో ఉన్న రివాల్వర్‌తో పదిసార్లు గాలిలోకి పేల్చాడట. అంతటితో ఊరుకోక "బాగ్దాద్ మీద బాంబులు వేసిన రోజునే బుష్ ఓడిపోయాడు" అని కూడా అన్నాడట సద్దాం! పాపం బుష్!! హ్యాపీ సద్దాం!!

—జూపిటర్

ఎవరో బలంగా చరిచినట్టు అయింది.

లోపల తన భర్త చిద్విలాసంగా సిగరెట్ తాగుతూ ఏకదీక్షగా పేక ముక్కలవైపు చూస్తూ కనిపించాడు. పేర్లు ఖచ్చితంగా తెలీకపోయినా అక్కడ వున్న అందర్నీ గుర్తుపట్టింది శాంత. పెళ్ళిలో చూసిన గుర్తు...

భర్త చేతిలో పావుగంట క్రితం చూచిన ప్యాకెట్స్ ఏమిటో ఆమెకి అర్థమైంది. ముగ్గురి చేతుల్లో వున్న గ్లాసుల్లో విస్కీ లాటిదేదో వుంది. మధ్యలో ప్లేట్లలో చిప్స్, మిక్చర్ వగైరా కనిపించాయి. భర్త చేతిలో విస్కీ గ్లాసు ఏదీ కనిపించలేదు. పార్వతీశంతో ఏదో మాట్లాడుతూ కనిపించాడు. శాంత హృదయం కుతకుత ఉడికిపోతోంది. ఎలా ఇల్లు చేరిందో ఆమెకే తెలీదు.

* * *

"అదేంటి చెప్పాపెట్టకుండా అలా మాయమయ్యారు? మీకోసం నేనెంతసేపు వెదికానో తెలుసా?" విసుక్కారంగా అంది రాజేశ్వరి తాళంచెవి ఇస్తూ.

"సారీ ఆంటీ ఓ ఫ్రెండ్ కనిపించింది. తొందర్లో చెప్పే అవకాశం లేకపోయింది" పరధ్యానంగా అంది శాంత తాళం చెవి తీసుకుంటూ.

తన భర్త సిగరెట్ కాలుస్తూ పేకాటలో కనిపించాడనే దానికన్నా అతను తనని మోసం చేసాడు.. ఎంతకాలంగా తనని మభ్యపెడుతున్నాడనే నిజం దుర్భరంగా ఉంది. తన మాటనీ, వ్యక్తిత్వాన్ని ఎంతో తేలిగ్గా జమకట్టాడు అనే విషయం ఆమెకి నమ్మశక్యంగా లేదు.

శాంతకి కొన్ని విషయాలపట్ల ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. తన కాబోయే భర్త గురించి ఆమె కూడా ఏవేవో ఊహించుకుంది. భర్త అలవాట్లు, ఆదర్శప్రాయంగా కాకపోయినా తనకి వ్యథ కలిగించేవి కాకపోతే చాలని ఆశించింది.

తాగుడు, వ్యభిచారం, జూదం, సిగరెట్స్ లాంటివి అంటే ఆమెకి అసహ్యం. తన భర్తకి సిగరెట్లు, తాగుడు అలవాట్లు లేనందుకు మురిసిపోయింది. మిగతావి కూడా ఉండి వుండవని అభిప్రాయపడింది. కొన్ని పర్యాయాలు భర్త అబద్ధాలాడి పట్టుబడినా ఆమె అంత సీరియస్‌గా తీసుకోలేదు. తను నిలదీస్తే తర్వాత నిజం చెప్పాడుగా అని సరిపెట్టుకుంది.

కానీ ఆ రోజుతో ఆమె భ్రమలు తొలగిపోయాయి. భర్త అంటే అసహ్యం కలగకపోయినా అంతక్రితంవున్న అభిమానం, గుడ్డిప్రేమల తెర తొలగడం మొదలైంది.

మొదట్లోనే తను అసలు సంగతి తెలుసుకోవడం అదృష్టం! లేకపోతే మరి కొంతకాలం భర్త చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్ముతూ తన భర్త శ్రీరామచంద్రుడని, సద్గుణ సంపన్నుడనీ తన అదృష్టానికి మురిసి ముక్కలవుతూ ఏవేవో ఊహల్లో విహరిస్తూ కాలం గడిపేది..ఓహ్!

ఆమెకి తెలియకుండానే కన్నీళ్లు నిశబ్దంగా ఆమె చెంపల మీదుగా జారిపోసాగాయి. ఏడ్చి

సమస్యలతో రాజీ పడ్డం, అపజయాన్ని అంగీకరిస్తూ సమస్యలకి దూరంగా పారిపోవడం.. ఈ రెండు మార్గాలు ఆమెకి నచ్చలేదు. ఆమె ప్రవృత్తికి, మనస్తత్వానికి ఆ రెండూ విరుద్ధమే. సమస్యను ఎదుర్కొని దాన్ని జయించడమే సిసలైన పరిష్కారం. మరి కొంతసేపటికి శాంత మామూలుగా అయింది.

* * *

తొమ్మిదిన్నరకి కాంతారావు వచ్చాడు.


'యిష్, యిష్'అంటూ రోజులాగే నీరసంగా మూలుగుతూ కుర్చీలో కూలబడ్డాడు.

శాంత బెడ్‌రూంలోకి వెళ్లిపోయింది. ఎప్పటిలా తన ప్రక్కనే కూర్చుని ఆప్యాయంగా పలకరిస్తూ సపర్యలు చేయకపోవడం కాంతారావుకి ఆశ్చర్యం కలిగించింది. అంతలోనే పాపం ఒంట్లో బాగాలేదేమోలే అని సరిపెట్టుకుని బట్టలు మార్చుకుని 'ఏం శాంతా అలా వున్నావు'' అన్నాడు పలకరింపుగా.

శాంతకి వళ్లు మండిపోయింది. అయినా ఏదో కొద్దిగా తలనొప్పి అమృతాంజనం రాసుకున్నాలెండి.అదే తగ్గిపోతుంది. పాపం చాలా అలసిపోయినట్లున్నారు. వంట కూడా చెయ్యలేదు. ఈ పూటకి ఎలాగో సర్దుకోండి అంది సాధ్యమైనంత మామూలుగా.

కాంతారావు గతుక్కుమన్నాడు. అతని అనుభవంలో శాంత వంట చేయలేదంటే తన మీద కోపంగా వుండడమో తనతో తగాదా పెట్టుకోవాలనుకున్నప్పుడు మాత్రమే అలా చేస్తుంది. ఓసారి నూట రెండు డిగ్రీలు జ్వరంలో వుండి కూడా తనకిష్టమని క్యారెట్ హల్వా చేసిన మహా ఇల్లాలు.

ఏ క్షణంలో ఏమవుతుందోనని భయపడుతూనే స్నానం వగైరా ముగించాడు. ఎంత ఆలోచించినా తనపట్ల ఆమె కోపానికి కారణం బోధపడలేదు. పోనీ లేట్ వచ్చాడా అనుకుంటే క్రితం రోజు పదింటికి వచ్చినా బాగానే వుందే!



ఇక లాభంలేదని తనే చొరవచేసి శాంతని మెల్లిగా తనవైపుకి తిప్పుకున్నాడు. ఆమె మొహంలోకి చూసి ఖంగుతిన్నాడు. కళ్లు ఎర్రగా ఉబ్బి, ముక్కుపుటలు కంది వున్నాయి. ఆమె చాలాసేపు ఏడ్చుంటుందని గ్రహించాడు. మళ్ళీ మనసు కీడు శంకించింది.

"ఏమైంది శాంత?" అని నాలుగుసార్లు అడిగాక "మరేం లేదండి. మన పక్కింటి రామారావుగారి చిన్నబ్బాయి వేణూలేదు" అంది

"ఉన్నాడు" అన్నాడు కీఇచ్చినట్లు

"వాడు మిమ్మల్ని శంకరమఠం దగ్గర ఎవరో అమ్మాయితో వెళుతుండడం చూసాడట. మీరూ ఆమె చాలా క్లోజ్‌గా ఉన్నారనీ, ఆమె మీ నడుం చుట్టూ చెయ్యేసి నవ్వుతూ తుళ్లుతూ..." అంటూ ఆగిపోయింది.

ఏం వినాల్సి వస్తుందోనని వణికిపోతున్న కాంతారావు, ఆ మాటలకి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ విషయం అతనికి కూడా చాలా విడ్డూరంగా తోయడంతో నిజంగానే పగలబడి నవ్వాడు. వచ్చే నవ్వు ఎలాగో కష్టపడి ఆపుకుంటూ "అది నువ్వు నమ్మావ్... ఇంకేదేదో ఊహించుకుని ఏడుపులు, పెడబొబ్బలు పెట్టుంటావ్... యూ సిల్లీ గాళ్!నేనెట్లా కన్పిస్తున్నాను" అన్నాడు.

ప్రస్తుతం మాత్రం శాంతకి 'వెధవలా, దగుల్బాజీలా' అని చెప్పాలని మనస్సు ఉవ్విళ్లూరింది. కానీ ఎలాగో తమాయించుకుని లేని సిగ్గు అభినయిస్తూ 'ఛీ పాండి నడవ్‌గా వినేసరికి నాకు మతి పోయింది. దిక్కు తోచలేదు' అని మాత్రం అంది.

"నాకు తెలుసు. మీ ఆడాళ్ళంతా ఇంతే. ఎంత చదువుకుంటే మాత్రం ఏం లాభం! ఆ వేణుగాడు ఎవర్నో చూసి నేనేననుకుని ఉంటాడు. ఈ హెల్మెట్స్‌వల్ల ఇదే ఇబ్బంది. మొన్న మా పాంచజన్యం భార్య కూడా సెకెండ్‌షో సినిమా నుంచి తిరిగొస్తూ మరెవరి స్కూటరో ఎక్కిందట. కారణం ఆ మసక వెల్తుర్లో హెల్మెట్ పెట్టుకున్న ఆ మహానుభావుడు అచ్చొ మావాడిలాగే వున్నాడట. పూర్ శాంత ఇలాంటి పొరపాట్లు సహజం. ఫర్‌గెట్ ఇట్" అన్నాడు కాంతారావు శాంత తల నిమురుతూ.

నిజానికి పాంచజన్యం భార్య ఏ పొరపాటు చెయ్యలేదు. కేవలం శాంతని ఇంప్రెస్ చేయడానికే అలా చెప్పాడు.

"అయితే అది మీరు కాదన్నమాట. నాకు మొదట్నుంచి అనుమానమే. మావారేంటి ఆ టైంలో మరో అమ్మాయితో అక్కడ ఉండడం ఏమిటని? పాపం మావారు బ్యాంక్‌లో బండెడు ఎకౌంట్స్ పుస్తకాలతో తలమునకలై తబ్బిబ్బవుతూ గాడిద చాకిరీ చేస్తుంటారని ఎంత చెప్పినా ఆ వేణుగాడు వినలేదు. మీరు ఆ టైంలో ఆఫీసులోనే వున్నారు కదండి" అంది అమాయకంగా.

"అవును ఇవ్వాళ వర్క్ మరీ ఎక్కువ. అసలు టైం ఎలా గడిచిపోయిందో తెలీనే లేదు. చాలా అలసిపోయాను. గుడ్‌నైట్' చూపు తప్పిస్తూ అని లైట్ ఆఫ్ చేసాడు

కాంతారావు.

* * *

పార్వతీశం గబగబా డబ్బు లెక్కపెట్టాడు. ఆరువందల నలభైనాలుగు రూపాయలు. తృప్తిగా నిట్టూర్చాడు. పేకాటలో అతను చాలా అరుదుగా డబ్బు పోగొట్టుకుంటాడు. నెలకి ఎంతలేదన్నా రెండువేలపై చిలుకు పేకాటద్వారా అతను సంపాదిస్తుంటాడు. 'గోల్డెన్ హ్యాండ్' అనే బిరుదు మిత్రబృందం నుంచి పొందిన జూదబ్రహ్మ!

పార్వతీశం ఇంటికి బయలుదేరాడు హుషారుగా ఈలవేస్తూ. అతని భార్య పరిమళ అసహనంగా బాల్కనీలో పచార్లు చేస్తోంది. లోకమంతా పార్వతీశానికి లోకువైతే అతనుమాత్రం భార్యకు లోకువ. అయినా సిగ్గు అభిమానం అనేవి ఏనాడో వదిలేసాడు కాబట్టి సరిపోయింది.

"ఎవరండీ మీరు ఏం కావాలి" అంది పరిమళ.

"అదేంటే అలా మాట్లాడతావ్. నేనూ మీ శ్రీవారిని"

"చాల్లెండి మావారు అర్ధరాత్రి పన్నెండింటికి ముందు ఎప్పుడూ ఇంటికి రారు. ఇంకా టైం పదికూడా కాలేదు. మీరు ఆయనెలా అవుతారు., నిజం చెప్పండి ఎవరు మీరు?"

పార్వతీశానికి ఆ వ్యంగ్యాలూ, ఈసడింపులూ మామూలే. "ఇక చాల్లే నీ ఓవర్ యాక్షన్. ముందు కాస్త వేణ్ణీళ్ళు పెట్టు స్నానం చేయాలి" చిరాగ్గా అన్నాడు పార్వతీశం.

"రోజూ పేకాటలో మునిగితేలే మీకు ఇంకా స్నానం ఎందుకండి. ఇవాళ ఎంతమందిని ముంచారుఅదే మీ ఆటలో" అంటూ లోపలికి దారి తీసింది పరిమళ.

"నాన్‌సెన్స్ నేనెవర్నీ ఎందులో ముంచలేదు. నేను చాలా ఫెయిర్‌గా ఆడతాను. గెలుపు ఓటములు మన చేతిలో లేవుగా... అయినా ఎందుకలా ప్రతిదానికీ నన్ను ఈసడిస్తా

## కోరిక



"నీవు కోరాలేగానీ ఆ కొండమీద కోతినైనా తీసుకొస్తాను డియర్" అన్నాడు మధు.

"ఆ కోతెందుకు నీ మెడలో ఉన్న చైన్ ఇవ్వు" అంది సుధ.

—సీమ అనూరాధ
(తెనాలి)

మాట్లాడతావు?'' వచ్చే కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ అన్నాడు పార్వతీశం.

''మీరు ఫెయిర్‌గా ఆడతారా. పాపం మీ ఫ్రెండ్స్ అంతా పిచ్చి వెధవలు. .. మీ ట్రిక్స్ వాళ్ళకి తెలీక తమ దురదృష్టాన్ని తిట్టుకుంటూ వేలకి వేలు మీకు సమర్పించుకుంటున్నారు. వాళ్ళనలా మోసం చెయ్యడానికి మీకు మనసెలా ఒప్పుతుందండి? ఆఖరికి పాపం ఆ కాంతారావుని కూడా చీట్ చేస్తున్నారు! ఛీ...''

''షటప్ పిచ్చిపిచ్చిగా వాగకు నేనెవర్నీ చీట్...''

''ఎందుకలా అరుస్తారు. అరవడం నాకూ చేతవును. సిగ్గు లేకుండా బుకాయింపొకటి. పేకాటలో ఎన్ని రకాలుగా చీట్ చెయ్యచ్చో తమరేగా ఓసారి నాకు వద్దు బాబోయ్ అని మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా చాలా విపులంగా వివరించి డెమోన్‌స్ట్రేషన్ కూడా ఇచ్చారు. మీ గొప్పతనం నేను గుర్తించాలని పాపం చాలా తాపత్రయపడ్డారుగా అప్పట్లో...'' పరిమళ ఒక్కొక్క మాట సూదుల్లా తగలుతున్నాయి పార్వతీశానికి. ఆ వాగ్దాటికే ఆ టాలెంట్‌కే అతను జడిసేది.

పార్వతీశం వెంటనే ఏమీ అనలేకపోయాడు. మౌనంగా వెళ్లి బట్టలు మార్చుకున్నాడు. భోంచెయ్యాలనిపించలేదు. అలాగే వెళ్లి మంచం మీద వాలిపోయాడు.

''ఇంతలోనే అంత అలకెందుకో. ఇది రోజూ ఉండేదేగా. మీ కోపం ఎలాగూ నామీద చూపిస్తూనే వున్నారుగా. పాపం అన్నం ఏం చేసింది. ఇప్పుడు మీరు తినకపోతే ప్రొద్దున చద్దన్నంగా తమరే ఆరగించాల్సి వుంటుంది. ఆ పైన మీ ఇష్టం'' అల్టిమేటం జారీ చేసింది పరిమళ. సణుక్కుంటూ వెళ్లి టేబుల్ ముందు కూర్చున్నాడు పార్వతీశం.

''ఏమండి'' ఆ పిలుపులో వున్న సౌమ్యతకి పార్వతీశానికి పొరవచ్చింది. పెళ్ళయిన కొత్తలో ఎప్పుడో విన్నాడు. పరిమళ అంత మృదువుగా మాట్లాడగలదనే విషయం దాదాపు మరచిపోయాడు.

ఆశ్చర్యంగా ఆమెవైపు చూసాడు అనుమానం వేధిస్తుండగా.

''మీరింత కాలం మీ ఇష్టం వచ్చినట్టు చేసారు. అన్నీ భరించాను. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లు ఇప్పుడిప్పుడే అన్నీ గ్రహిస్తున్నారు. మీరిలా పేకాట, తాగుడు అర్ధరాత్రి ఇల్లు చేరడం అన్నీ వాళ్లు గమనిస్తునే వున్నారు. వాళ్ళ మనసులో మీమీద ఒకరకంగా నాపట్ల కూడా ఎలాంటి అభిప్రాయం ఏర్పడుతుందో కాస్త ఆలోచించండి. కనీసం వాళ్ళకోసమైనా ఇవన్నీ మానేయండి'' పరిమళ కళ్ళల్లో నీళ్ల సుడులు తిరుగుతున్నాయి.

పార్వతీశం చిరాగ్గా పళ్లెంలో చెయ్యి కడిగేసుకున్నాడు. ''ఇప్పుడు నేనేమంత కాని పనులు చేస్తున్నాను. ఖూనీలు చేస్తున్నానా? దొంగతనాలు చేస్తున్నానా? నా బాధ్యతలు నేను సక్రమంగానే నిర్వహిస్తున్నానే. నా సరదాలు నాకుంటాయి. నేనెవరికీ సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరంగానీ ఎవరి కోసమో నా పద్ధతులు మార్చుకోవాల్సిన అగత్యంగానీ నాకు పట్టలేదు.

నువ్వెప్పుడూ ఏడుస్తూనే వుంటావ్. సరదాగా బ్రతకడం కూడా ఒక కళ. అందరికీ అది రాదు'' మరోమాటకి అవకాశం లేకుండా వెళ్లి మంచం ఎక్కాడు.

పరిమళ చిన్నగా నిట్టూర్చింది. తన పిచ్చిగానీ.. ఆయన మారుతారనుకోడం కన్నా పేరాశ మరోటిలేదు. తన ఖర్మ తప్పదు... ఈ జన్మకింతే ప్రాప్తం.

ఆమె వంటిల్లు సర్దుకుని బెడ్‌లైట్ ఆన్‌చేసి పడుకుంది. ఏడేళ్ళ సతీష్, ఐదేళ్ళ శ్రీలేఖ గాఢనిద్రలో వున్నారు. ఆప్యాయంగా వాళ్ళ తలలు నిమిరి భారంగా కళ్లు మూసుకుంది. ఎన్నిటికో మూసుకున్నట్లుగానే.

రాంప్రసాద్ కాల్గెట్ టూత్‌పేస్ట్ ఎడ్వర్టైజ్‌మెంట్‌లా అరచేతిని నోటిదగ్గర పెట్టుకుని అహ్! అని గాలి వదిలాడు. రమ్ వాసన బేగాన్ స్ప్రేలా ముక్కుపుటలని అదరగొట్టింది. దాంతో ఖంగారు ఎక్కువైంది. ప్రక్కనే దీనంగా వేలాడుతున్న ఓ వేపాకు కొమ్మకున్న ఆకులు అరకిలోదాకా తెంచేసి గబగబా నోట్లో కుక్కుకుని కాసేపు నోటిని మిక్సీలా మార్చాడు. వాంతి వస్తున్నా ఎలాగో తమాయించుకున్నాడు. అదపాదడపా రైల్వేస్టేషన్స్‌లో కాఫీగ్రటా తాగి వుండడంవల్ల ఆ మాత్రం తట్టుకోగలిగాడు. మళ్లీ వాసన టెస్ట్ చేసాడు. ఈసారి ఏదో ఎరువుల మందులా అన్పించింది. అరఫర్లాంగు నడిచి ఓ పాన్‌షాప్ ముందు ఆగాడు. 'తూఫాన్ గుట్కా' రెండు పాకెట్లు కొన్నాడు. ఓసారి భగవంతుడ్ని ప్రార్ధించి పొగాకు రంగరించిన ఆ పదార్ధాన్ని ఒక్క ఉదుటన నోట్లోకి పంపాడు. జెయింట్‌వీల్ ఎక్కినట్లు అన్పించింది. అన్నీ డబల్ డబల్‌గా కన్పించసాగాయి. మయసభలో దుర్యోధనుడిలా.

## హెడ్‌లైన్స్



మనలో చాలామంది న్యూస్‌పేపర్లో హెడ్‌లైన్స్ చదివేసి ఊరుకుంటాం. అయితే ఒక్కోసారి అదెంత ముప్పుకు దారితీస్తుందో తెలుసా! కర్నాటకలోని మూడ్‌బిడి గ్రామంలోని ఓ స్కూలు ప్రిన్సిపాల్‌గారు ఆరోజు పేపర్లో "విధాన సభ ఆవరణలో హెగ్డేను కాల్చి చంపారు'' అనే హెడ్‌లైన్ చదివేసి వెంటనే మాజీ ముఖ్యమంత్రిగారు చనిపోయారంటూ సంతాప సభ పెట్టేసి స్కూలుకు సెలవు ఇచ్చేసారట. అయితే మరణమృదంగ సినిమాలో నటిస్తున్న మాజీ ముఖ్యమంత్రి హెగ్డేగార్ని సినిమా షూటింగ్‌లో చంపారన్న విషయం ప్రిన్సిపాల్‌గారికి తెలిసేటప్పటికి స్కూలు ఖాళీ అయిపోయింది. అంటే ఈనాటి పేపర్లలో హెడ్‌లైన్స్ అంత వాడిగా, వేడిగా వుంటున్నాయన్న మాట!

—జూపిటర్

ఫైనల్‌గా వాసన టెస్ట్ చేసాడు. రవ్వంతప్పు ఏదైనా కావచ్చు అనుకునేటట్లు వుండడంతో తన శ్రమ ఫలించిందని సంతోషంగా కాళ్ళతో గెంతులేసాడు.

రాంప్రసాద్ ఇంకా వీధి గుమ్మం కూడా ఎక్కకముందే అతని భార్య గోదావరి ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లా లోపల్నుంచి దూసుకొచ్చి పోలీసు కుక్కలా మీదపడి వాసన చూసింది. అనుమానిస్తూనే క్షమించింది. ఏమిటంత ఆలస్యం అయింది. ఈరోజు పెందళాడే వస్తాను 'తల్లికి కొడుకు—భార్యకి భర్త' సినిమాకి తీసుకెళ్తానన్నారుగా. మీ కోసం చూసి చూసి విసిగిపోయి పక్కింటి వాళ్ళ విసిఆర్‌లో 'దగుల్బాజీ మొడుగు' సినిమా చూసాను'' అంది నిష్ఠూరంగా.

''సారీ జయా ఆఫీసు నుంచి వస్తుంటే దార్లో ఓ పెద్ద ఊరేగింపు అడ్డం వచ్చింది. అందులోంచి బయటపడేసరికి చాలా లేట్ అయింది. మరోలా అనుకోకు'' నీరసం అభినయిస్తూ జేబులోంచి కర్చీఫ్‌తీసి మొహం తుడుచుకోబోయాడు. అంతే అతని పాపం బద్దలైంది. ఓ అయిదు రూపాయల టోకెన్ ఛెంగున గాల్లో పల్టీలు కొట్టి జయ కాళ్ళ దగ్గర పడింది. మరుక్షణం ఆమె మొహం అమృతాంజనం రాసుకోకముందు యాడ్‌లా మారిపోయింది. ఆమె టోకెన్ వైపోసారి నిశితంగాచూసి అవేమిటన్నట్లు కళ్ళలోనే ప్రశ్నించింది.

రాంప్రసాద్ నాగయ్యలా వణికిపోతున్నాడు. చాలారోజులుగా భార్యకిచ్చిన మాటతప్పి పేకాడుతూ తాగుతూ జల్సా చేస్తున్నాడు. ఇంతవరకూ తెలివిగా ఎలాగో మానేజ్ చేస్తూ వచ్చాడు. భార్యకి రవ్వంత అనుమానం వచ్చినా మళ్ళీ ఆత్మాహుతి ప్రోగ్రాం ఖాయం.

''అవును ఏమిటిది ఏదో టోకెన్‌లా వుందే గమ్మత్తుగా వుంది'' ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాడు.

''అవునూ ఇది మీ జేబులోకెలా వచ్చింది? అసలు ఇదేంటి?'' స్వరం తీక్షణంగా మారింది.

రాంప్రసాద్ కంప్యూటర్‌లా ఆలోచిస్తున్నాడు. ఓహోహో హీ హీహీ'' అని హైనాలా నవ్వి ''ఇదా ఇప్పుడు గుర్తొచ్చింది. మధ్యాహ్నం క్యాంటిన్‌లో మసాలదోసకి టోకెన్ తీసుకున్నాను. మధ్యలో ఎవరో ఫ్రెండ్ కనిపిస్తే మాటల్లోపడి దీని సంగతి మరచిపోయాను. ఏంటో ఈ మధ్య మతిమరుపు ఎక్కువైపోతోంది.'' బెడ్‌రూంలోకి నడుస్తూ అన్నాడు రాంప్రసాద్.

''నిజమేనా మీరు చెప్పేది లేక మళ్ళీ పేకాట... అనుమానంగా అంది జయ.

''శివ శివ'' అంటూ చెవులు మూసుకున్నాడు రాంప్రసాద్. భార్య మాట్లాడిందేదో బూతు మాటైనట్టు 'నన్ను నమ్ము జయా ఆదివారాలు నీ పర్మిషన్‌తో కాసేపు సరదాగా ఆడుతున్నాను అంతే. మిగతా రోజుల్లో కనీసం 'పే'అని కూడా ఆలోచించను. నేనూ కొన్ని ప్రిన్స్‌పుల్స్ వున్న మనిషినే' గద్గద స్వరంతో అంటున్న భర్తవైపు ఓమారు అపనమ్మకంగా



చూసి 'సర్లెండి వెధవగోల, భోంచేద్దురుగాని రండి'' అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

భారంగా నిట్టూర్చాడు రాంప్రసాద్. బట్టలు మార్చుకుని కాళ్లు చేతులు కడుక్కొచ్చేసరికి అతని పుత్రరత్నం నానిగాడు మరో టోకెన్‌తో ఆడుకోవడం కనిపించి గుడ్లురిమేసాడు.

"ఇదేంటి నాన్నా" అని వాడు ఎగరేసి పట్టుకుంటూ అడిగాడు.

రాం(ప్రసాద్ ఒలెంపిక్ ఛాంపియన్‌లా మంచం మీదకి (డైవ్ చేసి వానిగాడి చేతిలో టోకెన్ లాక్కోబోయాడు. వాడు చురుగ్గా తప్పించుకుని 'అమ్మా నాన్న చూడు' అంటూ మరేదో అరవబోయాడు. రాం(ప్రసాద్ పిల్లల్ని ఎత్తుకుపోయేవాడిలా గుబుక్కున వాడినోరు మూసేసి అమాంతం వాడ్ని ఎత్తుకుని బా(త్రూంలోకి పరుగెత్తి తలుపేసాడు. ఆ తరువాత వానిగాడి కాళ్ళు, గడ్డం పట్టుకుని (బతిమాలి టోకెన్ విషయం వాళ్ళమ్మకి చెప్పకుండా వుంటే మర్నాడు ఐస్(కీం... ఆ మర్నాడు ఫైవ్‌స్టార్ చాక్లెట్ తెచ్చి ఇచ్చేట్లు ఒప్పందం కుదుర్చుకుని మరోసారి వాడి అభయం పొంది ఆ తరువాత బైటికొచ్చాడు.

"ఇద్దరూ ఏం చేస్తున్నారండి బా(త్రూంలో" అంటున్న భార్య మొహంలోకి చూడలేక 'టాయ్‌లెట్ క్లీన్‌గా ఎలా పెట్టాల్సింది ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నాలే అంతేక(దా" అన్నాడు.

వానిగాడు తల్లి మొహంలోకి ఓసారి చూసి ఐస్(కీం తలుచుకుంటూ 'అవునని' తలాడించాడు.

* * *

పాంచజన్యానికి చాలా చిరాగ్గా వుంది. ఆ రోజుతో కలిపి ఆ నెల్లో అప్పటివరకూ పదహారువందలపైనే పేకాట్లో పోయింది. డిఏ ఎరియర్స్, ఫెస్టివల్ అడ్వాన్స్ రెండూ క్షవరం. అదీకాక వెయ్యి అప్పుంది.

చిటపటలాడుతూనే ఇంట్లోకి అడుగుపెట్టాడు. అతని భార్య ఆనందవల్లి ఆ(తంగా అతన్ని చుట్టేసి "ఇవాళ ఎంతొచ్చిందండీ' అంటూ అతని జేబులో డబ్బు లాక్కుని గబగబా లెక్కపెట్టి 'ఛ వందేనా బోడి వంద రూపాయలు' అంది నిరుత్సాహంగా.

అందరు ఆడవాళ్ళలాగే ఆనందవల్లి మొదట్లో మొగుడు పేకాడ్డం సహించలేదు. గొడవ చేసింది. అందుకు పాంచజన్యం ఓ గొప్ప విరుగుడు కనిపెట్టాడు. పేకాట్లో నిజంగా గెలిచినా గెలువకపోయినా అడపాదడపా భార్యకి ఏదోటి కొనుక్కోమని, దాచుకోమని కొంత డబ్బు ముట్టచెప్పేవాడు. ఆ రకంగా ఆనందవల్లి చాలానే పోగుచేసింది. పేకాట కెళతానన్నరోజు ఆమె పాంచజన్యం జేబులో డబ్బు లెక్కపెట్టేది. తిరిగొచ్చాక బ్యాలెన్స్ షీట్ టాలీ చేసేది. వందా యాభై పోతే ఊరుకునేది. గెలిస్తే ఆ మొత్తం లాక్కునేది.

పాంచజన్యం దానికి కూడా మరో ప్లాన్ ఆలోచించాడు. నిజానికి అతను ఆడే స్టేట్‌కి కనీసం నాలుగైదువందలన్నా అవసరం. భార్య రెండొందలకన్నా ఎక్కువ తీసుకెళ్ళనీయదు. అందుకే సీ(కెట్ పాకెట్ కుట్టించడం, ఇంట్లో కూడా భార్యకి తెలీకుండా ఎక్కడెక్కడో డబ్బు దాచడం వగైరా చేసాడు. తరచూ అతను ఆటలో డబ్బు పోగొట్టుకునే వాడు. అయినా ఆ విషయం భార్యకి తెలిస్తే గొడవచేసి మొదటికే మోసం తెస్తుందని ఎక్కడెక్కడో అప్పుచేసి అదంతా పేకాట్లో లాభం అని ఫోజుకొట్టి ఎలాగో నెట్టుకొస్తున్నాడు.

"ఏమిటీ ఈ మధ్య వందా యాభై కన్నా గెలవడంలేదు.." అంది అమాయకంగా

ఆనందవల్లి.

నా ప్రయత్నం నేనూ చేస్తూనే వున్నావల్లే. అయినా మిగతావాళ్లు గెలవనీయడంలేదు..స ంజాయిషీ ఇస్తూనే వెయ్యి రూపాయలు అప్పు తలచుకుని లోలోపలే కుమిలిపోయాడు పాంచజన్యం.


''అవన్నీ నాకనవసరం రేపొచ్చే దీపావళికి నేను పట్టుచీర కొంటానని ఈ కాలనీ అంతా చెప్పేసాను. ఎలాగైనా సరే నాకు రెండువేలైనా తెచ్చివ్వండి'' ఆర్డర్ చేసింది వల్లి.

''అన్యాయం! దారుణం! దోపిడీ! ఇలాంటివే మరికొన్ని పదాలు పాంచజన్యం బుర్రలో మారుమోగాయి. ఎలాగో వచ్చే ఏడుపుని ఆపుకుని ''రెండువేలంటే మాటలు కాదు'' అని అనగానే.

''మాటలు కాదు డబ్బని నాకు తెలుసులెండి. డబ్బు ఇస్తారో పేకాట మానేస్తారో త్వరగా తేల్చి చెప్పండి'' అంది గుడ్లురుముతూ.

పాంచజన్యంలో చాలాకాలం తరువాత తెగింపు వచ్చింది. ''ఏమిటి నీ బెదిరింపు. నేను ఇవ్వను. ఏం చేస్తావ్'' కీచుగా అరిచాడు.

ఆనందవల్లి ఓ క్షణం నమ్మలేనట్టు చూసింది. ఆ తరువాత పళ్ళతో తాలింపు శబ్దం చేసి ''ఓహో అలాగేం అయితే చూడండి నా తఢాకా'' అంటూ గబగబా లోపలికెళ్లి ఓ ఐదు నిముషాల తరువాత తిరిగొచ్చింది. అచ్చం ముష్టిదానిలా వుంది. మెడలో ఓ బోర్డు దాని మీద ''నేను ఫలానా ఆఫీసులో పనిచేసే పాంచజన్యంగారి భార్యను. పేకాట బాధితురాల్ని. ధర్మం చెయ్యండి'' అని ఉంది. పాంచజన్యానికి ఆనందవల్లి పట్టుదల గురించి బాగా తెలుసు. మరుక్షణం పాంచజన్యం క్రిందపడి బల్లిలా పాక్కుంటూ వెళ్లి ఆనందవల్లి కాళ్ళ దగ్గర ఆగాడు.



''వల్లీ నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు. నీది నాది కాకపోవచ్చు. కానీ నాదంతా నీది కాదా. ఈ పేకాట, ఇదంతా ఎవరికోసం. అన్నీ నీకోసం మన పిల్లలకోసం'' అంటూ మరేదేదో సుభాషితాలు వల్లించసాగాడు.

''మరైతే నేను ఇవ్వను అని ఎందుకన్నారు?'' ఇంకా కిందేపడున్న భర్తని పురుగుని చూసినట్లు చూస్తూ ఉరిమింది.

''అదా హీ హీ హీ నువ్వెలాగూ తీసుకుంటావుగా. ఇక నేను ప్రత్యేకంగా ఇచ్చే పనేముంది'' అంటూ అతికష్టం మీద లేచి నిలబడ్డాడు.

''ఏంటో మీ మాటలు.. ఒక్కసారి మీరసలు మాట్లాడేది తెలుగేనా అనిపిస్తుంది. సర్లెండి. ఇక అన్నం అఘోరించండి' విసవిస వెళ్లిపోయింది ఆనందవల్లే. పాంచజన్యం బ్రతుకును ట్రాజెడీచేసేసి.

ఆరోజు ఆదివారం. కాంతారావు పదింటికల్లా టిప్‌గా తయారై మాటిమాటికి వాచీ చూసుకోసాగాడు. శాంతకి అతని ప్రోగ్రాం అర్థమైంది. అయినా ఎక్కడికండి బయలుదేరారు అంది కుతూహలంగా.

''ఏంటి ఓ చెప్పడం మరిచాను. ఇవాళ నేనూ మా ఫ్రెండ్ కుషాయిగూడ వెళ్తున్నాం అన్నాడు చూపు తప్పిస్తూ.

''ఎందుకూ పేకాటకా'అని నోటి దాకా వచ్చింది కానీ మొదటి మాట మాత్రం అనింది శాంత.

''అక్కడ ఫ్లాట్స్ చాలా చవగ్గా ఉన్నాయట. అమ్మే వ్యక్తి మా ఫ్రెండ్‌కి చాలా దగ్గర బంధువేనట. డోంట్ వర్రీ ఫ్లాట్ నీ పేరునే తీసుకుంటామలే'' నవ్వుతూ అన్నాడు కాంతారావు.

శాంత మరేదో అనేంతలో ఓ వ్యక్తి వచ్చాడు. సన్నగా.. పీలగా స్ట్రాలా వున్నాడు. అతన్ని చూడగానే ఏదో డిస్కో శాంతిని చూసినట్లు మొహం చింపిచాటంత చేసుకున్నాడు.

''హల్లో గణపతి... నీ కోసమే వెయిటింగ్ వెళ్దామా''అని గుమ్మంలోనే అతగాడ్ని అటకాయించాడు.

గణపతి బెరుగ్గా ఓసారి శాంత వైపు చూసి 'బదిరోంకే లియో సమాచార్' భాషలో ఏవో సైగలుచేసాడు కాంతారావు. అతనూ ఏదో గుసగుసలుగా మాట్లాడడం శాంత బెడ్‌రూంలోంచి గమనిస్తూనే వుంది. ఓ నిముషం తరువాత కాంతారావు గబగబా లోపలికొచ్చి అల్మరా తీసాడు. కాసేపు వెదికి ''శాంతా ఇక్కడ కొంత డబ్బు వుండాలి. కనిపించడంలేదు.. నువ్వేమైనా తీసావా?'' అన్నాడు అసహనంగా.

నిజానికి ఆ డబ్బు శాంతే తీసి దాచింది. భర్త పేకాట సంగతి తెలిసినప్పట్నుంచి ఆమె డబ్బు విషయంలో జాగ్రత్తగా వుంటోంది. కాంతారావుకి కొద్దిగా మతిమరుపు. డబ్బు

విషయంలో నిర్లక్ష్యంగా వుంటాడు. రెండుమూడుసార్లు వందా రెండువందలు తీసినా ఆ విషయం అతను గమనించనేలేదు. ''ఏమైందబ్బా ఏమో'' అని కాసేపు గొణుక్కున్నాడు.

''అవును తీసాను. మొన్న రాజేశ్వరితో షాపింగ్ వెళ్లినప్పుడు ఓ చీర తీసాను. ఎంతో నచ్చింది తీసుకున్నాను... మీరు చూస్తారా?'' అంది ఏమీ ఎరుగనట్లు.

''ఎన్ని వున్నా తృప్తి వుండదు మీ ఆడాళ్ళకు నాతో మాటమాత్రం చెప్పొచ్చుగా ఏమిటో సర్లే నేవస్తాను'' ఏదో సణుగుతూ వెళ్లిపోయాడు కాంతారావు.

ఎలాగూ రాత్రి పదిలోపు భర్త రాడని తెలిసినా ఉండబట్టలేక రెండింటికల్లా వంట పని ముగించి అతని రాకకోసం ఎదురు చూడసాగింది.

ఆమె ఆలోచనలు ప్రస్తుతం తనని వేధిస్తున్న సమస్యవైపు మళ్ళాయి.

పేకాట, ఫ్రెండ్స్ — మరీ ముఖ్యంగా పార్వతీశం! పేకాట్లో భర్త సిగరెట్ కాల్చడం అయితే చూసిందికానీ, అది అతనిలో అలవాటు అనడానికి మరే దాఖలాలు లేవు... నిజంగా అలవాటు అయి వుంటే, ఏదో సందర్భంలో బైటపడి వుండేది... కాబట్టి ఆ విషయం వదిలెయ్యొచ్చు... అలాగే తాగుడు, రేసులు... వగైరాకూడా... వాటి విషయం ప్రస్తుతానికి వాయిదా వెయ్యడమే మేలని నిర్ధారించుకుంది.

తన సమస్య గురించీ, దానికి పరిష్కారం గురించి ఎవరినైనా సంప్రదించాలనిపించింది. కానీ ఆ వ్యక్తి ఎవరు? అని ఆలోచించి, ఆఖరికి అందుకు సరైన వ్యక్తి తన చిన్నన్నయ్య — వినయ్ అనిపించి, వెంటనే ఉత్తరం రాసి, వేణుచేత పోస్ట్ చేయించింది. ఆ పని చెయ్యగానే ఆమెకి కాస్త ఊరట కలిగింది. తన కష్టాలు పంచుకునే తోడు దొరికినట్టు ఫీలైంది.

ఆరోజు రాత్రి ఎనిమిదింటికే వచ్చాడు కాంతారావు. చాలా చికాగ్గా ఉన్నాడు. బహుశా

## ఎద్దు!



భర్తతో కోపంగా చెప్పింది భార్య ''ఈ ఇంట్లో ఎద్దులా కష్టపడి ఆరోగ్యం పాడుచేసుకున్నా నా గురించి పట్టించుకునేవాళ్లే లేరు.''

''వెట్నరీ డాక్టర్‌ని పిలిచాను. ఈపాటికి వస్తూవుంటాడు'' మరింత సీరియస్‌గా చెప్పాడు భర్త.

''...!?!''

—పద్మశ్రీ (మాణిక్యారం)

ఉన్నదంతా ఊడగొట్టుకుని వుంటాడనుకుని, అతన్ని కదిలించలేదు శాంత. పరధ్యానంగా నాలుగు మెతుకులు తిని తలనొప్పి అని మంచం ఎక్కాడు.

** ** **

శాంత ఉత్తరం రాసిన మూడో రోజుకి వినయ్ వచ్చాడు. తరచూ చేసే మనిషే అయినా ఆ క్షణంలో శాంతకి దేవుడిలా అనిపించాడు. జాబులో క్లుప్తంగా నాలుగే వాక్యాలురాసింది శాంత. ఓ విషయం వినయ్‌తో సంప్రదించాలనీ, వీలు చూసుకు రమ్మని రాసింది. పొరపాటున తల్లిదండ్రులకి, తన స్థితి తెలిస్తే, వాళ్ళు బాధపడి, నానా రభస చేస్తారని మరేమీ రాయలేదు. వినయ్ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్స్‌పెక్టర్‌గా పన్జేస్తున్నాడు. చిన్నప్పట్నుంచీ చాలా చురుకైనవాడని, పేరు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా శాంతీ, వినయ్‌కి ఏజ్‌లో పెద్ద తేడా లేనందువల్ల ఇద్దరూ ఫ్రెండ్స్‌లా మెదులుతారు.

వినయ్ వచ్చేసరికి కాంతారావు ఆఫీసుకెళ్ళిపోయాడు. స్నానం, భోజనం ముగించాక కాసేపు పేపరు చదువుతూ వుండిపోయాడు వినయ్. శాంత అన్నీ సర్దుకుని ఓ అరగంట తర్వాత మెల్లగా వచ్చి వినయ్ ఎదురుగా కూర్చుంది.

''ఏవిటీ సంగతి...?'' నవ్వుతూ పేపర్ ప్రక్కనే పడేస్తూ అన్నాడు వినయ్.

శాంతకి అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వినయ్ ఖంగారుపడ్డాడు. శాంత తండ్రికో, పెద్దన్నయ్యకో కాకుండా ప్రత్యేకించి తనకే జాబు రాసిందంటేనే ఏదో చాలా పర్సనల్, డెలికేట్ మ్యాటర్ అయి వుంటుందని గ్రహించాడు. ఏకంగా కంట తడి పెట్టించే విషయం అని తెలియగానే అతను నిజంగా చలించిపోయాడు.

చెల్లి కంట తడి పెట్టడం అతను చాలా చాలా అరుదుగా చూశాడు.

పావుగంట బుజ్జగించి, బతిమాలి, ఎంతో అవస్థ పడ్డాక, శాంత మొత్తం కథ చెప్పింది.

పేకాట ఆడ్డం, ఫ్రెండ్స్‌తో గంటల తరబడి గడపడం వగైరా అతని దృష్టిలో పెద్ద క్షమించలేని నేరాలు కావు. ఎంచేతంటే అతనూ మగాడే కాబట్టి. కాకపోతే తన ఒక్కగానొక్క చెల్లి మనస్థాపానికి అవి కారణం కాబట్టి అతను కొంత ఆవేశపడ్డాడు. అదే ఫలానా వెంకాయమ్మ మొగుడు రెండురోజులకోసారి ఇంటికొస్తాడన్నా, శేషారత్నం అల్లుడు వరసగా వారం రోజులు పేకాటాడతాడని విన్నా అతను సరదాగా నవ్వేసి తేలిగ్గా తీసుకునేవాడు.

వినయ్ మొహంలో కోపం చూసి శాంత కంగారుపడింది. ''ఆయన్ని డైరెక్టుగా అడగడం... ఏదో రభస చేయడంలాంటివి చెయ్యొద్దు... ఆ పని నేనే చేసి వుండేదాన్ని... మన ప్రమేయం తనకి తేలీకుండా ఏదైనా పరిష్కారం ఆలోచించు... అంది వేడుకోలుగా

కాసేపాలోచించి ''మొదట మనం తెలుసుకోవాల్సిన విషయాలుకొన్ని వున్నాయ్.

ఉదాహరణకి మీ ఆయన పేకాటపిచ్చి ఏ స్థాయిలోవుంది? ఎక్కడెక్కడ ఆడతాడు? మిగతా జాడ్యాలుకూడా ఉన్నాయా... వగైరా... కొంత టైం పడుతుంది.... ముందు నేనొక పని చెయ్యాలి'' అంటూ బయలుదేరాడు వినయ్.

''ఎక్కడికి?'' కుతూహలంగా అడిగింది శాంత.

వినయ్ నవ్వి ''టెలిగ్రాఫ్ ఆఫీసుకి... లీవ్ పొడిగిస్తున్నట్టు టెలిగ్రాం ఇవ్వాలిగా'' అంటూ వెళ్ళిపోయాడు.

మరో గంట తర్వాత హడావిడిగా తిరిగొచ్చి ''చెల్లాయ్... బావగారి ఫోటో ఒకటివ్వు'' అన్నాడు తొందరపెడుతూ.

శాంత ఆల్బంలోంచి కాంతారావు ఫోటో తీసుకొచ్చి ఇచ్చింది... ఎందుకని అడుగుతున్న శాంత మాటలు పట్టించుకోకుండా ఆగి వున్న ఆటోవైపు పరిగెత్తాడు.

పది నిమిషాల తర్వాత ఆటో ఒక ఇరుకు సందులో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ ఇంటిముందు ఆగింది.

ఆటోవాడ్ని పంపించి చేతిలో ఉన్న విజిటింగ్ కార్డ్‌పైన ఉన్న ఎడ్రెస్ చూశాడు వినయ్.

'ఎక్స్‌రే డిటెక్టివ్ ఏజెన్సీ... రిజిస్టర్డ్ నెం.1' అని వుంది. సందేహిస్తూనే మెట్లెక్కాడు. ముందు ఓ హాల్‌లాంటిది కనిపించింది. అందులో రెండుమూడు ఉడెన్ టేబిల్స్, ఛైర్స్... ఓ గాద్రేజి అల్మారా... రెండు ఫైల్ ర్యాక్స్... కిటికీలో రెండు కూజాలు... మట్టిగొట్టుకున్న నాలుగు గాజుగ్లాసులు... ఓ మూల చిన్న టేబిల్‌ముందు ఓ నలభై ఏళ్ళ స్త్రీ టైప్ మిషన్‌ముందు కూర్చుని ఏదో వారపత్రిక తిరగేస్తూ కనిపించింది. వినయ్‌ని చూసి ఆమె మొహం చిట్లించి ఏమిటన్నట్లు కనుబొమ్మలెగరేసింది. వినయ్ తన చేతిలో ఉన్న కార్డు చూపించి ''ఉన్నారా'' అన్నాడు.

## స్వాగతం



ఒకవేళ నా గురించి నేను మంచి నటుడని చెప్పుకుంటే నాకు తల పొగరు అంటారు. పోనీ నేను మంచినటుడ్ని కాదని అందామంటే మిగిలిన వాళ్ళంతా గొప్పవారని నేనే ఒప్పుకున్నట్లు అవుతుంది. అందువల్ల నేను నన్ను గుర్తుంచుకుంటూ కొత్తవాళ్ళ గురించి భయపడను'' అంటున్నాడు సల్మాన్‌ఖాన్. అయినా నాలుగు సినిమాల్లో నటించి డబ్బు సంపాదించుకోక ఎందుకో ఈ స్వాగతాలు!!

—జూపిటర్

''ఉన్నారు... వెళ్ళండి'' అని కసిరినట్టు చెప్పి మళ్ళీ పత్రికలో మునిగిపోయింది.

ఎటు వెళ్ళాలో తెలీలేదు... మరో డోర్ ఏదీ కనిపించలేదు వినయ్ కి.

ఇంతలో ''కమిన్'' అన్న బొంగురుగొంతు వినిపించి తృళ్ళిపడ్డాడు. ఆ శబ్దం అల్మారా వెనకనుంచి అని గ్రహించి అటు నడిచాడు.

అల్మారా వెనక ఓ స్వింగ్ డోర్ వుంది. భయంకరంగా శబ్దం చేస్తున్న ఆ డోర్ రెక్కలు తోసుకుంటూ లోపలికి నడిచాడు. లోపల బయటికన్నా భయంకరంగా, నికృష్టంగా వుంది పరిస్థితి. ఆరు బై ఎనిమిది అడుగుల రూం అది. అందులో సగానికి పైగా ఆక్రమించిన ఓ టేబిల్. ఓ పాడుబడ్డ రివాల్వింగ్ చైర్... గుమ్మం ప్రక్కనే ఓ చిన్న కబోర్డ్.... పైన మెషిన్‌గన్‌లా శబ్దం చేస్తూ తిరుగుతున్న క్రీస్తుపూర్వం కాలపు ఓ ఫ్యాన్‌లాంటిది. టేబిల్‌మీద ఏవేవో కాగితాలూ... ఫైల్స్ చిందరవందరగా పడివున్నాయి... రూంనిండా చెదలవాసన... అప్రయత్నంగా ముక్కు మూసుకుని, రెండడుగులు వెనక్కేశాడు వినయ్. అతను అసలు వచ్చింది కరెక్ట్ అడ్రెస్‌కేనా అనే సందేహం కలగసాగింది.

రివాల్వింగ్ చైర్‌లో గుండుసూది పర్సనాలిటీతో ఉన్న ఓ వ్యక్తి కనిపించాడు. ''రండి కూర్చోండి'' అన్నాడతను. ఆకారానికీ, స్వరానికీ పొంతనే లేదు. ఏదో చవకబారు డబ్బింగ్ సినిమా చూస్తున్నట్టు వుంది. జేబులోంచి కర్చీఫ్ తీసి కుర్చీలో పరచి జాగ్రత్తగా కూర్చున్నాడు వినయ్. టేబిల్‌మీద 'ప్రొప్రయిటర్ — సో.ది' అనే నేమ్ ప్లేట్ కనిపించింది. ప్రశ్నార్థకంగా చూసిన వినయ్‌ని తన గారపళ్ళు పాతికదాకా చూపించి, ''సో ఫర్ సోమిశెట్టి, ది ఫర్ దిగంబరరావు... గాట్ ఇట్?'' అన్నాడు 'ఏ ఫర్ యాపిల్' బాపతు కిండర్‌గార్టెన్ టీచర్‌లా.

''వాట్ కెన్ ఐ డూ ఫర్‌యూ... మీకు నేనేమి చేయగలను'' అంటూ తెలుగు సినిమా హీరోలా తర్జుమా చేశాడు సో.ది.

''ఏ లాట్! మొదట ఆ మిషన్ గన్‌ని కట్టేయండి... నేను గట్టిగా అరవలేను...'' అన్నాడు వినయ్ చిరాగ్గా.

ఓ క్షణం అర్థంకానట్టు చూసి ''ఓ అదా... దట్స్ ఓకే అలాగే'' అంటూ కిందికి వంగి ఏదో చేశాడు. మరుక్షణం ఏరోప్లేన్ క్రాష్‌ల్యాండ్ అయినట్టు పెద్ద శబ్దం! టక టకమంటూ రెండునిమిషాలు తిరిగి ఆ 'యంత్రం' ఆగిపోయింది.

''ఇక చెప్పండి... వాట్ కైనై...'' అంటూ మళ్ళీ మొదలెట్టాడు మిస్టర్ సో.ది.

కాంతారావు ఫోటో సో.ది.కి ఇచ్చి''ఇతను నా బావ... ఇతని గురించి కొన్ని వివరాలు... ఐ మీన్... ఎక్కడెక్కడ తిరుగుతాడు... ఎవరెవర్ని కలుస్తుంటాడు... ఏ అలవాట్లున్నాయి... వగైరా... వగైరా.... ఇన్ షార్ట్ ఇతని జాతకం కావాలి'' అన్నాడు వినయ్ సీరియస్‌గా.

సో.ది. టేబిల్‌లైట్ వేసి కాసేపు వెదికి టేబిల్ సొరుగులోంచి ఓ భూతద్దం తీసి, అందులోంచి రకరకాల యాంగిల్స్‌లో కాంతారావు ఫోటోని చూడసాగాడు.

కాసేపటికి వుండబట్టలేక "మామూలుగా బాగానే కనిపిస్తోందిగా... అంత ఓవర్‌యాక్షన్ అవసరమా?" అన్నాడు వినయ్ చిరుకోపంతో.

పట్టుబడ్డ దొంగలా "హి...హి...హి అని తన దంత సంపదని మరోమారు ప్రదర్శించి, "ఏదో మా అలవాటు... అవర్ హ్యాబిట్... వివరాలు ఎప్పటిలోగా కావాలి" అన్నాడు సో.ది. ఓ డైరీ తెరుస్తూ.

"సాధ్యమైనంత త్వరలో... ఓ మూడురోజుల్లోగా ఇవ్వగలరా?"

"త్రీడేస్.. మూడు రోజులా... యూమస్ట్‌బీ జోకింగ్... మీరు తమాషా" అంటూ మళ్ళీ తర్జుమా ప్రోగ్రాం మొదలెట్టాడు సో.ది.


వినయ్ అడ్డుపడి "సరె... సరే... పోనీ ఓ వారంలోగా ఇవ్వండి. నాకు అట్టే టైం లేదు" అన్నాడు చిరాగ్గా. ఆ ఏజెన్సీ స్థితి, సో.ది వాలకం చూస్తుంటే తను ఇక్కడికి వచ్చి పొరాటుగానీ చేశానా అనే సందేహం పీడించసాగింది. అయినా తన క్లోజ్ ఫ్రెండ్ ఇన్స్‌పెక్టర్ సుధీర్ మరీమరీ రికమండ్ చేశాడని రావాల్సి వచ్చింది.

సో.ది. కాసేపు ముందున్న డైరీ తిరగేసి 'యూసీ... మేం ప్రస్తుతం చాలా చాలా బిజీ... లాస్ట్ ఇయర్‌లో టేకప్ చేస్తామన్న కేసులే మా వెయిటింగ్ లిస్టులో వున్నాయి. మీరు సుధీర్‌గారిద్వారా వచ్చారుకాబట్టి ఈ మాత్రమైనా..." అంటూ ఫోజుకొట్టాడు.

వినయ్ కి వొళ్ళు మండింది. ఈగలు తోలుకుంటున్నా ఫోజులకేం తక్కువలేదు.

"సరే మిస్టర్ సో.ది. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నాకిష్టంలేదు... మరొకర్ని సంప్రదిస్తాను... గుడ్‌డే..." అంటూ లేచాడు.

అంతవరకూ పైప్ వెలిగించడానికి తంటాలు పడుతున్న సో.ది షాక్ తిని రివాల్వింగ్ చైర్‌లోంచి కిందపడ్డాడు. ఆ షాక్‌లో పైప్ నోట్లో ఎక్కడో పొడుచుకున్నాడేమో పళ్ళమ్మటి రక్తం కారసాగింది. దాదాపు డ్రాకులా వేలు విడిచిన మేనమామలా కనిపించాడు. స్ప్రింగ్‌లా



ఎగిరి వినయ్ కాళ్ళమీద పడ్డాడు. "నన్ను క్షమించండి. దయచేసి ఈ కేస్ నాకే ఇవ్వండి... మూడు రోజుల్లో రిపోర్ట్ ఇస్తాను... ఫీజుకూడా మీ ఇష్టం... ఆ ఫ్యాన్ రిపేర్‌కి సరిపడా ఇచ్చినా చాలు" అంటూ భోరున ఏడవసాగాడు.

వినయ్ జాలిపడి ముందు ఆ నోటికి ఫస్ట్ ఎయిడ్ చేయించుకోండి... ఇంద అడ్వాన్స్...." అంటూ ఓ వందరూపాయలు ఇచ్చాడు.

మెల్లగా లేవబోతున్న సో.ది అమాంతం మళ్ళీ కాళ్ళమీద పడి థాంక్స్... థాంక్స్ అని రెండుసార్లు అరచి ఆ తర్వాత "ధన్యవాదాలు" అన్నాడు అలాంటి స్థితిలోకూడా తర్జుమా చేస్తూ.

సో.ది అడిగిన వివరాలు చెప్పి గబగబా బయటపడ్డాడు వినయ్.

** ** **

కాంతారావు ఆరోజు ఏడుగంటలకే ఇంటికి చేరాడు. వినయ్‌ని చూసి ఆశ్చర్యపోయి... కుశల ప్రశ్నలు వేసి "ఇవ్వాళ ఆఫీసులో పని ఎక్కువగా వుంది. అంచేత కాస్త లేటైంది" అన్నాడు అడగకపోయినా సంజాయిషీ ఇస్తూ. వినయ్ మర్యాదపూర్వకంగా నవ్వి ఊరుకున్నాడు.

భోజనాలు అయ్యాక కాంతారావు, వినయ్ కబుర్లలో పడ్డారు.

"ఆ! ఇప్పుడు చెప్పవోయ్... ఏమిటీ విశేషాలు..." వక్కపొడి నోట్లో వేస్కుంటూ అన్నాడు కాంతారావు.

"పెద్ద విశేషాలేముంటాయిలెండి... నా క్లోజ్ ఫ్రెండొకడు తన పెళ్ళి కుదిర్చే బాధ్యత నామీద పెట్టాడు. ఎల్లుండే పెళ్ళిచూపులు... అదీకాక ఇక్కడ మా హెడ్డాఫీసులో చిన్న పనొకటుంది... రెండూ అటెండ్ అయినట్టుగా వుంటుందని వచ్చాను... నాలుగురోజులు నన్ను భరించక తప్పదు..." వినయ్ నవ్వుతూ అన్నాడు.

"భలేవాడివోయ్ నాలుగురోజులు కాకపోతే నలభై రోజులుండు. నువ్వేం పరాయివాడివా. .. యూ ఆర్ మోస్ట్ వెల్‌కం" పూడుకుపోయిన గొంతుతో కాంతారావు. వినయ్ ఏదో మాట్లాడుతున్నాడు. కాంతారావు పరధ్యానంగా ఆలోచిస్తున్నాడు. రెండ్రోజుల్లో రాబేయే పండే సెషన్‌కి ఏ వంకతో వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాడు. హై స్టేక్స్ అన్నారు... ఆ దెబ్బతో ఆ నెల్లో పోయిందంతా రికవర్ చెయ్యాలనే ప్లాన్‌తో వున్నాడు కాంతారావు.

శాంత వచ్చిందికూడా గమనించలేదు కాంతారావు.

"ఇదిగో... మజ్జిగ...." మూడోసారికి కాంతారావు ఉలిక్కిపడి వాళ్ళవైపోసారి గిల్టీగా చూసి గ్లాసందుకున్నాడు.

"బావగారు ఇంట్లోకూడా ఆఫీసు విషయాలు ఆలోచిస్తారా చెల్లాయ్?" వినయ్ వేళాకోళమాడాడు. శాంత ముసిముసిగా నవ్వింది.

"బోరు కొడుతోంది... బావగారూ కాసేపు పేకాడదామా... చెల్లాయ్ నువ్వురా"



''కార్డ్స్ ఆడ్డం నాకు చేతకాదులే వినయ్... మరేదైనా ఆడదాం...'' కాంతారావు ఎటో చూస్తూ.

ఓ నిమిషం వినయ్ , శాంతా లోలోపలే గుండెలు బాదుకున్నారు. ''అదేంటి మీకు నిజంగా రాదా...?'' ఆశ్చర్యం నటించాడు వినయ్ .

''ఎప్పుడో కాలేజ్ డేస్‌లో ఎవరో ఎలా ఆడాలో చూపించారు. మర్చిపోయాను. అప్పట్నుంచీ మళ్ళీ వాటి జోలికి వెళ్ళలేదు... నాకు పెద్ద ఇంట్రెస్ట్‌కూడా లేదు'' కాంతారావు ఏదో రుషిలా అలా చెబుతుంటే అన్నా చెల్లెళ్ళిద్దరికీ పగలబడి నవ్వాలనిపించింది

శాంతకి కాస్త కోపంగాకూడా వుంది. భర్త నాటకాలు చూస్తుంటే. అందుకే ఆమెకూడా వినయ్ కి వంతపాడింది. మొత్తానికి కాంతారావుని పేకాటకి ఒప్పించారు. ఆట ఎలా ఆడేది వినయ్ ఓపిగ్గా వివరించాడు. ఆ తర్వాత ఓ బాంబు పేల్చాడు.

''ఊరికే ఆడితే ఏం బావుంటుంది. ఓకుకి అర్ధరూపాయి పెట్టుకుందాం... సరేనా'' అన్నాడు వినయ్ శాంతవైపు చూసి కన్నుగీటుతూ.

కాంతారావుకి ఉత్సాహంగానే వుంది... అయినా ''అబ్బే వద్దు... వద్దు... నాకసలే రాదు. అయినా ఇంటిని క్లబ్ చేయడం నాకు నచ్చదు'' అన్నాడు సీరియస్‌గా.

'ఆహ్ పోనీ క్లబ్‌నే ఇల్లు అనుకోవచ్చా...?' అనాలని శాంతకి ఎంతగానో అనిపించింది.

''అబ్బ బావగారు... మీరు మరీనూ. మనమేం వేలూ వందలూ పెడుతున్నామా... ఏదో సరదాకి అంతే... అయినా ఎవరు గెలిస్తే మాత్రం ఏం మనడబ్బు మనవాళ్ళదగ్గరేగా వుంటుంది?'' అని కన్విన్స్ చేశాడు.

కాంతారావు మరేం అనలేదు. నిజానికి డబ్బు పెట్టకుండా ఆడ్డం అతనికి అసలు గిట్టదు. రెండో ఆటలో వినయ్ కావాలని రాంగ్‌షో చూపించాడు. కాంతారావు పట్టుకున్నాడు.

''బాబోయ్ ... ఏంటో అనుకున్నా చెల్లాయ్ ... బావగారు ఏకసంతాగ్రాహి... ఒక్కసారి అలా ఆట విధానం చెప్పానో లేదో... అప్పుడే ఎంత అడ్వాన్స్ అయిపోయారో చూడు...'' కాంతారావు గిల్టీగా ఫీలవుతూ ఇబ్బందిగా నవ్వాడు.

''నా ముక్కలు చూస్తారేం?'' అని కసిరింది శాంత.

''హి...హి... మన ముక్కలు మనమెప్పుడైనా చూసుకోవచ్చు. పక్కవాళ్ళవి ఎంత త్వరగా చూస్తే అంత మంచిది... అయినా కనబడేట్టు పట్టుకోవడం నీ తప్పు'' కాంతారావు మంచి మూడ్‌లో వున్నాడు. అప్పటికే వందపైనే వచ్చింది కలెక్షన్.

రాత్రి పదింటికి శాంత తనకి నిద్రొస్తుందని లేచింది. అయిష్టంగా కాంతారావు శాంతని అనుసరించాడు.

** ** **

ఆదివారం ఏం చెప్పి బైటపడాలా అని నాలుగురోజులనుంచి బుర్ర బద్దలుకొట్టుకుంటు న్న కాంతారావుని అదృష్టం వరించింది. ఆరోజు లంచ్‌టైంలో పరధ్యానంగా రాంప్రసాద్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. ఓ వ్యక్తి వాళ్ళదగ్గరకొచ్చాడు-- ప్రసాద్‌గారూ... ఇన్నాళ్ళకి నేనో ఇంటివాడ్నవుతున్నాను...'' అన్నాడు చెంపలు చిరిగిపోయేట్టు ఇకిలిస్తూ.

"చాలా సంతోషం! ఎప్పుడు గృహప్రవేశం?" ప్రసాద్ కుతూహలంగా అడిగాడు.

ఆ వ్యక్తి మొహం మాడ్చుకున్నాడు. "అబ్బే... మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. రేపు ఆదివారం ఉదయం పదింటికి నా పెళ్ళి మీరూ... ఫ్యామిలీ తప్పకుండా రావాలి" వానపాములా మెలితిరిగిపోసాగాడు. సిగ్గుపడుతూనే రాంప్రసాద్‌కి ఓ శుభలేఖ అందించాడు.

రాంప్రసాద్ దేవుడిమీదా, తన పెళ్ళాం పిల్లలిమీద ఒట్టుపెట్టి మరీ వస్తానన్నా ఓ పట్టాన విడిచిపెట్టలేదు. మరోక్షణంలో రాంప్రసాద్ వీరావేశంతో ఆ వ్యక్తిని ఓటర్స్ లిస్ట్‌లోంచి తొలగించే ప్రయత్నానికి పూనుకోబోతుండగా అప్పుడు నిష్క్రమించాడు.

"ప్రసాద్, ఎవరా వ్యక్తి?" కుతూహలం ప్రదర్శించాడు కాంతారావు.

"మన బ్యాంక్ కస్టమరేలే... ఎప్పుడూ పెళ్ళిగాడవే వీడికి..." అంటూ శుభలేఖ చూసి... "ఆహా పటాన్‌చెరులో అట పెళ్ళి... ఇంకా నయం! ఫక్తునిస్తాన్‌లో అన్లేదు... ఎవడెళతాడు?" చిరాగ్గా డస్ట్‌బిన్‌లోకి గిరాటేయబోయాడు ప్రసాద్.

కాంతారావు బుర్రలో మెరుపు! "ఆగు ప్రసాద్... అది ఇలాతే...దాంతో చాలాపనుంది...వెళ్దాం పద...." అంటూ శుభలేక తీసుకుని బయటికి నడిచాడు.

ఆ రోజు కాంతారావు సాయంత్రం ఆరయ్యేసరికి ఠంచనుగా ఇంట్లోవున్నాడు. చాటుగా మల్లెపూల పొట్లం శాంతకిచ్చి వినయ్, శాంత గమనిస్తుండగా విసుగ్గా శుభలేక టేబుల్‌మీదకి విసిరేసాడు.

"ఎవరిదండీ శుభలేఖ...?" అని అతను ఆశించినట్టుగానే వాళ్ళిద్దరు అడిగారు.

"అదా...మా ఫ్రెండ్‌ది. మధ్యాహ్నంనుంచీ ఒకటే గోల...తప్పకుండా రావాలని. క్లోజ్ ఫ్రెండ్ కదా...వెళ్ళక తప్పదు... అన్నాడు బెడ్‌రూంలోంచే లుంగీ కట్టుకుంటూ.

## పెళ్ళిచూపులు



"నాకు మూడేళ్ళవరకు పిల్లలు వద్దనుకుంటున్నాను" అంది లక్ష్మి.

"ఏ పద్ధతి పాటిస్తావ్?" అడిగింది పద్మ.

"మూడేళ్ళూ పెళ్ళిచూపులు పెట్టొద్దని నాన్నకి చెప్పేశా?" టక్కున చెప్పింది లక్ష్మి.

—కొట్నం వెంకటరెడ్డి
(ఈస్ట్‌విప్రరు)

శాంత శుభలేఖ చూసింది. ఎప్పుడూ ఇతని పేరు చెప్పినట్టు గుర్తులేదే...' క్లోజ్ ఫ్రెండ్ అంటున్నారు....అంది సాలోచనగా.

"బహుశా ఈ మధ్యే క్లోజ్ అయివుంటాడు....కదు బావా..." అన్నాడు వినయ్ అమాయకంగా.

కాంతారావు గతుక్కుమన్నాడు—అన్నిటికీ తొందరే...ఏదో ఫ్రెండ్ అని ఏడిస్తే సరిపోయేదానికి క్లోజ్ ఫ్రెండ్ అన్నందుకు ఒక క్షణం తవని తానే బూతులు తిట్టుకుని "ఏం వినయ్...మీ ఫ్రెండ్ పెళ్ళిచూపులు అయిపోయాయా''' అన్నాడు మాటమారుస్తూ.

"అసలు పెళ్ళికూడా ఏ క్షణంలోనైనా జరగొచ్చు.."అన్నాడు వినయ్ భావయుక్తంగా.

* *

మర్నాడు ఆదివారం....పదింటికల్లా బయటపడ్డాడు కాంతారావు ఉత్సాహంగా. మధ్యాహ్నం వినయ్ డిటెక్టివ్ ఏజెన్సీకి బయలుదేరాడు.

నీట్‌గా టైప్‌చేసి ఫోల్డర్‌వున్న నాలుగైదు పేజీలవైపు కుతూహలంగా చూసాడు వినయ్. తేదీలో (టైంతోసహా) వారీగా ఒక్కరోజు కాంతారావు ఏం చేసిందీ పూర్తివివరాలు అందులోవున్నాయి.

"ఇందులో కొన్ని విషయాలు మా బావతో డైరక్టుగా మాట్లాడి కాస్తో, కూస్తో క్లోజ్‌గా మూవ్ అయితేగానీ తెలుసుకోలేనివి కూడా వున్నాయి! అది ఎలా సాధ్యపడింది?" అన్నాడు ఆశ్చర్యంగా.

మొదట ట్రేడ్ సీక్రెట్ అని మొరిగినా చివరికి "వెరీ సింపుల్! చాలా తేలిక! మీ బావ కార్డ్సు ఆడే సర్కిల్‌లో నా ఎసిస్టెంట్‌ని ప్రవేశపెట్టాను" గర్వంగా అన్నాడు పోదిపైప్ వెలిగించే ప్రయత్నం చేస్తూ.

వినయ్ కొంత డబ్బు టేబుల్‌మీద పెట్టాడు. మొత్తం లెక్కచూసుకుని క్రితంసారిలా షాక్‌లో కిందపడి, కృతజ్ఞతతో వినయ్ కాళ్ళవైపు పాక్కుంటూ రాబోతుంటే ఖంగారులో కంగారూలా బైటికి దూకాడు వినయ్.

శాంత ఇచ్చిన కాఫీ సిప్‌చేసి "శాంత నువ్వు భయపడాల్సిందేమీ లేదు...ఇంకా బావ ఎల్‌కెజీలోనే ఉన్నాడు. నువ్వు అనుకున్నట్టుగావే మీ ఆయనకి సిగరెట్స్ అలవాటులేదు. కాకపోతే కార్డ్సులో కూర్చున్నప్పుడు టెన్షన్ మరీ ఎక్కువైనప్పుడు ఒక్కటి! అరా కాలుస్తాడట. అదీ మంచి బాలుడిలా సగమే తాగుతాడట...రేసులు...వ్యభిచారం వగైరా కూడా లేనట్టే...సమ్మర్‌లో ఎప్పుడైనా ఒకటో రెండో గ్లాసులు బీర్‌మాత్రం తాగుతాడట.

అదీ ఎక్కువగా పార్వతీశం బలవంతం వల్లేనట...కార్డ్స్ అంటే మాత్రం చాలా ఇష్టమట...ఎక్కువగా పోగొట్టుకుంటాడట... తను బాగా ఆడతానని ఓ వెర్రి నమ్మకం అట. ఫ్రెండ్స్‌కోసం బాగానే డబ్బు తగలేస్తాడట. ముఖ్యంగా ఆ పార్వతీశానికి...'' అంటూ మరికాసేపు రిపోర్టు వివరాలు చెప్పాడు.

శాంతకి అంతా విన్నాక కాస్త రిలీఫ్ లాంటిది కలిగింది. మొదట కార్డ్స్ జబ్బు వదిలించాలని ఇద్దరూ తీర్మానించారు.

నాలుగురోజులుంటానన్న బావమరిది, వారమైనా కదలకపోవడం కాంతారావుకి చాలా ఇబ్బందిగా ఉంది...రోజూ ఆరింటికల్లా ఇంటికి రావడం అతనికేదో జైలుకు వెళ్ళినట్టు అనిపిస్తోంది: ముఖ్యంగా ప్రియమిత్రుడు పార్వతీశాన్ని కలవకపోవడం..అందుకు తగ్గట్టు పార్వతీశం కూడా ఆఫీసుకు ఫోన్‌చేసి నిష్ఠూరాలాడ్డం. కాంతారావుకి ఏదో పోగొట్టుకున్నట్టు విరక్తిగా అనిపిస్తోంది.

అందుకే ఆ రోజు ఉదయం కాఫీ తాగుతూ ''ఏం వినయ్..నీ పనులు ఎంతవరకు వచ్చాయ్...? కొంపదీసి మీ ఫ్రెండ్ ఏకంగా పెళ్ళి అయ్యేవరకు ఉండిపొమ్మన్నడా....''అన్నాడు ఛలోక్తిగా

''అబ్బే అదేంలేదు...ఈరోజుతో అంతా సెటిల్ అయిపోతుంది...ఆదివారం పొద్దున్నే వెళ్ళాలనుకుంటున్నాను...'' అన్నాడు 'ఆదివారం' అనే మాట వత్తిపలుకుతూ.

కాంతారావుకి ఏనుగెక్కినంత సంతోషం వేసింది. పైకిమాత్రం ''భలేవాడివే అప్పుడే ఏం తొందర..? మరి నాలుగు రోజులుండిపోవచ్చులే'' అన్నాడు లేని ఆప్యాయత వలకబోస్తూ.

''శాంతకూడా ఆ మాటే అంటోంది....ఏంటో...మీరింతగా బలవంతం చేస్తే ఇక



# దావానలం

ఒక్క పక్క వృక్షో రక్షతి రక్షితః అనే నినాదం వినిపిస్తూ వుండగా వాతావరణ కాలుష్యం ఆపండహో అని నేలమీద గాలిలోన బాకా ఊదుతూ చెబుతున్న వినిపించుకోని ప్రభుత్వ శాఖలు అనేకం వున్నాయి. అటువంటి దావానలం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అసన్‌సోల్ ప్రాంతంలో గత జూన్ మాసం నుండి మండుతూనే వుంది. 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ దావానలం ఇప్పటివరకూ 50,000 వృక్షాలను కబళించి వేసింది. ఇంతకీ ఈ అగ్ని రగులుకున్న కారణం ఏమిటా అని విచారిస్తే ప్రభుత్వం వారు పనికిరాదని వదిలేసిన బొగ్గు గని అని తేలింది.

—ప్రసూరి

తప్పేదేముంది...కాకపోతే ఆఫీసులో కాస్త అర్జెంట్ పనుండి సందేహిస్తున్నాను గానీ...అన్నాడు వినయ్.

ఇందాక తను ఎక్కిన ఏనుగు ప్రస్తుతం తన మీదే ఎక్కినట్టుగా అనిపించసాగింది కాంతారావుకి...వెధవ తెలివితేటలు...! వినయ్ అన్న చివరిమాట పట్టుకుని "నిజమేనోయ్.. .ఆఫీసుపని అలక్ష్యం చేయ్యకూడదు. పోస్టే ఈసారి వచ్చినప్పుడు మాత్రం ఖచ్చితంగా నైనైనా ఉండాలి" అన్నాడు కాంతారావు వినయ్‌కి మరో అవకాశం ఇవ్వకుండా

తమ పథకం ఫలించడానికి అన్ని ఏర్పాట్లు చేసానని..తనింకా అక్కడేవుంటే కాంతారావుకేదైనా అనుమానం కలగొచ్చని...మరేం ఖంగారుపడొద్దని శాంతకి నచ్చచెప్పి, ఆదివారం ఉదయం కాంతారావు స్టేషన్ వరకు సాగనంపగా క్రిష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు వినయ్.

స్టేషన్‌నుండి తిరిగొస్తుంటే కాంతారావుకి సత్యనారాయణ తగిలాడు. "ఏం గురూ...ఈరోజు ప్రోగ్రాం గుర్తుందిగా...వస్తున్నట్టేనా..?" అని ఓ అర్థంలేని ప్రశ్న వేసాడు.

"గుర్తుందా...? అసలు మరిచిపోతేకదా..ఎప్పుడెప్పుడు పదవుతుందా..? అని చకోరపక్షిలా చూస్తుంటే అలా అడుగుతావేం...?" అన్నాడు కాంతారావు.

"అన్నట్టు సత్యం నాకో హెల్ప్ చేయాలి...అంటూ అతను ఏం చేయాల్సిందీ వివరించి ఆనందంగా ఇంటికి బయలుదేరాడు.

తొమ్మిదిన్నరవుతున్నా భర్త బయలుదేరే సూచనలు కన్పించకపోవడంతో శాంత ఆశ్చర్యపోయింది. అంతలోనే "కాంతారావు...!" అన్న ఆర్తనాదం వినిపించి తుళ్ళిపడింది. గుమ్మంలోవున్న శాల్తీని వెంటనే గుర్తించింది. ఆమెకి భర్త ఏదో ఎత్తువేసాడని అనుమానం కలిగింది. శాంత వరండాలోకి వచ్చింది.

"కాంతారావు లేడాండీ...?" అన్నాడు సత్యనారాయణ దాదాపు అరుస్తున్నట్టుగా.

"ఉన్నారు...ఎందుకు..?" అంది శాంత సంగతేమిటో తెలుసుకుందామనే కుతూహలంతో.

"ఘోరం జరిగిపోయింది సిస్టర్..."అన్నాడు సత్యనారాయణ గుండెలు బాదుకుంటూ.

అతను అరవ సినిమాలు ఎక్కువగా చూస్తాడేమోనని అనుమానం కలిగింది శాంతకి.

"ఎక్కడ...? ఎవరికి?" అని జంటప్రశ్నలు వేసింది అసహనంగా.

'మా బాబిగాడ్ని కుక్క కరిచింది..."

"అయితే మావారొచ్చి ఏంచేస్తారు..?" అంది నిర్దయంగా మామూలుగా అయితే ఆమె అంతసేపు భర్త ఫ్రెండ్స్‌తో మాట్లాడేదికాదు... పేకాట విషయం తెలిసినప్పటినుంచీ భర్త ఫ్రెండ్స్ అంటేనే మంటగా ఉంది శాంతకు. పైగా అదంతా ఏదో నాటకం అనికూడా

అనుమానంగా ఉండంతో కాస్త మొరటుగానే మాట్లాడింది.

"మావాడ్ని వెంటనే హాస్పటల్ కి తీసుకెళ్ళాలి...ఇవ్వాళ ఆటోవాళ్ళు స్ట్రయిక్...ప్లీజ్ కాంతారావుని పిలవండి..."అంటూ లోపలికి తిరిగి తొంగి తొంగి చూసాడు. శాంత మరేదో అనేంతలో కీ ఇచ్చినట్టు కాంతారావు అక్కడికి వచ్చాడు.

"మీవాడ్ని కుక్క కరిచిందా.."అన్నాడు ఆందోళనగా. వెంటనే శాంత—

"ఆ విషయం మీకెలా తెలుసు?" అంది కోపంగా.

"అదీ..అదే..ఇందాక మావాడు చెబుతుంటే విన్నాను...పద సత్యం..మనం అశ్రద్ధ చెయ్యకూడదు. వెంటనే యాంటీ రాబీస్ ఇంజక్షన్ ఇప్పించాలి పద...పద.." అంటూ తొందర చేసాడు.

"భోంచేసి వెళ్ళండి. మళ్ళీ ఏ రాత్రికోగాను రారాయే" అంది శాంత.


"టైం లేదు. అవతల ఓ పసివాడి ప్రాణాలు పోతుంటే నాకు అన్నం ఎలా సహిస్తుందనుకుంటున్నావ్...ఉద్వేగంగా అన్నాడు కాంతారావు ఏదో తన కొడుక్కే ప్రమాదం జరిగినట్టు.

"పోనీ కాఫీ అయినా తాగండి..."బతిమాలింది శాంత.

సత్యనారాయణ ఫ్రీగా వస్తే ఫెవికోల్ అయినా మింగే రకం! "పోన్లే గురూ సిస్టర్ నెందుకు చిన్నబుచ్చడం? అలాగేలేమ్మా...నువ్వెళ్ళి తీసుకురా..." అంటూ చొరవగా సోఫాలో కూలబడ్డాడు.

కాంతారావు పళ్ళు పటపటలాడించి...."పరే త్వరగా పట్రా" అని పళ్ళు బిగువున అన్నాడు.

"ఆ చేత్తోటే టిఫిన్ ఏమైనావుంటే తీసుకురా సిస్టర్" అని సత్యనారాయణ



ఉత్సాహంగా అరిచాడు

శాంత ఇడ్లీ ప్లేట్‌తో వరండాలోకి రాబోతూ ఆగిపోయింది.

కాంతారావు, సత్యనారాయణ గొంతిపిసికే ప్రయత్నంలోవున్నాడు. సత్యనారాయణ పెనుగులాడుతున్నాడు..''సిస్..ర్....'' అంటూ శాంతని పిలిచే ప్రయత్నంలో — కుక్కర్ విజిల్‌లాంటి శబ్దాలు సృష్టిస్తున్నాడు.

శాంత ఓమారు గొంతు సవరించుకోగానే కాంతారావు గబుక్కున సత్యనారాయణ పీక వదిలేసి ''టిఫిన్ తిను సత్యం'' అని ఎంతో ఆప్యాయంగా ప్లేట్ అందించాడు.

''మంచినీళ్ళు తీసుకురా'' అని శాంతకి పురమాయించాడు

''వద్దు...వద్దు..నాకు నీళ్ళంటే ఎలర్జీ..నువ్విక్కడేవుండు సిస్టర్. నువెళ్ళితే నేను టిఫిన్ తినను'' అన్నాడు ఖంగారుగా సత్యనారాయణ.

శాంతకి ఓ క్షణం అతనిమీద జాలేసింది. అతను కోరినట్టు అక్కడేవుండిపోయింది. పావుగంట తర్వాత కాంతారావు, సత్యనారాయణ వెళ్ళిపోయారు.

.నెల్లో మొదటివారం కాబట్టి అందరి మొహాల్లో జీవకళ ఉట్టిపడుతోంది. ముఖ్యంగా జేబులు నిండుగా ఉన్నాయి. ఆ దెబ్బతో గత రెండునెలలుగా పోగొట్టుకున్నదంతా వడ్డీతోసహా రాబట్టాలని అక్కడున్న దాదాపు అందరి ఆలోచన!

మొదటిరౌండ్ పూర్తయింది. కాంతారావు హుషారుగా ఉన్నాడు. మిడిల్ జాక్‌పాట్ అతనే కొట్టాడు. నాలుగు వందల పైనే వచ్చింది కలెక్షన్!

ఎవరో తలుపు తట్టిన చప్పుడైంది. ప్యాక్‌చేసి వెంకటరెడ్డి ఆట చూస్తున్న రాంప్రసాద్ విసుగ్గావెళ్ళి తలుపు తీసాడు. మరుక్షణం నోరెళ్ళబెట్టి కొయ్యబారిపోయాడు.

అతికష్టంమీద 'పోలీస్!' అని ఓ గావుకేక పెట్టాడు. ఎదురుగా ఉన్న శాల్తీని తోసుకుంటూ బైటికి పరుగెత్తబోయాడు, కానీ ఆ వ్యక్తి ఇలాంటివి ఎన్ని చూశాడో... లటుక్కున, రాంప్రసాద్ కాలర్ పట్టుకుని నెట్టుకుంటూ లోపలికొచ్చాడు.

రాంప్రసాద్ అరుపుకి మిగతా జూదాగేసరులు త్రుళ్ళిపడ్డారు. బోనులో పడ్డ ఎలుకల్లా అటూ ఇటూ పరుగెత్తడం, పిచ్చి చూపులు చూడడం వగైరా చెయ్యసాగారు. దొడ్డి వాకిలివైపు దూకారు కొందరు. తలుపు తీయగానే నాలుగు లాఠీ దెబ్బలు తగలడంతో గంగవెర్రులెత్తినట్టు అరుస్తూ గజగజ వణకసాగారు.

కాంతారావు స్థితే అందరికన్నా దీనంగా వుంది. అతను హుస్సేన్ సాగర్‌లో బుద్ధవిగ్రహంలా అలానే కూర్చుండిపోయాడు. తన కళ్ళముందు జరుగుతున్నదేదీ అతనికి అర్థంకానట్టు, షాక్‌తో మిడిగుడ్లేసుకుని చూస్తూ నిలువెల్లా వణికిపోసాగాడు.

ఓ కానిస్టేబులర్ అతన్ని కాస్త గట్టిగానే లాఠీతో డొక్కలో పొడిచి ''లే... లే'' అని

మొరటుగా అదిలించాడు. కాంతారావు మొహం సిగ్గుతో, అవమానంతో ఎరుపెక్కింది. మిగతావాళ్ళ స్థితికూడా దాదాపు అదే! ఏదో పేపర్లో ఫలానా ప్రదేశంలో 'ఎవరో' జూదరుల అరెస్టు' అంటూ వార్తలు చదవడం వాళ్ళకి అలవాటే... కానీ తామే ఆ స్థితిలో వుండడం! వాళ్ళు ఆ నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

మొదట తేరుకున్నది పార్వతీశమే. అతనికీ ఓ ప్రక్క భయంగానే వున్నా "వాట్ ఈజ్ దిస్... ఏవిటీ దౌర్జన్యం... అసలు మీరెవరు?" అన్నాడు అంతా స్పష్టంగానే కన్పిస్తున్నా.

దాంతో ఓ ఇన్స్పెక్టర్ పార్వతీశం చెంపమీద 'ఫెడీ'మని కొట్టి 'మేమెవరమా? లంగాబొందులు అమ్ముకునే లఫూట్‌గాళ్ళం... ఇక్కడ చాలామంది 'లంగా'గాళ్ళు ఉన్నారని వచ్చాం... అంటూ తిట్లవర్షం కురిపించాడు. చాలామంది ముద్దముద్దగా తడిసిపోయారు!

"అసలు మీరిక్కడికి ఎలా వచ్చారు? మేమేం తప్పు చెయ్య... అని సమర్థించుకోబోయిన వెంకటరెడ్డి వీపు విమానం చప్పుడు చేసింది. "అమ్మో బాబో!" అని ఎటూ తేల్చుకోలేనట్టు పెద్దగా అరిచి బోర్లా పడ్డాడు.

ఆ దెబ్బలు తనకే తగిలినట్టు కాంతారావు ఉలిక్కిపడ్డాడు.

"ఎవ్రడా ఈ రూం ఓనర్?" ఎస్ఐ గద్దించాడు.

పాపం! పాండురంగం, తనేనని చెప్పడానికి తెలుగురానట్టు అవస్థపడుతుండగా, అందరూ ఉత్సాహంగా వేలెట్టి అతన్ని చూపించారు ఆ దౌర్భాగ్యం తమకు పట్టనందుకు విపరీతంగా ఆనందిస్తూ.

"రాస్కెల్... వుండాకోర్... సువ్వర్... అంటూ అన్ని భాషలకి న్యాయం చేస్తూ ఎస్.ఐ రెండు నిమిషాలు కచేరీ చేసి ఆ తర్వాత "క్లబ్ నడుపుతున్నావ్‌రా... ఎంతకాలంనుంచి నడుపుతున్నావ్‌బే? చెప్పు" అంటూ పాండురంగం కాలర్ పట్టుకున్నాడు.

## త్రాగుడు



"తాగుడు మానకపోతే చచ్చిపోతావని చెప్పాడు డాక్టర్ అందుకే మానేసా" అన్నాడు దేవదాసు.

"ఏంటీ! మానేశావా?" ఆశ్చర్యపోయాడు గిరి.

"అవును డాక్టర్ దగ్గరకెళ్లడం మానేశా!" తాపీగా చెప్పాడు దేవదాసు.

—కాట్నం వెంకటరెడ్డి
(ఈస్ట్‌విన్స్రు)

‘‘నా... నాకేం తెలీదు సార్... మా ఫ్రెండ్స్ అందరం కలిసి సరదాగా ఆడు...’’ పాండురంగం మొహం పచ్చడైంది.

‘‘ఛల్... బక్‌వాజ్ మాట్లాడక్... ఈ టోకెన్ల సంగతేందిరా... ఇవి బీ తమాషాకేనా... ఇల్లుగాదు... స్టేషన్‌లోబెట్టి బొక్కలిరగగొడతా. సబ్‌కుచ్ జెబుతర్... తీస్కరండి... లుచ్చాగాళ్ళని’’

ఆ దెబ్బతో పోలీసులలో ఏదో వాదించాలనే కోరిక అందరిలో నశించింది.

కాంతారావు ఆఖరి ప్రయత్నంగా ‘‘ప్లీజ్‌సార్... నన్నొదిలెయ్యండి. జన్మలో మళ్ళీ పేకాట జోలికి పోను’’ కన్నీళ్ల కారుస్తూ దీనంగా అర్థించాడు. కీ ఇచ్చినట్టు అందరూ అవే మాటలు కాకుల్లా అరవసాగారు.

‘‘పోనీ... ఈ డబ్బు తీసుకోండి... ప్లీజ్ మమ్మల్ని వదిలెయ్యండి... మా పరువు... సత్యనారాయణ ఇంకా వాక్యం పూర్తిచెయ్యకముందే అతని చెంపలు చెళ్ళుమన్నాయి.

‘‘ఏంరా... బేకూఫ్... నాకే రిష్వత్ ఇస్తావ్‌బే... అంటూనే లోకల్ టాక్స్ ఎక్స్‌ట్రాలా లాఠీతో నాలుగు అంటించాడు ఓ ఎస్.ఐ.

అప్పటికే ఇంటిచుట్టూ జనం గుమిగూడారు. తలుపు సందుల్లోంచి, కిటికీల్లోంచి లోపలి తమాషా చూసి ఆనందిస్తున్నారు. చూడలేనివాళ్ళకి ఒకరిద్దరు రన్నింగ్ కామెంటరీ మొదలెట్టారు. రకరకాలుగా కామెంట్స్ చేయసాగారు జనం!

అందర్నీ తిడుతూ, నెడుతూ రోడ్డు మలుపులో పార్క్‌చేసి వున్న పోలీస్ వ్యాన్ వైపు నడిపించారు — వాళ్ళేదో చంబల్ వ్యాలీ బందిపోట్లయినట్టు అటూ ఇటూ గట్టి కాపలాతో కాంతారావు ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు నడుస్తున్నాడు. ఇరవై గజాల దూరంలో ఉన్న వ్యాన్ వేల మైళ్ళ దూరంలో ఉన్న ఫీలింగ్! అందర్నీ ఒకే గదిలోకి తోశారు. ఆ సెల్ పరిస్థితి, అందులో ఉన్న ఇతర నేరస్థులు, చాలా ఘోరంగా అనిపించింది కాంతారావుకి. లోలోపలే కుమిలిపోయాడు. ఈ విషయం నలుగురికీ తెలిసిపోయే వుంటుంది. తన పరువు గురించి భయం మొదలైంది.

ఒక్కొక్కర్నే పిలిచి వివరాలు అడగసాగాడు ఓ వ్యక్తి.

మొదట పాంచజన్యాన్ని పిలిచారు. అతను కళ్ళు తుడుచుకుంటూ టూకీగా తన బయోడాటా చెప్పాడు.

రాంప్రసాద్ వంతు వచ్చేసరికి తనపేరు రాంబాబు అని అతితెలివిగా చెప్పాడు.

‘‘మిస్టర్... నిజం చెప్పు... నీపేరు రాంప్రసాద్‌కదూ...’’ అంటూ డ్రైవింగ్ లైసెన్స్ చూపిస్తూ గద్దించాడు ఎస్.ఐ. రాంప్రసాద్ షాక్ తిన్నాడు. అది వీడికెలా వచ్చింది? బహుశా రూంలో దొరికుంటుంది.

సార్... నన్ను క్షమించండి... అసలు పేరు బయటపెట్టుకుని అభాసుపాలుకాకూడదని ఇలా చేశాను. ఇకనుంచి బుద్ధిగా వుంటాను’’ రాంప్రసాద్ పోలీస్‌స్టేషన్ దద్దరిల్లేటట్లు



చెంపలు వేసుకున్నాడు. ఆ తర్వాత అక్షరం పొల్లుపోకుండా, అంతా గడగడా చెప్పి బావురుమన్నాడు.

అందరి వివరాలు నోట్ చేసుకుని, ఏదో వార్నింగిచ్చి పంపించేస్తారేమోనని ఆశపడ్డ వాళ్ళకి నిరాశే మిగిలింది.

కొందరు ఉండబట్టలేక అడిగారుకూడా. "అప్పుడేనా... ఈ రాత్రంతా లాకప్‌లోనే వుండాలి... పొద్దుటే కోర్టులో హాజరుపరచి ఫైన్ కట్టాక అప్పుడు వదులుతాం" అన్నాడు ఎస్.ఐ తాపీగా. దాంతో అందరూ హతాశులయ్యారు.

రాత్రిలోగా కొంపలకి చేరకపోతే తమ భార్యలు కంగారుపడ్డం, అక్కడా, ఇక్కడా వెదికి చివరికి పోలీస్ కంప్లయింట్ ఇవ్వాలనుకుని ఖర్మగాలి ఆ స్టేషన్‌కే రావడం... జేబులుకొట్టే వెధవలకేం తీసిపోనట్టు కటకటాల్లో తొంగున్న తమ సుందర ముఖారవిందాల్ని చూసి 'వాళ్ళుచేసే హంగామా వగైరా వగైరా త్రీడీ ఎఫెక్ట్‌లో కనిపించి అందరూ 'కలసి పాడుదాం'లోలా దారుణంగా ఆర్తనాదాలు మొదలుపెట్టారు.

ఎస్.ఐ కాస్త జాలిపడి "పోనీ మీ తరపున ఎవరైనా జామీను ఇస్తే ఆ... ఎంతమంది వున్నారు? మొత్తం ఎనిమిదిమందికదా... కనీసం నలుగురైనా ఇవ్వాల్సి వుంటుంది... అప్పుడు విడుదల చేస్తాను. అఫ్‌కోర్స్ కోర్టుకి మాత్రం రాకతప్పదు..." అన్నాడు గొప్ప వరం ఇస్తున్నట్టు.

ఆ మాత్రానికే అందరూ ఇష్టంవచ్చినట్టు సంతోషపడ్డారు. తమలాగే పేకాట జీవితం అనుకున్నవాళ్ళయితే తమ ప్రస్తుత స్థితి అర్థంచేసుకోగలరు. ఏదో శాపవశాత్తు తాము లోపలున్నారు. ఏదో రోజు వాళ్ళకీ తమ అవసరం రావచ్చు అని కన్విన్స్ చేయొచ్చు... అలా చాలాసేపు ఆలోచించి, 'పేకాట గుల' ఉన్న తమ యావత్ మిత్రకోటి ఆ గదిలోనే దీనంగా ఏడుస్తూ తగలడ్డారని గ్రహించి మరింత బెంబేలు పడ్డారు.

"భగవాన్! ఏమిటీ ఘోరం! మేం ఏం పాపం చేశామని మాకీ శిక్ష!" అంటూ అందరూ భగవంతుడ్ని అడగసాగారు. అందుకు భగవంతుడినుంచి ఏ సమాధానం రాలేదుకానీ ఎస్.ఐ మాత్రం వుండాకోరులారా... మీరు పేకాట ఆడారు... అందుకే ఈ శిక్ష!" అని జవాబిచ్చాడు.

చివరికి రాంప్రసాద్ లేచి నిలబడ్డాడు. ఓమారు గొంతు సవరించుకుని "నా పరువు పోయినా ఫరవాలేదు... మీకోసం నేనే బలవుతాను" అని ఆగాడు. ఎవ్వరూ చప్పట్లుకాదుగదా కనీసం థాంక్స్‌కూడా చెప్పకపోవడంతో నిర్లిప్తంగా నవ్వి "ఎస్ఐగారూ ఫోన్ చేసుకోవచ్చా" అన్నాడు పూరీలా పొంగిన చెంపని తడుముకుంటూ.

"నాలుగు రూపాయలవుతుంది ఒక కాల్‌కి" జాలిగా సెలవిచ్చాడు ఎస్.ఐ.

"అన్యాయం! మార్వాడీ షాప్‌లో చేసినా రెండు రూపాయలే!" అరిచాడు సత్యనారాయణ అలవాటు చొప్పున.

"రేయ్ సత్తి... ఇప్పుడ్రటా బేరాలు... పొదుపు చర్యలూ... నీకు ఇంకా బుద్ధిరానట్టుంది. పోనీలే నువ్వు రెండు రూపాయలిచ్చి మార్వాడీ షాప్‌నుంచి మాట్లాడి నీ జామీనుకి ఏర్పాటు చేసుకో మాకు అనవసరం..." అని క్రూరంగా దీవించి రాంప్రసాద్‌ని ముందుకు తోశారు.

రాంప్రసాద్ కాలర్ మధ్యలో దాచిన పదిరూపాయల కాగితం ఎస్ఐ చూడకుండా తీసి "సార్ దారిఖర్చులకని ఎప్పుడూ దాచుకునే... ఈ ఒక్కగానొక్క పదిరూపాయలూ తీసుకోండి" దీనంగా ఎస్ఐ చేతిలో పెట్టి ఫోన్‌వైపు నడిచాడు. పుండుమీద కారం చల్లినట్లు మొదటిసారి రాంగ్‌నంబర్ వచ్చింది. వణుకుతున్న చేతుల్తో మరోసారి ప్రయత్నం చేశాడు. అంతా ఊపిరి బిగబట్టి చెవులుకూడా రిక్కించారు. మూడు నిమిషాల తర్వాత అదృష్టం వరించింది.

"ఒరేయ్ నారిగా... నేను మావేకాదురా... నేను ప్రసాద్‌ని... చెప్పేది సరిగ్గా విను... లైన్ బాగోలేదా... ఎప్పుడైనా బాగుండి ఏడ్చిందా... సరే నేను చాలా డేంజర్‌లో వున్నాను. వద్దు వద్దు వాళ్ళనెవర్నీ తేవద్దు. వాళ్ళని చూశారంటే నాకు ఉరిశిక్ష ఖాయం చేస్తారు..." ఎస్ఐ అనుమానంగా చూడసాగాడు.

"ఏవిటీ పోలీసులకా... రేయ్ నారిగా" గావుకేకపెట్టాడు అసహనంగా రాంప్రసాద్. "డేంజర్ వచ్చిందే వాళ్ళతోరా నా కన్నతండ్రీ! చూడు నీ క్లోజ్ ఫ్రెండ్‌నెవరినీ తేవద్దు. మరెవరైనా ఓనలుగుర్ని పట్టుకునిరా" అని పోలీస్ స్టేషన్ అడ్రస్ ఇచ్చాడు. రిసీవర్ క్రెడిల్ చేసి "థాంక్స్ సార్... వీలైతే మీ రుణం ఈ జన్మలోనే తీర్చుకుంటాను" అన్న ప్రసాద్‌వైపు తీక్షణంగా చూసి "ఎలా? మరోసారి పేకాడా?" అన్నాడు ఎస్ఐ వెటకారంగా.

ఓ గంట తర్వాత నారిగా అనబడే ఆ ఆపద్బాంధవుడు అతి కష్టంమీద పెద్దమనుషులు అని గుర్తించగలిగే మరో ఇద్దరితో వచ్చాడు నారిగాడు ఉర్ఫ్ నారాయణ. ఫ్లాష్‌బ్యాక్‌లో పదిహేనేళ్ళ క్రితం రాంప్రసాద్ చదువుతున్నట్టు నటించిన కాలేజీలో క్లర్క్ అనీ... ఇద్దరూ ఎన్నో వెధవవేషాలు జాయింట్‌గా వేయడం జరిగిందనీ అంచేత పరువుగురించి పెద్దగా

## చర్మవృద్ధి



అగ్ని ప్రమాదాలలో శరీర చర్మం కాలిపోయినవాళ్ళకు చర్మరుగ్మతలవల్ల అందవిహీనమైన వారలకు వరంలా కల్చర్డ్ చర్మాన్ని రూపొందిస్తున్నారు ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హాం యాక్సిడెంట్ హాస్పిటల్ వారు. వీరు రూపొందించిన కొత్త ప్రక్రియ ద్వారా పోస్టల్ స్టాంప్ అంత చర్మాన్ని రోగి శరీరం నుండి తీసుకుంటారు. దీన్ని మరింత చిన్న చిన్న ముక్కలుగా కత్తిరిస్తారు. ఎంజైమ్ ట్రిప్సిక్ అనే పద్ధతి ద్వారా జీవం వున్న కణాలను వేరుపరచి ఆ కణాలు ఒక పెద్ద షీట్‌లా ఎదిగేట్టు చేస్తారు. ఈ కార్యక్రమం అంతా కూడా 3 వారాల్లో పూర్తవుతుంది. ఇలా అభివృద్ధి పరచిన చర్మాన్ని శీతల వాతావరణంలో నిల్వ వుంచవచ్చు కూడా. అభివృద్ధి పరచిన చర్మాన్ని రోగి శరీరంపై అతుకుపడేట్లు చేస్తారు.

—ప్రతూరి

దిగులుపడాల్సిన పనిలేదని రాం|ప్రసాద్ చెప్పాడు. వాళ్లకింకా అది వుండిపచ్చినట్టు!

"సారీ బ్రదర్. ఎంత ప్రయత్నించినా మరో ఇద్దర్ని మాత్రం తేగలిగాను. చాలామంది సెంట్రల్ జైల్‌లో వున్నారు" అన్నాడు నారాయణ శాస్త్రకూడా దిగులుపడకుండా.

జామీనుకోసం కుమ్ములాట ప్రారంభమైంది. కాంతారావు, నిర్లిప్తంగా వాళ్ళని చూస్తూ వుండిపోయాడు. వాళ్ళని చూస్తుంటే అతనికి అలాంటి స్థితిలోనూ చిరాకేసింది. తనతోపాటు మిగిలిపోయిన రాంప్రసాద్‌వైపు ఆశ్చర్యంగా చూశాడు. తనని ఎవరూ పట్టించుకోకపోవడం, ఆఖరికి అత్యంత ఆప్తుడనుకున్న పార్వతీశంకూడా తన స్వార్థం తను చూసుకుని కనీసం పలకరించకపోవడం కాంతారావుకి మనస్తాపం కలిగించింది. అందరికీ జామీను ఇప్పించి, బయటపడే అవకాశాన్ని చేజేతులా వొదులుకున్న రాంప్రసాద్ అతనికి ఆ క్షణంలో చాలా ఉన్నతంగా కనిపించాడు.

"ప్రసాద్... నువ్వెందుకుండిపోయావ్?" కుతూహలంగా అడిగాడు.

"చెప్పానుకదా... మీ అందరికోసం బలవుతానని... అంటూ నవ్వేసి "లేదులే... బ్రదర్ ఎవరో ఇద్దరు వుండిపోవాలి. నువ్వెలాగూ అందుకు సిద్ధం అన్నట్టు మూల కూర్చున్నావు. అది చేస్తాను. ఇది పొడుస్తానని చెప్పి చివర్లో నా స్వార్థం చూసుకోవడం నాకు రుచించలేదు. అయినా మనవాళ్ళు ఏదో ఏర్పాటు చేస్తామన్నారులే..." ధీమాగా అన్నాడు.

సాయంత్రం ఆరవుతుండగా... "ఆయనెక్కడ...?" అన్న జీర గొంతు వినిపించి త్రుళ్ళిపడ్డాడు కాంతారావు.

రెండు నిమిషాల తర్వాత కాంతారావు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ముందు వున్నాడు. శాంతని చూసి సిగ్గుతో తలవంచుకున్నాడు. తన విషయం ఈ ప్రపంచంలో ఎవరికీ తెలియకుండా వుండాలని ఆశించాడో, సాక్షాత్తు ఆ వ్యక్తిముందు దోషిగా అలా పోలీస్‌స్టేషన్‌లో నిలబడాల్సి వచ్చినందుకు చిత్రవధననుభవించాడు ఆ క్షణంలో.

"మిస్టర్ కాంతారావ్. మీరు చదువు, వివేకం వున్నవారు... బాధ్యతగల ఉద్యోగి... ఎవరూ హర్షించని ఇలాంటి పనులు మీకూ... మిమ్మల్ని నమ్ముకున్నవారికీ శ్రేయస్కరం కావు... ఇది మొదటి అపరాధంగా భావించి క్షమిస్తున్నాను. ఇకముందు ఎప్పుడూ ఇలాంటివాటికి దూరంగా వుండండి. యూ కెన్‌గో..." సర్కిల్ ఎంతో సౌమ్యంగా మాట్లాడినా, ఒక్కోమాటా కాంతారావు మనసుకి సమ్మెటపోట్లలా తగిలాయి. "థాంక్స్" అని అస్పష్టంగా గొణిగి, తడబడే అడుగులతో బయటకు నడవబోయి అంతలోనే ఏదో స్ఫురించి "సార్... మా ఫ్రెండ్..." అని ఆగిపోయాడు.

"అలాగే... అతన్నికూడా విడుదల చేస్తాం..." అని ఎస్.ఐకేదో సైగచేశాడు.

ఇంటికి వచ్చాకకూడా కాంతారావు పూర్తిగా షాక్‌నుంచి తేరుకోలేదు. భర్త వాలకం శాంతకి ఖంగారు కలిగించింది. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఊరుకో శాంతా... పో నీకిప్పుడు అంతా తెలిసిపోయింది... నన్ను చూస్తుంటే అసహ్యం వేయడంలేదా?" మొహం చాటుచేసుకుంటూ అన్నాడు. శాంత జవాబు చెప్పేలోగా, ఏదో గుర్తొచ్చి "అవును శాంతా... నేను స్టేషన్‌లో వున్నట్టు ఎవరు చెప్పారు... పార్వతీశం చెప్పాడా?"


శాంత తడబడింది... ఎలాగో సర్దుకుని "లే... లేదండి... మిమ్మల్ని వ్యాన్ ఎక్కిస్తుంటే మన వేణు చూశాడట. నేను మొదట నమ్మలేదు. ఎందుకైనా మంచిదని వాకబు చేశాం. వివరాలు తెలిసేసరికి ఆలస్యం అయింది" వంటింట్లో ఏదో పనున్నట్లు చటుక్కున లేచి వెళ్ళింది.

ఆ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధీర్, వినయ్ క్లోజ్ ఫ్రెండ్స్. వాళ్ళిద్దరి పథకమే అది. పాపం! శాంత తన భర్త అరెస్టు అయ్యుంటాడని టైం చూసుకున్న దగ్గర్నుంచి తెగ మథనపడిపోయింది. పదింటికి ఆమె ఓర్చుకోలేక పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళింది. తమ పథకం ప్రకారం ఆమె ప్రవర్తించకపోయినా కాంతారావు స్థితిచూసి విడుదల చేశాడు సుధీర్... లేకపోతే కథ మరోలా వుండేది.

** ** **

దాదాపు వారం రోజులకిగానీ కాంతారావు కాస్త మామూలు స్థితికి రాలేకపోయాడు. పోలీస్ స్టేషన్ అనుభవం జరిగిన తర్వాత మొదటి ఆదివారం కాంతారావు ఇంట్లోనే వున్నాడు. రీడర్స్ డైజెస్ట్ చదువుతూ చాలాసేపు గడిపేశాడు. అది గమనించి శాంత "ఏం ఇవ్వాళ ఎక్కడికీ వెళ్ళడంలేదా?" అంది అతని ప్రక్కనే కూర్చుంటూ.

ఓ క్షణం ఆమెవైపు చురుగ్గా చూసి "ఏం నీకు వేళాకోళంగా వుందా? చచ్చిన పాముని ఇంకా చంపుతావా? అన్నాడు కాంతారావు ఏడవడానికి సిద్ధమవుతూ.



శాంత ముసిముసిగా నవ్వి తృప్తిగా నిట్టూర్చింది. ''ఛ... ఆ ఉద్దేశ్యంతో అనలేదండి... మీ ఇష్టానికి నేనెందుకు అడ్డుపడాలని...'' అంది అతని రియాక్షన్‌కోసం చూస్తూ.

''భలేదానివే... ఇంక జన్మలో పేకాడను... జరిగింది చాలు'' అన్నాడు లెంపలేసుకుంటూ. ఆ తర్వాత అతను మరో మూడు ఆదివారాలు వచ్చినా తనతోటే గడపడంతో శాంతకి నమ్మకం కలిగింది.

కానీ కాంతారావు మిగతా రోజుల్లో, పార్వతీశం, రాం ప్రసాద్‌లని అడపాదడపా కలుస్తూనే వున్నాడు. మొదటిసారి కాంతారావు, పార్వతీశాన్ని అతని ప్రవర్తనని జాగ్రత్తగా పరిశీలించసాగాడు. తనను విడిచి వెళ్ళిపోయినందుకు పార్వతీశం ఆ తర్వాత ఇచ్చిన సంజాయిషీ అతన్ని పూర్తిగా సమాధానపరచలేదు. అయినా ఏమోలే అలాంటి స్థితిలో మనిషి ఆదర్శంగా వుండడం సాధ్యంకానిపని... అని కొంతవరకూ సరిపెట్టుకున్నాడు.

ఆరోజు ఆఫీసునుంచి వస్తూ శాంతకోసం మల్లెపూలూ... పూతరేకులూ కొన్నాడు. స్కూటర్ స్టార్ట్ చెయ్యబోతుంటే... ఎవరో భుజంమీద చెయ్యి వెయ్యడంతో ప్రక్కకి చూశాడు పాండురంగం. మాసిన గడ్డం... మట్టిగొట్టుకుపోయిన బట్టలతో అతను ముష్టివాడిలా కనిపించాడు.

''అదేంటి పాండు! ఆశ్చర్యపోయాడు కాంతారావు. కదిలిస్తే ఏడ్చేట్టున్నాడు పాండురంగం. స్కూటర్ మళ్ళీ పార్క్ చేసి ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కి దారితీశాడు కాంతారావు. పోలీస్ రెయిడ్ తర్వాత కాంతారావు పాండురంగాన్ని కలవలేదు. ఓసారి ప్రసాద్‌ని అడిగితే తనకీ కలవలేదన్నాడు.

''కాంతారావ్... నేను చాలా ఇబ్బందుల్లో ఉన్నాను. ఆ ఇల్లు ఖాళీ చేయమన్నాడు ఓనర్... ఇంతకాలం పేకాట నా రూంలో ఆడినందుకు మీరు కిట్ తీసి ఏడెనిమిది వందలు ఇచ్చేవారు. ఇప్పుడు అదీ లేదు. పైగా పోలీసులు రెండుమూడుసార్లు ఇంటికొచ్చి ఏదేదో బెదిరించి వెళ్ళారు. నా జీతం సంగతి నీకూ తెలుసు. ఏం చెయ్యాలో అర్థంకావడంలేదు...'' దీనంగా చెప్పాడు పాండురంగం.

కాంతారావుకి జాలేసింది. ''డబ్బేమైనా సర్దుబాటు చెయ్యమంటావా..?'' అన్నాడు.

''దానివల్ల తాత్కాలికంగా రిలీఫ్ వుండొచ్చు... కానీ సమస్య తీరదు... పైగా నీ అప్పు తీర్చాలన్నా నాకు కష్టమే.''

''మరేంటి మార్గం?'' అర్థం కానట్టు అడిగాడు కాంతారావు.

''మనం మళ్ళీ పేకాట మొదలెట్టాలి. నేను ఓ రూం చూసాను. అద్దె కాస్త ఎక్కువే. అయినా చాలా సేఫ్‌ప్లేస్‌గా... నీట్‌గా వుంది.''

'ఏమిటీ? మళ్ళీ పేకాటా? నీకింకా బుద్ధిరాలేదా పాండూ... భయంగా ఆశ్చర్యంగా అన్నాడు కాంతారావు, తమ మాటలు ఎవరి చెవినైనా పడ్డాయేమోనని బిత్తరచూపులు చూస్తూ.

''భయమెందుకు?... నాకు కార్డ్సు అంటే పిచ్చి.. రోజూ ఏమీ తోచక ఛస్తున్నాను... సంపాదన కుంటుపడింది. అసలు నువ్వు నిజం చెప్పు.. కార్డ్సు మానేస్తే నీకు మాత్రం ... తోస్తోందా మళ్ళీ ఆడగలనిపించడంలేదా...?''

కాంతారావు ఇబ్బందిగా కదిలాడు. ఆత్మ విమర్శ చేసుకుంటే తను మానెయ్యడానికి ముఖ్య కారణం భయం! కానీ పేకాటంటే అసహ్యంవల్ల కాదనిపించింది. అయినా పైకి ఆ నిజం ఒప్పుకోలేక ఏమో పాండు నాకేం అర్థం కావడంలేదు. ఎలాగూ బ్రేక్ అయింది. మళ్ళీ మొదలెట్టడం ఎందుకు?'' సందిగ్ధంగా అన్నాడు. పాండురంగం లేచాడు. అన్నీ సమకూరాక ఓసారి కలుస్తాను... అని వెళ్ళిపోయాడు. కాంతారావు మనసులో మళ్ళీ తుఫాను చెలరేగింది.

***

ఆ రోజు శనివారం మధ్యాహ్నం బ్యాంక్ నించి వస్తుంటే పార్వతీశం, పాంచజన్యం స్కూటర్‌కి అడ్డుపడి బలవంతంగా ఓ ఇరానీ హోటల్‌లోకి లాక్కెళ్ళారు కాంతారావుని. కాసేపు సొల్లుకార్చి, మహత్తరమైన అసలు విషయం బైటపెట్టారు.

''రేపు కార్డ్సు సెషన్ వుంది... తెలుసా?'' అన్నాడు పార్వతీశం. ఏదో మర్నాడు కెమిస్ట్రీ ఎగ్జామ్ వుంది తెలుసా అన్నంత సీరియస్‌గా.

''అవునా? నాకుతెలీదే..'' అని సంతోషంగా ఆశ్చర్యపోబోయి గతస్మృతులు గుర్తొచ్చి ఏమో నాకు తెలీదు.. అయినా ఇక నా వల్ల కాదు— అంత జరిగాక అంటూ శూన్యంలోకి చూడసాగాడు కాంతారావు.

ఈసారి పాంచజన్యం కాంతారావు భుజం మీద తడుతూ పిచ్చివాడా ఇంత చిన్న విషయానికే అంత భయమా.. అలా గయితే ఎలా? ఇవన్నీ మన లైన్‌లో ఉన్నవాళ్ళకి సహజం. ఈజీగా తీస్కోవాలి అన్నాడు ఒక్క గ్రాం సిగ్గూ, లజ్జా లేకుండా.

## కబుర్లు



''హేవండీ! ఈ పార్కులో చాలా చల్లగా ఉందికదండీ? అందుకని ఏదైనా...'' అంది రాధ.

''ఊ... ఏదైనా?...''

''నాలుగు వెచ్చ వెచ్చని కబుర్లు చెప్పండి!''

''స్టౌ, హీటర్, పొయ్యి, కుంపటి...'' అన్నాడు మురళి.

—రొక్కం వెంకటేశ్వరరావు
(శ్రీకాకుళం)

''ఏమో... నాకు దడగా వుంది... మనసు విరిగిపోయింది. కావాలంటే మీరు ఆడుకోండి... అన్నాడు ఏదో సింహాసనం త్యాగం చేస్తున్న చక్రవర్తిలా మొహం పెట్టి.

''చూడు కాంతం అదేదో అనుకోకుండా జరిగింది. పోలీసులకి వేరే పనేం లేదు.. ముందు జాగ్రత్తకోసం గ్యాప్ ఇచ్చాం.. స్పాట్ కూడా మార్చాం. నువ్వింతగా భయపడుతున్నావ్ కాబట్టి సిఐడీలా ఒకడ్ని బైట కాపలా పెడ్తాం... చీమ చిటుక్కుమన్నా మనకి తెలిసిపోతుంది. హైస్టేక్ ఆడాలని మన వాళ్ళంతా తీర్మానించారు.. అన్నాడు పార్వతీశం డ్రెమటిక్‌గా.

పూర్తిగా కన్విన్స్ కాకపోయినా ఊగిసలాట మొదలైంది. ఎరేంజ్‌మెంట్ బాగానే వుందనిపించింది. ముఖ్యంగా హైస్టేక్స్ అనగానే మనసు ఉరకలు వేయసాగింది.

ఏమో ట్రైచేస్తాను.. అన్నాడు కాంతారావు బెట్టుచేస్తూ.

కాంతం తప్పక వస్తాడని తెలిసిపోయిన వాళ్ళు అలాగేలే ఏలుంటేవేరా అని ఎక్కడికి రావాల్సిందీ చెప్పారు.

కాంతారావుకి జగమే మారినదీ... మధురముగా ఈ వేళ అని పాడాలనిపించింది చాలా రోజులతర్వాత మొహందివిటీలా వెలిగిపోసాగింది.

ఇంటికి వచ్చినప్పట్నుంచీ భర్త తీరు గమనిస్తూనే వుంది శాంత. గుమ్మంలోనే శాంతని వాటేసుకుని రంగులరాట్నంలా గిరగిరా నాలుగు రౌండ్లు తిప్పి పనిపిల్ల చూస్తూన్నా లెక్క చేయకుండా ముద్దుల వర్షం కురిపించాడు. ఏదో విశేషం ఉండే ఉంటుందని గ్రహించింది.

ఆదివారం ప్రొద్దుట్నుంచీ త్వరగా వంట చెయ్యమని వేధిస్తున్న భర్త వాలకం ఆమెకి అనుమానం కలిగించింది. చాటుగా అల్మారాలోంచి డబ్బు తీసి పర్సులో పెట్టుకోవడం చూసి శాంత సంగతి గ్రహించింది. క్షణకాలం మనసు చివుక్కుమంది. అంతలోనే అలాంటి స్థితి గురించి ముందే హెచ్చరించిన సుధీర్, వినయ్ ల మాటలు గుర్తొచ్చాయి. అయినా ఒక్కపూట లాకప్‌లో గడిపినందుకే మహాత్ముడైపోవడానికి తన భర్త ఏమైనా అపరవాల్మీకా? అని సరిపెట్టుకుంది. పక్కింటికెళ్ళి సుధీర్‌కి ఫోన్ చేసి సంగతి చెప్పింది. సుధీర్ నిట్టూర్చి సరే అతని సంగతి మాకొదిలేయ్ .. మా వాళ్ళు అతన్ని నీడలా వెంటాడుతారు ఈ క్షణం నుంచే.. చూడమ్మా ఈ సారి మాత్రం నువ్వు తొందరపడి మీ ఆయన్ని వెదుక్కుంటూ రావద్దు.. కాస్త నొప్పి పుడుతుంది. కానీ రోగం నయమవుతుందని నేను హామీ ఇస్తున్నాను. సరేనా?'' అంటూ ఫోన్ పెట్టేసి ఎస్ఐ చంద్రమౌళిని పిలిచి కాంతారావు ఫోటో ఇచ్చి ఓ ఐదు నిమిషాలు మాట్లాడాడు. చంద్రమౌళి 'అలాగే' అని ముసిముసిగా నవ్వుతూ హడావిడిగా బైటికెళ్ళిపోయాడు.

* * * * * *

సమయం ఉదయం పదకొండు గంటలు... ఒక్కొక్కరే వెంకటరెడ్డి గుమ్మం ఎక్కసాగారు. మరో పావు గంటకి అంతా సమావేశమయ్యారు. ఆనాటి సమావేశానికి


పార్వతీశం అధ్యక్షత వహించాడు. అతను ఏ ఏ జాగ్రత్తలు తీసుకుంది వివరించాడు. తర్వాత అందరూ వద్దని ప్రాధేయపడుతున్నా వినకుండా రాంప్రసాద్ తన డోలు మొదలెట్టాడు,

"ఫ్రెండ్స్! చాలా కాలం తర్వాత మనందరం మళ్ళీ సమావేశం కావడం ఎంతో ఆనందం కలిగిస్తుంది. మనం స్వతంత్ర భారత పౌరులం... అన్ని ఇండోర్ గేముల్లోకెల్లా అత్యంత ముఖ్యమైంది, ప్రాచీనమైంది ఈ పేకాట.. ఏ ఆటైనా కొన్ని గంటలు లేక రోజులు అదీ ఎన్ని బ్రేక్స్‌తో ఆడతారు... కానీ పేకాటక్కొటే వారాలు... నెలల తరబడి ఏక బిగిన ఆడే ఆట... అలాంటి గొప్ప ఆటని నిషేధించే అధికారం పోలీసులకి ఎవరిచ్చారు..? వాళ్ళ భయానికి మనలాంటి వాళ్ళంతా మానేస్తే ఆ ఆట ఏమైపోవాలి? ఓ గొప్ప కళని రూపుమాపడం న్యాయమా? అందుకే మనం ఎదురురు తిరగాలి.. ఎంత కష్టమొచ్చినా ఈ ఆటనీ కళనీ కాపాడాలి? పేకాట మన జన్మ హక్కు! అది హరించే శక్తి ఎవ్వరికీ లేదు... మనది రాజీ లేని పోరాటం... పాండురంగం, సత్యనారాయణ ఇక ఓర్చుకోలేక రాంప్రసాద్‌ని లాగి కిందపడేసి నోరు మూసేశారు.

"అసలే హడలి ఛస్తుంటే నీ పిచ్చి వాగుడేంటి ప్రసాద్.. కోపంగా అన్నాడు వెంకటరెడ్డి. అతని ఫ్యామిలీ ఊళ్ళో లేదు. పార్వతీశం ఎంతో బలవంతం చేసినందుకు తమ ఇంట్లో ఆడ్డానికి ఒప్పుకున్నాడు వెంకటరెడ్డి అదే అయిష్టంగా ఏ నిమిషంలో ఏం ముంచుకొస్తుందోనే భయం అందరి మొహాల్లో కనబడుతూనే వుంది.

పాండురంగం పరిస్థితికి అంతా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆట మొదలెట్టారు. టైం ఒంటిగంట కావస్తోంది. సిగరెట్స్ అయిపోయాయి. ఇంకెవరికైనా కావాలా అంటూ రాంప్రసాద్ లేచి లేవగానే చెవులు చిల్లులు పడేట్టు కిటికీ దగ్గర విజిల్ మోత వినిపించింది.

## కట్టుడు పళ్ళ దేశాలు



అభివృద్ధి చెందుతున్న దేశాలలో కంటే... అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రజలకు పంటి నొప్పులు, పంటి వ్యాధులు ఎక్కువగా వస్తాయి. దేశ అభివృద్ధికీ... పంటి నొప్పికీ సంబంధమేమిటంటారా? అలాంటిదేమీ లేదుగానీ... అభివృద్ధి చెందిన దేశాల ప్రజల ఆహారంలో పంచదార, తీపి పదార్థాల శాతం ఎక్కువగా ఉండటంవల్లనే... వారి పళ్ళు త్వరగా పాడయి పోతూ ఉంటాయి. కాలేజీ కుర్రకారు కూడా కొందరు ఆ దేశాల్లో కట్టుడు పళ్ళతో ఉంటారంటే — మీరు ఆశ్చర్యపోనవసరంలేదు! అంటే ఈ విషయంలో మనం అదృష్టవంతుల మనుకోవచ్చున్నమాట!

— జూపిటర్

తా రెత్తి కంట్రోల్ తప్పిన రైల్ ఇంజన్లా, రాంప్రసాద్ ఎదురుగా వున్న టేబిల్ ఫ్యాన్‌ని ఢీకొనడం అది ధబీ మని పాంజన్యం భుజం మీద పడి ఎముక విరిగిన చప్పుడు ఆ వెంటనే రూం దద్దరిల్లేటట్లు అతని ఆర్తనాదం... పరువు భయంతో కాంతారావు స్పృహ తప్పడం.. మేరు పర్వతం లాంటి మహాకాయాన్ని సైతం లెక్క పెట్టకుండా రెండంగల్లో ఆ రూంలోంచి బెడ్‌రూంలోకి దూకి దొడ్డి గుమ్మం ద్వారా బైటపడ్డానికి వెర్రి ప్రయత్నం చేస్తోన్న వెంకటరెడ్డి.. ఇలా అంతా గందరగోళంగా తయారైంది.

చలిజ్వరం వచ్చినట్టు వణుకుతూనే కాస్త ధైర్యం చెప్పి,పార్వతీశమే కిటికీలోంచి బైటికి చూశాడు. తాము కాపలాగా పెట్టిన నానిగాడు తప్ప మరెవ్వరూ కన్పించకపోవడంతో ఇంకాస్త తెగించి ఏరా ఏమైంది? విజల్ ఎందుకువేసావ్ కోపంగా అన్నాడు.

"మరే... మరే ఓ పోలీస్ కనిపించాడు.." అన్నాడు వాడు. వాళ్ళ సహనాన్ని పరీక్షిస్తూ.

"తర్వాతేమైంది... మరి ఆ పోలీస్ ఏడి..? త్వరగా చెప్పి చావు" నానిని కొట్టేవంత పన్జేశారు అంతా.

నానీ సిగ్గుపడ్డాడు. పోలీసు మనింటికే వస్తున్నాడనుకున్నాను. కానీ పక్క సందులోకి వెళ్ళిపోయాడు హి... హి..."

ఎంత పన్జేసావురా వెధవా! మరీ తిడితే వాడు టూల్ డౌన్ స్ట్రయిక్ చేస్తాడేమోనని భయపడి ఇందా ఈ అర్థరూపాయి తీసుకో... ఖచ్చితంగా మనింటికి వస్తున్నాడనిపిస్తే విజల్ వెయ్యి... తెలిసిందా? కోపాన్ని దిగమింగుకుని చెప్పాడు పార్వతీశం.

ఫాల్స్ అలార్మ్! అని తెలుసుకుని ఆయాసపడుతూ వచ్చి కూర్చున్నాడు వెంకటరెడ్డి. ఐదు నిమిషాలపాటు రెండు బక్కెట్లు నీళ్ళు కుమ్మరించాక కాంతారావు మేల్కొన్నాడు. అతన్ని బాత్‌రూంనుంచి మెల్లిగా మోసుకొచ్చి కూర్చోబెట్టారు.

రాంప్రసాద్ రెండు, మూడు చోట్ల ప్లాస్టర్స్ వేసుకుని బిత్తర చూపులు చూస్తుండగా... అప్పటికి భుజాన్ని నూటా ఇరవైసార్లు అటూ ఇటూ కదిలించి రాగయుక్తంగా మూలగసాగాడు పాంజన్యం.

కాస్తో కూస్తో స్థిమితంగా ఉంది పాండురంగం. సత్యనారాయణేఅయితే అదీ నిజంకాదని తెలిసింది.

"ఛ! ఏవిటి కార్డ్స్ అలా తడిచిపోయాయి. అన్న వెంకటరెడ్డి మాటలకి అందరూ ప్రశ్నార్థకంగా చూడ్డం గమనించి జవాబుగా సిగ్గుతో తలొంచుకున్నాడు పాండురంగం. అక్కడో చిన్న మడుగు కట్టింది. ఈ కార్డ్స్ ఇక పనికిరావుగాని మరో సెట్ పట్టా రెడ్డీ" అన్నాడు పార్వతీశం.

"యాక్ వాక్" అని ఎక్కిళ్ళు పెడుతున్న సత్యనారాయణని అంతా వింతగా చూసారు. అతను అంత జరిగినా నోరు మెదకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అతను చేసిన



సైగలని బట్టి తన జేబులో టోకెన్స్ పోలీసులకు దొరుకుతాయేమోనని భయంతో అవి మింగేశాడని అర్థం చేసుకుని ఏడ్వాలో నవ్వాలో తెలీక రెండూ కాస్త కాస్త చేశారు.

సత్యనారాయణని తలకిందులుగా వేలాడదీసి వడ్డిమీద పొట్టమీద కాసేపు పిడిగుద్దులు గుద్దారు— టపా టపా టోకెన్స్ బైటికి చిమ్మాడతను బంగారు గుడ్ల బాతులా.

మరో పావు గంట తర్వాత పరిస్థితి చక్కబడింది. ఆట మంచి పట్టులో సాగుతోంది. మధ్యమధ్యలో ఎవరెవరు ఎంత హంగామా చేసింది గుర్తుతెచ్చుకుని ఒకర్నొకరు సరదాగా ఎగతాళి చేసుకుంటూ జాలీగా ఉన్నారు అంతా.

ఇంతలో అంకుల్.. ఓ సారి తలుపు తెరు అన్నాడు నానీ..

''ఏమైందిరా..?'' అని పేకాడుతూనే అరిచాడు పార్వతీశం.

''అబ్బ!... త్వరగా తెరువు...'' అన్నాడు వాడు మళ్ళీ.

''వెధవ గోల... ప్రసాద్ సంగతేంటో కనుక్కో...'' అన్నాడు వెంకటరెడ్డి. విసుగ్గా వెళ్ళి తలుపు తీసి కరెంట్ షాక్ కొట్టినట్టు ఆ అని ఎగిరిపడి కంప్యూటర్ స్పీడ్‌లా గ్రహించి పోలీస్... అని పొలికేక వేసి క్రితంసారిలా పారిపోవడంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుని పది సెకండ్లలో అది తనకు లేదని నెల తిరక్కుండానేఎస్‌ఐ చేతిలో నలుగుతున్న తన కాలర్ చూసి గ్రహించి గుక్కపెట్టి ఏడవసాగాడు రాంప్రసాద్.

మిగతా డ్రామా అతా షరా మామూలే. ఒక్క కాంతారావుకి ఏ మత్తు మందు సహాయం లేకుండా స్పృహ పోవడం తప్ప!

అందరూ నెత్తీ నోరూ బాదుకుంటూ కుమిలి కుమిలి ఏడ్వసాగారు. పోలీసులతో పొరపాటున కూడా ఎవ్వరూ వాదించే ప్రయత్నం చేయలేదు.

ఇద్దరు కానిస్టేబుల్స్ టోకెన్స్, డబ్బూ స్వాధీనపర్చుకున్నారు.

ఎస్ఐ చంద్రమౌళి అడగముందే ఆ ఇంటి యజమాని తనేనని ఒప్పేసుకున్నాడు వెంకటరెడ్డి ముక్కు చీదుతూ.

''మేం వెధవలం... లంగా గాళ్ళం... బద్మాష్‌లం...'' అంటూ అందరూ తమ తమ క్యారెక్టర్స్ గురించి చంద్రమౌళికి చెప్పుకుని అతనికి కొంత శ్రమ తగ్గించారు. అందరిలో ఓ రకమైన వైరాగ్యం... నిర్లిప్తం... ఒక్క పార్వతీశంలో తప్ప! టైం అవుతోంది.. పదండి.. పదండి'' అంటూ ఏదో ముహూర్తం వేళ మించిపోతున్నట్టు తొందర చేశాడు చంద్రమౌళి.

సార్ చిన్న రిక్వెస్ట్... ఈ లుంగీ... బనీనుతో బైట జనాల్ని భయభ్రాంతుల్ని చేయడం నా కిష్టంలేదు. పైగా పబ్లిక్ న్యూసెన్స్ అని మీరు మరో కేసు పెట్టినా పెట్టగలరు.. ఎంతైనా ఈ ఏరియా వాడ్ని... కాస్త డ్రెస్.. గద్గద స్వరంతో వెంకటరెడ్డి అడుగుతుంటే మౌళి కూడా కంటతడి పెట్టి సరే కానీయ్ ... లోపల..

''డ్రాయర్ వుందిగా'' అన్నాడు తాపీగా.

''ఎందుకు సార్'? అని చచ్చు పీనుగులా అడిగారు మిగతావాళ్ళు.

''ఎందుకంటే ఈసారి మీరు బయటకి రావడం అంటూ జరిగితే బహుశా దానిమీదే రావాల్సి వుంటుంది''అని విషాదంగా శలవిచ్చాడు మౌళి.

అప్రయత్నంగా అంతా డ్రాయర్లు తడుముకున్నారు.

చుక్ చుక్ రైలు...లా ఒకరి వెనుక మరొకరు. లైన్‌లో బయటికి వచ్చారు. అతి మామూలుగా నడుస్తూ ఏమీ జరుగనట్టే ప్రవర్తిస్తున్న పార్వతీశాన్ని చూస్తుంటే చంద్రమౌళికి కడుపు మండింది. ఎవడ్రా నువ్వు. సిగ్గులేని లత్కోరు కొడకా. ఏదో బ్రిటిష్ వాళ్ళ నెదిరించి జైలు కెడుతున్న వాడిలా వీడి ఫోజు వీడు'' అంటూ కసిగా పార్వతీశం డొక్కలో ఓ పోటు పొడిచాడు.

సినిమా షూటింగ్‌లా జనం విరగబడి చూస్తున్నారు. కాంతారావు స్పృహలో లేనందుకు అతన్ని ఇద్దరు పోలీసులు మోసుకొస్తున్నారు. తామకా మాత్రం అదృష్టం లేనందుకు కాంతారావుని చూసి అసూయపడ్డారు మిగతావాళ్ళు.

పోలీస్ వ్యాన్ ఎక్కిస్తే జనం చూపులు మాటలు, కాస్తయినా తప్పుతాయని చకోర పక్షుల్లా అటూ ఇటూ చూడసాగారు.


''క్షమించాలి పెట్రోల్ షార్టేజీ. ప్రభుత్వం చేపట్టిన పొదుపు చర్యల్లో భాగంగా వ్యాన్ వాడకం తగ్గించాం. అయినా నడక ఆరోగ్యానికి మంచిదని చిన్నప్పుడు చదువుకోలేదా. త్వరగా నడవండి'' కసిరాడు చంద్రమౌళి.

''కాంతారావు సంగతేమిటండి...?'' పార్వతీశం డౌటు.

''నీకెందుకయ్యా. అవసరమైతే ప్లెయిన్ తీసుకొస్తాం చాలా?''

''అబ్బా కాళ్లు నొప్పుడుతున్నాయి. పోనీ ఆటోలోనో, కనీసం రిక్షాలోనైనా తీసుకెళ్ళండి సార్ డబ్బులు మేమే ఇచ్చుకుంటాం'' రొప్పుతూ వెంకటరెడ్డి.

''మా నాయనే ఎంతాశ? అసలు మిమ్మల్ని బరబరా ఈడ్చుకురమ్మని బాస్ ఆర్డర్. పోనీలే అని ఇలా సరిపెట్టాను. అందుకు సంతోషించండి! అయినా ఏం త్యాగాలు చేసి



దేశాన్ని ఉద్ధరించారని బాబూ మీకు మర్యాదలు చేయడం? ఆఖర్న ఉన్న పాండురంగాన్ని మొరటుగా నెడుతూ అన్నాడు మౌళి.

ఇరవై నిముషాల తరువాత స్టేషన్‌లో కదుగుపెట్టారు. లాకప్‌లో వున్న కొందరు పాత కేడీలు వాళ్ళని చూసి విష్ చేసి పలకరించారు.

''ఏం గురూ ఇదేనా రావడం' అన్నాడొక కేటుగాడు రాం(ప్రసాద్‌కి షేక్ హ్యాండ్ ఇస్తూ.

''మళ్ళీ చూస్తానో లేదో అనుకున్నాను సార్ అంటూ సత్యనారాయణని ఓ పొట్లకాయ గాఢంగా కౌగలించుకున్నాడు.

ఓ మూల కంట తడిపెడుతూ కనిపించాడు కాంతారావు. అప్పటికే సెల్ చాలా వరకూ తడిసిపోయింది. మి(త్రులు కొందరు సాయంగా ఏడవసాగారు. లోపలెక్కడ్నుంచో వాళ్ళకి బాధగా అరుపులూ, భయంకరమైన మూలుగులు వినిపించసాగాయి. పాతకేడీలు అదేదో జనరంజనిలా మామూలుగా వింటున్నారు. పేకాట బృందానికి మా(త్రం దడ మొదలైంది.

''మాడండి. నేను చేయవలసిందంతా చేసాను''అంటున్న చం(ద్రమౌళిని వాళ్ళు అది తమకు అనుకూలంగానో, వ్యతిరేకంగానో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడసాగారు

బట్ట ఉండలేక సత్యనారాయణ 'సార్ ఆ అరుపులు ఏమిటి? మమ్మల్నేం చేస్తారు'' అని అడిగితే.

చం(ద్రమౌళి ''బాబూ నీ దగ్గర వంద పేజీల పుస్తకం వుందా?'' అన్నాడు తాపీగా.

''ఖాళీదా రాసి పారేసిందా'' అన్న రాం(ప్రసాద్ అమాకత్వానికి జాలిపడి ''ఖాళీదే బాబూ మీ (ఫెండ్ అడిగాడు ''మిమ్మల్ని ఏం చేస్తారని అది ఒక మాటలో ఒక పూటలో చెప్పేది కాదు. అందుకే పుస్తకం వుంటే రాసుకుంటారని అడిగాను.

''ఏం సార్! లిస్ట్ అంత పెద్దదా'' భయంగా పాండురంగం.

''చాలా ఎక్‌స్ట్రా బుక్స్ దగ్గరుంటే మంచిది. నేను అబద్ధం చెబుతున్నాననుకుంటే మీ ఖర్మ, తినబోతూ రుచెందుకు... అయినా శాంపిల్‌గా కొన్ని చెబుతాను.''

ఒకటి తలకిందులుగా మీరు ఏదో బొచ్చు పీకిన కోడైనట్లు వేలాడదీసి కింద మంటపెట్టడం.

రెండు అలా వేలాడదీసి రబ్బర్ గొట్టాలతో చితకబాదడం.

మూడు మీ ప్యాంట్‌ని కాళ్ళ దగ్గర తాళ్ళతో కట్టేసి లోపలికి ఓ ఎలుకనో తొండనో వదలడం..

మిమ్మల్ని పడుకోబెట్టి... అని... ఆగి పాపం చలెయ్యకుండా దుప్పటి కప్పుతారనుకున్నారు కాబోలు పిటీ! ఒక దుడ్డు క(ర మీ మోకాళ్ళ మీద అడ్డంగా పెట్టి అని మరో క్షణం ఆగి

"కాళ్ళ గజ్జా ఆడుకుంటాం అని ఆశలేం పెట్టుకోవద్దు. ఇద్దరో నలుగురో అటూ ఇటూ ఆ క్రమీద నిలబడి కాసేపు బ్రేక్ డాన్స్ చేస్తారు. ఎంచక్కా మీకు వినోదం కలిగించడానికి..." తాపీగా అని.

ఇంకా మిమ్మల్ని నగ్నంగాచేసి ఒక సూది మొనలాటి... అని మిగతాది పూర్తి చేసేలోపు...

"సార్ మా కాంతారావు మళ్ళీ మూర్ఛపోయాడు అని అరచి సత్యనారాయణ కూడా డిటోనే అనడంతో ఇద్దరు కానిస్టేబుల్స్ హడావుడిగా పరుగెత్తుకొచ్చి మూర్ఛపోయిన వాళ్ళ సంగతి చూడసాగారు.

సర్కిల్ రూంలోకి వెళ్ళబోతున్న చంద్రమౌళి 'సార్' అని పార్వతీశం పిలవడంతో ఆగి వెనక్కి వచ్చాడు. పార్వతీశాన్ని అతను క్రితంసారి కూడా గమనించాడు. అసలు ఆ గ్యాంగ్ కి అతనే లీడర్ లా కనిపించాడు.

"సార్! మేం హార్ట్ కోర్ క్రిమినల్స్ కాము. వియ్ ఆర్ రెస్పెక్టబుల్ సిటిజన్స్ ఆఫ్ దిస్ సొసైటీ. ఏదో కాలక్షేపంకోసం ఇలా ఎప్పుడో అప్పుడు సరదాగా ఆడినంత మాత్రాన మమ్మల్ని ఇలా ట్రీట్ చేయడం న్యాయమా?" అని అంతటితో ఆగక "మీరు ఫైన్ ఏదో వేయండి కడ్తాం. కానీ మీ థర్డ్ డిగ్రీ మెజర్స్ మా మీద ప్రయోగిస్తే మేం ఊరుకోం" అన్నాడు మొండిగా.

అంతా నిశ్చేష్టులై విన్నారు. పార్వతీశానికి పిచ్చి పట్టినట్లు చూసారు. ఏదో అమ్మా బాబూ అని గండం నుండి బైటపడే బదులు ఇలా పులి నోట్లో తలదూర్చి పోలీస్ స్టేషన్ లో పడి కూడా వాళ్ళకే పాఠాలు చెప్పడం వాళ్ళకి బొత్తిగా నచ్చలేదు. వాళ్ళు చంద్రమౌళిని బ్రతిమాలేలోపే



## మార్పు!

సుబ్బమ్మని ఆసక్తిగా అడిగింది కనకం.

"ప్రభుత్వం సారా నిషేధించింది కదా! ఇప్పుడన్నా నీ మొగుడు నిన్ను బాగా చూస్తున్నాడా?"

"నా ఖర్మ. అప్పుడైతే సారా కోసం ఇరవై రూపాయలు తగలేస్తే, ఇప్పుడు బ్రాందీ కోసం వంద రూపాయలు తగలేస్తున్నాడు సన్నాసెధవ!"

"???"

—పోలిశెట్టి రఘు (వడ్లమూరు)

''ఈజ్ ఇట్ రాస్కెల్ ఊరుకోవా ..అంతటి హీరోవా? చూద్దాం.,.. వీడ్ని లాక్కురండి. వీడి బాబెవడు అడ్డమొస్తాడో చూస్తాను. అప్పికొదుకు... ఏదోపోనీలే అనుకుంటుంటే నాకు రూల్స్ చెబుతాడా?'' అంటుండగానే ఇద్దరు కానిస్టేబుల్స్ ఈడ్చుకుంటూ పార్వతీశాన్ని తీసుకెళుతుండగా అతను వాళ్ళ వెనకే కోపంగా వెళ్ళాడు.

మరో అరగంట వరకూ పార్వతీశం అరుపులూ... పెడబొబ్బలు... అతని అర్థింపులతో ఆ పరిసరాలు మారుమ్రోగాయి. మరి కాసేపటికి అతన్ని బరబరా ఈడ్చుకొచ్చి సెల్‌లో పడేశారు.

అసలు పార్వతీశాన్ని గుర్తుపట్టగలమోలేదోనని భయంతో వణికిపోతున్న వాళ్ళు అతన్ని చూసి ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు. కారణం పార్వతీశం అన్ని భాగాలు యధాతథంగా వుండడమే... ఎక్కడా చిన్న గాయం కూడా లేదు. చెంపలు మాత్రం కాస్త కందిపోయాయి అంతే...

''అదృష్టవంతుడివి గురూ. తేలిగ్గానే బయటపడ్డావ్.. అని అతన్ని అభినందిస్తూ రాంప్రసాద్ అతనికి షేక్ హ్యాండ్ ఇద్దామని ముట్టుకున్నాడో లేదో అరగంట క్రితం కన్నా ఎక్కువ స్థాయిలో అవసాగాడు. మిగతావాళ్ళు కూడా అనుమానం తీరక అతనో హార్మోనియం అయినట్లు తలా ఒక చోట మీటి (నొక్కి) చూడ్డంతో ఆ గదిలో మరో ఐదు నిముషాలు అతను ఆరున్నర రాగంలో హిందూస్థానీ కచేరి చేసి వాళ్ళని ఆశ్చర్యంలో ముంచెత్తాడు.

అప్పుడు అర్థం అయింది... పోలీసు దెబ్బలంటారు ఇవే కాబోలు. ఆహా ఏమి నైపుణ్యం అని అంతా చంద్రమౌళితో పెట్టుకోనందుకు తమను తామే అభినందించుకోసాగారు. కానీ ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు.

మరో ఐదు నిముషాల్లో ఒక్కొక్కర్నే ఏదో శోభనం గదిలోకి పంపినట్లు తలుపేసి తలుపులు తెరువగానే లోపలి శాల్తీలని బరబరా ఈడ్చుకొచ్చి సెల్‌లో విసిరేయడం అనే కార్యక్రమం ఓ అరగంటపాటు సాగింది. కాంతారావు లిస్టులో లాస్ట్. అతన్ని కచేరి రూంలోకి కాకుండా నేరుగా సర్కిల్ రూంలోకి తీసుకెళ్ళారు.

అప్పటికే కాంతారావు అందరి పరిస్థితి చూసి కొందర్ని మరీ మరీ గుచ్చి గుచ్చి అడిగి లోపలేం జరిగిందో తెలుసుకున్నాడు. అప్పటికే అతని ప్రతి అవయవం తడిసి ముద్దయి పోయింది భయంతో.

''మిస్టర్ కాంతారావ్ మిమ్మల్ని ఇంకా గౌరవించడం బుద్ధితక్కువ'' క్రితంసారి మీ శ్రీమతి మొహం చూసి వదిలిపెట్టాను''

''ఈసారి కూడా అదే పని చెయ్యండి. మహాప్రభో అని అతని హృదయం ఆక్రోశించింది. కానీ అంతలోనే అలా అంటే జోకులేస్తున్నాడేమోనని చావచితక తంతారని నోరు మూసుకుని లోలోపలే వణకసాగాడు.

''ఒన్స్ బిటెన్ ట్వైస్ షై'' అని మీరు వినలేదా అన్నాడు. కాంతారావుకి అతని ధోరణి చూస్తుంటే పేకాట అడ్డంకన్నా ఆ

''సామెత వినకపోవడమే పెద్ద నేరం అంటాడేమోనని భయం పట్టుకుంది. ఇంతలో కాంతారావు ఇంగ్లీషు పాండిత్యాన్ని శంకించి కాబోలు ''మనిషికి ఒక మాట, గొడ్డుకు ఒక దెబ్బ'' అని అయినా విన్నారా అన్నాడు.

వీడి సామెతల పిచ్చి మండిపోనూ...గత్యంతరం లేక గంగిరెద్దులా తలాడించాడు.

నోటితోనే చెప్పండి...లేక అలా తలాడించే వాటికి అర్థం అయ్యే భాషలోనే చెప్పాలా...గద్దించాడు...

కాంతారావుకి ఏడుపురాసాగింది....ఛ! అర్థమైంది సార్!

నన్ను దయచేసి ఈ ఒక్కసారికి క్షమించండి. మళ్ళీ జన్మలో పేక అనేది ఆడను. కనీసం ముట్టుకోను...చూడను...అలాచేస్తే...మీ ఇష్టమొచ్చిన శిక్షవేయండి...కావాలంటే ఉరివేసు కోండి...అంటూ వాళ్ళకి ఏవో వరాలు ఇవ్వడం మొదలుపెట్టాడు.

''షటప్! పోయిన సారీ ఇలాగే వాగావ్...ఒక అండర్ టేకింగ్ ఇవ్వండి'' అని తెల్లకాగితం, పెన్ను అందించాడు..

ఆ క్షణంలో అక్కడ్నుండి బైట బైటపడ్డానికి అండర్ టేకింగ్ ఏం ఖర్మ. ఓవర్ టేకింగ్ అనేది ఉంటే అది కూడా ఇచ్చి అవసరమైతే తన యావదాస్తి రాసివ్వమన్నా రాసివ్వడానికి అతను సిద్ధంగా ఉన్నాడు...మరో అయిదు నిముషాలు సర్కిల్ చెప్పినట్టు రాసిచ్చాడు.

''దిస్ ఈజ్ యువర్ లాస్ట్ ఛాన్స్! మరోసారి ఇలా జరిగితే ఈ కాగితం ప్రతులు



## అన్నదాతలు

ప్రస్తుతం సోమాలియా దేశం పేదరికంతో పడే బాధలు చూస్తే ఎవరికైనా కన్నీరు రాకమానదు. వారి నరకయాతన చూసిన ఫ్రాన్స్ విద్యామంత్రిగారికి జాలివేసి, వెంటనే తమ దేశంలోని పిల్లలంతా ఓ రోజు పుస్తకాలు లేకుండా, తమ సంచులనిండా బియ్యం తీసుకుని స్కూలుకు రావాలని కోరారు! అంతే! ఒక్కరోజులో దాదాపు పదివేల టన్నుల బియ్యం స్కూళ్ళకు చేరింది. ఈ బియ్యం సోమాలియాలోని పదిలక్షలమంది పిల్లలకు రెండు నెలలు ఆహారంగా సరిపోతుందని అనుకుంటున్నారు! పిల్లలలో ఎదుటివారికి సహాయపడే ఉదార గుణాన్ని అలవాటు చేయడమే ఈ బియ్యం పథకం ఉద్దేశమని ఫ్రెంచి ప్రభుత్వం అంటోంది! అన్నదాతా సుఖీభవా!!

—జూపిటర్

మొత్తం ఇండియా పంచిపెట్టడమే కాకుండా సెల్‌లో మీరు కుళ్ళిపోయేదాకా నిలువవుంచాల్సి వస్తుంది.

కాంతారావు నమ్మలేనట్టు చూస్తుంటే 'ఓహో బహుశా మీరు కోర్టులగురించి, చట్టంగురించి ఆలోచిస్తున్నారేమో. ఏదో మొదటి అఫెన్స్‌గా అని ఏ కోర్టయినా ఇలాంటివి పెద్ద సీరియస్‌గా తీసుకోదు....నిజమే..కానీ క్రానిక్ కేసుల విషయం వేరు. మీలాంటి వాళ్ళతో మాకు తెగ న్యూసెన్స్‌గా ఉంది. పోలీసోళ్ళ సంగతి మీగు తెలియదేమో. నక్సలైట్ అనో, లేకపోతే రాజీవ్‌గాంధీని హత్యచేసింది మీ గ్యాంగేననో ఏదో కేస్‌లో ఇరికించి బతుకు బంగాళాఖాతం చేయగలం...జాగ్రత్త! ఇక వెళ్ళొచ్చు''

మరేదో స్ఫురించి సుధీర్ చంద్రమౌళిని పిలిచి ఏదో చెప్పాడు. కాంతారావు చూడకుండా చూసి మౌళి ముసిముసిగా నవ్వి ''అలాగేసార్...పూర్ ఫెలోస్!'' అంటూ కాంతారావు వెనకే వచ్చాడు.

వెంటనే మౌళి మళ్ళీ సీరియస్‌గా ఆ పార్వతీశం తప్ప అందరూ వెళ్ళిపోవచ్చు. వన్ మినిట్. ఒక్కొక్కరే ఇలా రండి. ప్రక్కనే ఉన్న ఓ కానిస్టేబుల్‌కి పని పురమాయించాడు. అతను కెమెరా యాంగిల్స్ ఎడ్జెస్ట్ చేసుకోసాగాడు. అది చూసి అంతా బిగుసుకుపోయారు.

''ఏమిటిలా బిగుసుకుపోయారు. స్మయిల్ ప్లీజ్.. కాస్త నవ్వి ఏడ్వండి'' అని కసిరాడు మౌళి.

టీవీ ఎనౌన్సర్స్‌లా అదోరకంగా నవ్వుతూ నిలబడ్డారంతా. విడివిడిగా, గ్రూప్‌గా ఫోటోలు దిగారు ఏదో ఎవరెస్ట్ ఎక్కిన పర్వతారోహకుల బృందంలా.

''సార్ ఇక జన్మలో పేకాట జోలికి పోం. కాస్త పరువుగ్రటా వున్నవాళ్ళం. ఇలా కేటుగాళ్ళల్లా మా ఫోటోలు...'' అంటూ నాన్చాడు వెంకటరెడ్డి.

''లాభంలేదు జాద పితామహా.. సర్కిల్ ఆర్డర్స్ ఈ ఫోటోలు అన్ని స్టేషన్స్‌కి పంపిస్తాం. చైనావాళ్ళనైనా నమ్మచ్చుగానీ మిమ్మల్ని నమ్మలేం. మీరేదైనా చావు తెలివి చూపించి మరేదైనా ఏరియాలో ఆడినా మీరు ఫలానా అని వెంటనే ఆ స్టేషన్ వాళ్ళకి అర్ధమవుతుంది. పైగా మా వాళ్ళ నిఘా కూడా మీ మీద వుంటుంది. ఆ తర్వాత మీ ఖర్మ! ఒకే మీరు వెళ్ళవచ్చు''' అని గంభీరంగా ఉపన్యాసం ముగించి 'రేయ్ ఆ పార్వతీశంగాణ్ణి ఈడ్చుకురండి టైం అయింది రెండో కోటింగ్‌కి'' అని వెళ్ళిపోయాడు మౌళి.

కాసేపు పార్వతీశం ఆత్మశాంతికి అంతా మౌనం పాటించి తలోక దిక్కుగా పొక్కుంటూ వెళ్ళిపోయారు.

* * *

సుధీర్‌కి ఇచ్చిన మాటకు కట్టుబడి వుందనేగానీ శాంత మనస్సంతా స్టేషన్‌లో వున్న భర్త మీదేవుంది. సాయంత్రం ఆరవుతుండగా నీరసంగా రిక్షా దిగుతున్న భర్తని చూసి సుధీర్

స్ట్రాంగ్ డోస్ ఇచ్చాడనుకుని అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏమిటిదంతా తను అంతగా కోరి చేసుకున్న మనిషిని ఇంత బాధపెట్టాల్సి వస్తుందని తను ఊహించనేలేదు. ఇకనైనా ఆయన పేకాట జోలికి వెళ్లకపోతే చాలనుకుంది.

కాంతారావు స్నానంచేసి శాంత బలవంతంమీద కాస్త ఎంగిలి పడ్డాడు. అతనింకా షాక్ నుంచి తేరుకోలేదు. శాంత కూడా అతన్ని ఒంటరిగా వదిలేసింది.


రాత్రి పడుకునే సమయంలో అతను శాంత కళ్ళల్లోకిచూస్తూ "శాంతా నువ్వు నన్ను ఏమనుకున్నా ఫర్వాలేదు. నేను ప్రొద్దున అబద్ధం చెప్పాను. మళ్లీ కార్డ్సు ఆడాను. అందుకు తగిన శిక్ష అనుభవించాను" అన్నాడు పూడుకుపోయిన గొంతుతో. భర్త కళ్ళల్లో నీళ్ళకి శాంత చలించిపోయింది.

"జీవితంలో మరచిపోలేని పాఠం నేర్చుకున్నాను. దయచేసి వివరాలు మాత్రం అడగొద్దు. నీకు మాటిస్తున్నాను. మళ్ళీ పేకాట జోలికి పోను... నువ్వు నమ్మినా మానినా అది మాత్రం నిజం! ఇంతకాలం నిన్ను బాధ పెట్టినందుకు వీలైతే క్షమించు. శాంత...!" అతను ఇక ఆపుకోలేక ఆమె గుండెల్లో తల దాచుకున్నాడు. చెమ్మగిల్లిన కళ్ళు మెరుస్తుండగా అతని తలని నిమురుతూ అతన్ని ఓదార్చింది.

చెట్టంత మగాడు ఏడ్వడం శాంతకి ఇబ్బందిగా కానీ, ఎబ్బెట్టుగా కానీ అనిపించలేదు. ఆ క్షణంలో ఏడ్చే పసిపిల్లాడ్ని తన గుండెలకి హత్తుకుని సముదాయించే మాతృమూర్తిలా ఉందామె.

* * *

పోలీస్‌స్టేషన్‌లో రెండో అనుభవం కాంతారావుతోసహా అందరిలో చాలా మార్పు తెచ్చింది. పరోక్షంగానైనా తమ అవస్థకి పార్వతీశమే కారణం అనే అభిప్రాయం అందరికీ



కలిగింది. పార్వతీశం కూడా వాళ్ళముందు మరెప్పుడూ కొత్త స్టేట్ హైస్టేర్ లాంటి ప్రస్తావన తీసుకురాలేదు. అతను పేకాట పూర్తిగా మానిందీ లేనిదీ మాత్రం తెలీదు.

కాంతారావు పార్వతీశాన్ని గడిచిన పదిరోజుల్లో ఓసారి కలిసాడు. అదీ ఆ రోజు శాంతతో సినిమాకెళితే ఇంటర్‌వెల్‌లో పార్వతీశం అతని ఫ్యామిలీ కూడా కనిపించడడంతో ఆశ్చర్యపోయాడు.

సినిమా అయిపోయాక అందరూ హోటల్‌కెళ్ళారు. శాంత పరిమళ కలుపుగోలుగా మాట్లాడుకోవడం చూసి కాంతారావు ఆనందించాడు.

"ఏమో అనుకున్నానుగానీ...మీ ఫ్రెండ్ పార్వతీశం చాలా సరదాగా మాట్లాడతాడండి. వాళ్ళావిడ కూడా నాకు బాగా నచ్చింది. అందుకే నన్ను మాట మీరు అన్నన్ని గంటలు అలా అతనితో గడిపేది అంది అర్థం చేసుకున్నట్లుగా.

కాంతారావుకి మళ్ళీ సంతోషం కలిగింది. పరోక్షంగా తనని సమర్థిస్తున్న శాంత మాటలకి.

ఆ రాత్రి కాంతారావు చెవిలో శాంత సిగ్గుపడుతూ ఏదో చెప్పింది. దానికి కాంతారావు స్ప్రింగ్‌లా ఎగిరిపడి "నిజమా వండ్రఫుల్" అని శాంతని వాటేసుకున్నాడు. అవును ఇంతవరకూ దాచావేం అన్నాడు విష్మారంగా.

"నాకూ నిన్ననే డాక్టర్ చెప్పింది. రేపు నా బర్త్‌డే. ఆ రోజు చెప్పి మిమ్మల్ని సర్‌ప్రయిజ్ చేద్దామనుకున్నాను. కానీ ఆగలేకపోయాను" సిగ్గుపడుతూ శాంత.

"అయితే మనింట్లో త్వరలో ఓ బుల్లి జోకర్" అంటూ నాలుక కరచుకున్నాడు కాంతారావు.

"ఏంటా పాడుపోలిక. మీకింకా పేకాట జాడ్యం వదిలినట్లులేదు"కోపంగా అంది శాంత.

"ఏంటో శాంతా మొదటిసారి తండ్రిని కాబోతున్నాను కదా"

"అంటే నాకు ఇది రెండోసారనా" నిలదీసింది శాంత.

"అబ్బా అది కాదు. ఆనందంతో నాకు మాటలు సరిగా రావడంలేదు" బుర్ర గోక్కుంటూ అన్నాడు కాంతారావు.

"ఇకనుంచి మనం పొదుపు మొదలెట్టాలి. మీరు చాలా త్యాగాలు చేయాల్సి వుంటుంది" శాంత సాలోచనగా అంది.

"నేనే ఎందుకు చెయ్యాలి. అసలు నేనేం దుబారా చేస్తున్నానని. ఆ మాట కొస్తే నువ్వే చెయ్యాలి. చీరల ఎగ్జిబిషన్స్ ఎంతవరకూ తగ్గిస్తారో చూద్దాంగా... అసలు నేను కొత్త బట్టలు కొనుక్కుని ఆరునెలలపైనే అయింది."

“ఆ పేకాటలో వేలువేలు తగలేసే బదులు బట్టలైనా కొనుక్కునుండాల్సింది ఎవరు కాదన్నారు”

పేకాట ప్రస్తావన వచ్చేసరికి తేలుకుట్టిన దొంగలా ఫీలయ్యాడు కాంతారావు.

ఆరోజు కాంతారావు చాలా ఉత్సాహంగా వున్నాడు. సరదాగా ఏదైనా మంచి హోటల్‌కెళ్ళి ఎంజాయ్ చేద్దాం అని శాంతని తొందర చేసాడు.

“గుడికెళ్దాం” అంది కాంతారావు చిత్రంగా చూసాడు.

“బోనస్ వచ్చింది. సరదాగా సెలబ్రేట్ చేసుకుందాం అంటే గుడికెళ్దాం అంటావేం? ఇంకా నయం భగవద్గీత చదువుకుందాం అనలేదు. అయితే అయింది ఖర్చు... పదపద” అన్నాడు కాంతారావు మొండిగా.

శాంత ఓ నిముషం ఆలోచించి “సరే నాకోటి కొనుక్కోవాలని ఎప్పట్నుంచో వుంది” అంది ఏటోచూస్తూ.

‘ఏమిటి శాంతా అది? నీకేం కావాలో చెప్పు కొందాం” వరాలిచ్చే వేల్పులా ఫీలవుతూ అన్నాడు కాంతారావు.

**“బహుశా మీరు వప్పుకోరేమో? ఎందుకులెండి”** అంది మూతి ముడుచుకుని.

“ఏమిటి బ్రెయిన్ టీజింగ్ గేమ్. సస్పెన్స్‌లో చంపక త్వరగా చెప్పు” చికాకు అణచుకుంటూ అన్నాడు కాంతారావు.

“నాకు రవ్వల గాజులు చేయించుకోవాలని ఎప్పట్నుంచో వుంది కానీ” అని ఆగింది

“ఓస్ ఇంతేనా సుమారు ఎంతవుతాయవి” ఊపిరి బిగపట్టాడు.



## ఉద్యమం!

వెంకట్రావుని ఆసక్తిగా అడిగాడు సుబ్బారావు “ఓ ప్రక్క బ్రాందీ షాపు నడుపుతూ సారా ఉద్యమంలో ఎలా పాల్గొన్నావురా?”

“ఊరికే నేనేదీ చెయ్యను. సారా నిషేధం జరిగాక మా బ్రాందీ అమ్మకాలు ఎలా పెరిగాయో చూసావా” గర్వంగా చెప్పాడు వెంకట్రావు.

—పోలిశెట్టి రఘు (వడ్లమూరు)

''అబ్బే ఎంతొనా...మహా అయితే పదివేలు కావచ్చు'' అంది తేలిగ్గా తానేదో కోటీశ్వరుడి కూతురైనట్టు.

కాంతారావు ఊపిరిపీల్చడం మర్చిపోయాడు. మరోక్షణంలో ప్రాణం పోతుందనగా భారంగా నిట్టూర్చి ''ఎంత తేలిగ్గా అన్నావ్ శాంతా బోనస్ మొత్తం 'బలి' పెట్టినా ఇంకా చాలా డబ్బే కావాల్సి వస్తుంది. పోనీ అవి మరోసారి చూడొచ్చు...మరేదైనా మన బడ్జెట్‌లో వచ్చేది తీసుకోరాదూ'' దీనంగా అన్నాడు.

''నాకేదీ అక్కర్లేదు..వద్దండీ అని మొత్తుకుంటున్నా మీరు బలవంతపెట్టారని నోరు తెరిచి అడిగాను'' అంది, అందరూ మరిదేనితోనో అడుగుతారనే అనుమానం కలిగిస్తూ.

కాంతారావుకి కూడా గిల్టీగా అనిపించింది. పాపం! శాంత లేక లేక అడిగిన కోరికని ఎలాగైనా తీర్చాలనే పట్టుదల పెరిగింది. అవును బ్యాంక్‌లో డబ్బు ఉందిగా అనే ఆలోచన తళుక్కున మెరిసింది. అంతలోనే అది శాంత తండ్రి ఆమె పేరున వేసింది. తన ఎకౌంట్ ఎప్పుడూ ఓవర్‌డ్రాఫ్ట్‌తోనే నడిచింది. శాంత తన జీవిత భాగస్వామి అయినా...ఆమె కోరిక తీర్చడానికి ఆ డబ్బు ముట్టుకోబుద్ధి కాలేదు. మరి ఏం చెయ్యాలా? అని సతమతమవుతుండగా...

శాంత అతని స్థితి అర్థం చేసుకుంది. కావాలనే ''పోన్లే...బ్యాంక్‌లో డబ్బుందిగా...అది డ్రాచేయండి'' అంది.

ఆమె ఊహించినట్టుగానే కాంతారావు ''ఛ..ఇప్పుడు దానితో ఏంపని? మరేదో ఏర్పాటు చెయ్యొచ్చులే''అన్నాడు చాలా అపనమ్మకంగా.

''ఇది మరీ బాగుంది. బ్యాంకులో డబ్బుపెట్టుకుని వేరే ఎవరిదగ్గరో ముష్టెత్తుకునే ఖర్మం పట్టింది?'' అంది ముష్టి అనే మాట వత్తిపలుకుతూ.

కాంతారావు అహం దెబ్బతింది.

పోనీలే ఈ ఒక్కసారికీ శాంత డబ్బు వాడుకుందాం అని ఊగిసలాడుతున్న మనస్సు శాంత మాటలకి మూలుగుతూ ముసుగేసుకుంది.

''అది కాదండీ...అసలు మీకు బాకీపడిన వాళ్ళు ఎంతమంది లేరు...? ఒక్కరన్నా మీరు అవసరం అంటే డబ్బు ఇవ్వరా...ఏం ఫ్రెండ్స్ పార్వతీశం ఇవ్వకూడదా? వాళ్ళకేనా అవసరాలు. మనకేమైనా కోట్లు మూలుగుతున్నాయి..''రెచ్చగొట్టింది శాంత.

కాంతారావు మొహం వాల్‌పోస్టరంత అయింది. అసలు తనకి ఆ ఆలోచనే రాలేదు. పార్వతీశం ఆరువేలపైనే ఇవ్వాలి. ఎప్పట్నుంచో ఇస్తానంటూ వాయిదావేస్తూ వచ్చాడు...కానీ..

తన సహజ ధోరణలో ''వాడైమయినా అనుకుంటాడేమో....ఎలా'' అని నసిగాడు.

భర్త మనస్సులో రేగుతున్న భావ సంఘర్షణని శాంత పూర్తిగా అర్థంచేసుకుంది.

''భలేవారే మీకు మొహమాటం అయితే...మీరు అడగొద్దులెండి. నేనే అడుగుతాను.

ఖంగారుపడకండి...అతన్ని కాదు...వాళ్ళావిడ్ని...సరేనా?'

దారిలో ''అదికాదు శాంత...పాపం! వాళ్ళావిడకేం తెలుసు ఈ విషయాలు..అయినా ఆమె ఏం చేస్తుంది'' అని మళ్ళీ నసిగుడు బేరం మొదలెట్టాడు.

''అసలు 'కీ' భార్యల దగ్గరే ఉంటుంది మీకేం తెలుసు?'' అని కాంతారావు మొహం మాడ్చుకోవడం చూసి ''అహ, అలా అందరి విషయంలో కాకదనుకోండి...ఏదో మీలా కొందరిని మినహాయించి'' అంది కాంతారావేదో చాక్‌లెట్ ఇస్తే చాలని చంకలు గుద్దుకునే చంటివెధవైనట్టు కాస్త ఊరగింపుగా.

వాళ్ళు వెళ్ళేసరికి పార్వతీశం ఇంట్లోలేదు. పరిమళ ఇద్దర్నీ సాదరంగా ఆహ్వానించింది. వాళ్ళ రెండో పుత్రరత్నంతో ఏవో సొల్లు కబుర్లు కాసేపు మాట్లాడి తర్వాత ఏదో పత్రిక తిరగేస్తూ ఉండిపోయాడు కాంతారావు.

శాంత, పరిమిళా వంటింట్లో ఏవో కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు.

శాంత డబ్బు ప్రస్తావన తెచ్చిందని అస్పష్టంగా వినిపిస్తున్న మాటాల్ని బట్టి గ్రహించాడు. ఉన్నట్టుండి ఏదో ఘర్షణ పడుతున్నట్టు వినిపించి ఖంగారుగా లేచాడు. ఇంతలో పార్వతీశం వచ్చాడు. కాంతారావుని పలకరించబోయి లోపల ఘర్షణకి ఓ క్షణం నిశ్చేష్టుడై, గబగబా లోపలికి పరిగెత్తాడు. కాంతారావు అదే పనిచేసాడు

భర్తలని చూసి తప్పు అవతలివాళ్ళదే అన్నట్టు ఏడుస్తూ వాళ్ళవైపు వచ్చారిద్దరూ.

''ఎవరండీ...ఇది నా ఇంటికొచ్చి నన్నూ, నా భర్తనీ నీచంగా మాట్లాడుతుందా? ఎంత దబ్బిస్తే మాత్రం అంత పెంపరా? ఆ ముష్టి డబ్బు ఎవడిక్కావాలి? విసరి అవతలపారెయ్యండి'' హిస్టీరియా వచ్చినదాన్లా అరుస్తోంది పరిమిళ.



## చెడువృద్ధి

అభివృద్ధి చెందిన దేశాలలోని స్కూలు పిల్లలలో చెడుఅలవాట్లు కూడా అభివృద్ధి చెందాయని...అమెరికాలో ఈ మధ్య జరిగిన ఓ సర్వేలో వెల్లడి అయింది. 'అట్లాంటా'కు చెందిన ఓ సంస్థ 'సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్' జరిపిన ఈ సర్వేలో అమెరికాలోని స్కూలు పిల్లలలో 50 శాతం ఆల్కహాల్ తాగుతారని, 25 శాతం సిగరెట్లు తాగుతారని, పదిశాతం మత్తుపదార్ధాలకు బానిస అయ్యారని తెలిపింది. అంటే...ఆర్థికంగా అభివృద్ధి చెందడమంటే పిల్లలు చెడు అలవాట్లకు బానిస కావడమన్నమాట! మరి అలాటి అభివృద్ధి మన దేశానికి కూడా కావాలంటారా?

—జూపిటర్

''అహ...ఎంత పౌరుషం పొడుచుకొచ్చిందే నీకు...అంత పెక్కుంటే మమ్మల్నెందుకు దేబిరించారు. పారేస్తుందట. ఏం దానమిస్తున్నాననుకుంటూన్నావా? ఏరుదాటి తెప్పతగలేసే రకాలు..ఛీ'' శాంత పూనకం ఆపాలని విశ్వప్రయత్నం చేసి విఫలం అయ్యాడు కాంతారావు.

అసలే ఇంటికి చిరాగ్గా వచ్చాడేమో పార్వతీశం...''కాంతం...ఏమిటీ రభస? డబ్బు కావాలని నువ్వే అడగొచ్చుగా...ఇంత డొంకతిరుగుడెందుకు? మీ ఆవిడ్ని కంట్రోల్ చెయ్య లేవా? అసహనంగా అన్నాడు.

''ఇంతకుమునుపు అయితే అతనెలా రియాక్ట్ అయ్యేవాడో కానీ పోలీస్ రెయిడ్ అనుభవాల వల్ల తలబొప్పికట్టి పార్వతీశం పట్ల కొంత ఉదాశీనత పెంచుకుని ఉండడంవల్ల ఆ రభసకి తనూ, శాంత కారణం అన్నట్టు.

తన భార్యదేమీ తప్పులేనట్టు మాట్లాడుతున్న పార్వతీశం వైఖరి కాంతారావుకి కోపం తెప్పించింది.

''ఏం మీ ఆవిడ్ని నువ్వు కంట్రోల్ చెయ్యలేవా''అయినా మా ఆవిడ అన్నదాంట్లో తప్పేముంది. డబ్బు అవసరంగా కావాలి అంది... ఆ మాటకే అంత తగవు పెట్టుకోవాలా?

''అసలు మా ఇంటికెవడు రమ్మన్నాడు...వచ్చినవాళ్ళు నేను వచ్చేవరకూ ఆగలేరా...త గుదునమ్మా అంటూ మీ ఆవిడ బయలుదేరింది. నువ్వే డైరక్టుగా అడగొచ్చుగా ఈ మధ్యలో ఆడపెత్తనాలేంటి?'' ఉక్రోషంగా అరిచాడు పార్వతీశం.

''మాకు ఉబుసుకోక నీ కొంపకి రాలేదు....నా డబ్బు...ఆమె డబ్బు ఒక్కటే. నా కిష్టమైన వాళ్ళతో అడిగిస్తాను. అంత నామోషీ అయితే తీసుకోకపోతే బాగుండేది. కాంతారావుకూడా విజృంభించాడు.

మరో అయిదు నిముషాల్లో పరిస్థితి విషమించింది. ఆ ఉద్రేకంలో పార్వతీశం కాకతాళీయంగా శాంతని పక్కకి నెట్టటడం, ఆమె తల గోడకు కొట్టుకుని రక్తం చిమ్మడం, అది చూసి కాంతారావు పిచ్చిగా అరుస్తూ పార్వతీశం మీదకి దూకడం...పోట్లాట... అలా చాలా సినిమ్యాటిక్‌గా జరిగిపోయాయి.

అతి కష్టంమీద వాళ్ళ వాళ్ళ భార్యలు ఇద్దర్నీ వేరుచేసారు. ఆ తాత్కాలికంగా వేరుచేయడం అనేది శాశ్వతంలోకి దారితీసింది.

తమ భార్యలు జాయింట్‌గా ఆడిన నాటకంలో తాము కేవలం పాత్రధారులు మాత్రమేననే కల్తీలేని నిజం పాపం! వాళ్ళకి బహుశా ఎప్పటికీ తెలీదేమో. అలా శనిలాంటి

ఫ్రెండ్‌ని వదిలించుకునే అంకం కూడా ముగిసింది. శాంత అనుకున్నది సాధించింది.

** ** **

కాంతారావుకి బాధ్యత పెరిగింది. అతను తండ్రి అయ్యాడు. శాంతకి ఇంతక్రితం మధ్యాహ్నాలు...భర్త ఇంటికి టైంకి రానప్పుడు సాయంకాలాలూ...ఒంటరితనంతో దుర్భరంగా గడపాల్సిన అగత్యం తప్పింది.

తన కొడుకు ఆలనా పాలనా ముచ్చట్లతో యుగం ఓ క్షణంలా గడిచిపోతోంది.

(అయిపోయింది) *

